www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 23-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 187 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: విదియ రా.10:47 తదుపరి తదియ, నక్షత్రం: విశాఖ తె. 4:51 తదుపరి అనూరాధ, వర్జ్యం: ఉ.8:09-9:57, దుర్ముహూర్తం: ఉ.10:04-10:50, మ.2:40-3:26, అమృతఘడియలు: రా.6:57-8:45, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:14, సూర్యాస్తమయం: 5:44 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాష్ట్రపతికి త్రుటిలో తప్పిన ముప్పు!


శబరిమలలో రాష్ట్రపతి; కుంగిన హెలికాప్టర్‌ను పక్కకు తోస్తున్న సిబ్బంది

హెలికాప్టర్ ల్యాండ్ అవుతుండగా కుంగిన కాంక్రీట్ 2

ఇరుక్కుపోయిన హెలికాప్టర్ చక్రం

సురక్షితంగా ముర్మును దించిన సిబ్బంది

కేరళలోని రాజీవ్ స్టేడియంలో ఘటన

చివరిలో హెలీప్యాడ్ మార్చడం వల్లే

ఇరుముడితో అయ్యప్ప దర్శనానికి ముర్ము



బంగారం తగ్గుముఖం

ఒక్కరోజులోనే రూ.4,690 తగ్గిన రేటు

తులం ధర రూ.1,25,890 2

amazon

ఐఫోన్ ఆర్డర్ చేస్తే.. ఐకూ ఫోన్ డెలివరీ!

అమెజాన్ కంపెనీ ఎండీకి అరెస్టు వారంట్లు

నోటీసులకు స్పందించకపోవడంతో

వినియోగదారుల కమిషన్ తీవ్ర చర్య 11

కర్నూలు జిల్లాలో కేసు నమోదు

అమెజాన్‌లో రోబోలు!

ఉద్యోగులను తగ్గించుకునే ప్రణాళికలు? 2

డీఏతో కలిపి వేతనాల బిల్లులు 13

డీటీఏ, పీఏవో అధికారులకు ఆర్థికశాఖ ఆదేశం


14

భీమవరం డీఎస్పీకి మంచి ట్రాక్ రికార్డు

ఉండి నియోజకవర్గంలో పేకాట శిబిరాల్లేవు

13 ముక్కలాటకు సుప్రీం ఓకే చెప్పింది

పవన్ ఇతర శాఖలపైనా దృష్టిపెట్టడం

సంతోషం: డిప్యూటీ స్పీకర్ రఘురామ


2

డీప్‌ఫేక్‌లపై కేంద్రం కొరడా

ఏఐ ద్వారా సృష్టించే కంటెంట్ మీద 'ఇది కృత్రిమం' అనే లేబుల్ తప్పనిసరి

వీడియోలకైతే తెర మీద 10% మేర..

ఆడియోకు తొలి 10 శాతం వ్యవధిలో..

కృత్రిమ కంటెంట్ అప్‌లోడ్ చేసే వారి నుంచి అంగీకారపత్రం

ఐటీ చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ కేంద్ర ఐటీ శాఖ ముసాయిదా పత్రం

₹100 కోట్లతో లైబ్రరీ

అమరావతిలో ఉచితంగా ప్రపంచ స్థాయి గ్రంథాలయం నిర్మిస్తాం

ముందుకొచ్చిన శోభా గ్రూప్

దుబాయ్ పర్యటనలో తొలి రోజే పెట్టుబడుల వేటకు సీఎం శ్రీకారం

పలువురు పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు

తిరుపతిలో స్పెషల్ క్యాన్సర్ సెంటర్ ఏర్పాటుకు బుర్జీల్ సంసిద్ధత

లాజిస్టిక్స్, గిడ్డంగుల్లో పెట్టుబడులకు షరాఫ్ గ్రూప్ ఆసక్తి

రైల్వే, పోర్టు లింకు ప్రాంతాన్ని గుర్తించాలని సీఎంకు సూచన

దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ యూనిట్‌కు ట్రాన్స్‌వరల్డ్ ఓకే

గ్రీన్ ఎనర్జీకి రాష్ట్రాన్ని చిరునామాగా మారుస్తున్నాం

ఏపీలో పెట్టుబడులకు అపార అవకాశాలు.. విశాఖ సదస్సులో భాగస్వాములవండి.. దుబాయ్ పారిశ్రామికవేత్తలకు బాబు ఆహ్వానం



ప్రముఖ రియాల్టీ సంస్థ శోభా గ్రూప్ ఫౌండర్ చైర్మన్ పీఎన్సీ మీనన్‌ను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రపంచ స్థాయి గ్రంథాలయ నిర్మాణానికి దుబాయ్‌లోని ప్రముఖ రియాల్టీ సంస్థ శోభా గ్రూప్ ముందుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దుబాయ్ పర్యటన ప్రారంభమైంది. మూడ్రోజుల పర్యటనలో భాగంగా మంత్రులు, అధికారులతో కలిసి బుధవారం దుబాయ్ చేరుకున్న ఆయన.. తొలి రోజే పలువురు పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు నిర్వహించారు. అందులో భాగంగా..శోభా గ్రూప్ చైర్మన్ రవి మీనన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. అమరావతిలో రూ.100 కోట్ల విరాళంతో ఉచితంగా ప్రపంచ స్థాయి గ్రంథాలయం నిర్మిస్తామని రవి మీనన్ వెల్లడించారు. అమరావతిని ప్రపంచంలో అత్యుత్తమ రాజధాని నగరంగా నిర్మిస్తున్నామని, దాని నిర్మాణంలో శోభా గ్రూప్ కూడా

మిగతా 13వ పేజీలో...



షరాఫ్ గ్రూప్ వైస్ చైర్మన్ షరాఫుద్దీన్ షరాఫ్‌తో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు

రేపు ప్రవాసాంధ్రులతో సీఎం సభ

ప్రవాసాంధ్ర బీమా పథకం ప్రారంభం

ఎవరైనా మరణిస్తే రూ.10 లక్షల వరకు పరిహారం


బ్రిస్బేన్ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేశ్

భారత్‌లో పెట్టుబడులకు ఆంధ్రా గేట్‌వే!

16 నెలల్లో 10 లక్షల కోట్ల పెట్టుబడులు

1.36 లక్షల కోట్లతో గూగుల్ డేటా సెంటర్

1.35 లక్షల కోట్లతో ఆర్సెలార్ స్టీల్ ప్లాంట్

పారిశ్రామికవేత్తలకు సులభతర విధానాలు

భాగస్వామ్య సదస్సుకు వచ్చి తెలుసుకోండి

ఆస్ట్రేలియాతో వాణిజ్యంలో ఏపీ కీలక పాత్ర

ఇంజనీరింగ్, వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల్లో మాదే ప్రముఖ స్థానం

పెట్రోలియం, ఔషధాల్లో కూడా..

బ్రిస్బేన్ రౌండ్ టేబుల్‌లో మంత్రి లోకేశ్ వెల్లడి

వివిధ వర్సిటీలు, సంస్థల అధినేతలతో వరుస సమావేశాలు

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారత్‌లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గేట్‌వేగా మారిందని రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ తెలిపారు. విజనరీ లీడర్ చంద్రబాబు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అమలు చేస్తోందన్నారు. ఫలితంగా గత 16 నెలల కాలంలో రూ.10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా బుధవారం ఆయన బ్రిస్బేన్‌లోని భారత రాయబార కార్యాలయంలో నిర్వహించిన బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో

మిగతా 12వ పేజీలో...

బ్రిస్బేన్ వేదికగా జగన్ విధ్వంసం బహిర్గతం!

మా భూములు లాక్కున్నారు.. న్యాయపరమైన చిక్కుల్లో పడేశారు 12

రాజకీయంగానూ దాడి చేశారు.. ఈ వేధింపులతో నా తండ్రిని కోల్పోయాను

ఇప్పుడు ఏపీలో పెట్టుబడి సాధ్యమా?.. పారిశ్రామికవేత్త శ్రావణ్ ఆవేదన

వారెవ్వా.. విశాఖ

'గూగుల్'కు ముందే 'రక్షణ'లో అంతర్జాతీయ ఖ్యాతి

నగరంపై చైనా, అమెరికా నిరంతర నిఘా

టోర్పడోలు, అణు జలాంతర్గాములు, యుద్ధ నౌకల నిర్మాణ కేంద్రం

తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం ఇదే..

ప్రత్యామ్నాయ కేంద్రంగా 'వర్ష' నిర్మాణం

అది.. అణు జలాంతర్గాముల స్థావరం

అణ్వస్త్ర సేవల కోసం 'బార్క్' ఏర్పాటు

కొవ్వాడలో న్యూక్లియర్ పవర్ ప్లాంటు

డీఆర్‌డీఓ ఆధీనంలో ఎన్ఎస్‌టీఎల్

ఐఎన్ఎస్ కళింగలో మిస్సైల్ డిపో

ఎస్‌బీసీలో న్యూక్లియర్ సబ్స్ నిర్మాణం



ఏఐ హబ్ ఏర్పాటుకు గూగుల్ ఎంచుకున్న నగరం.. విశాఖ!

ఈ ఒక్క ఒప్పందంతో ప్రపంచమంతా మార్మోగిన పేరు.. వైజాగ్!

ఇప్పుడు విశాఖపట్నం పరిచయం అక్కర్లేని నగరంగా మారింది. ప్రపంచమే విశాఖవైపు చూస్తోంది! అయితే... రక్షణ రంగంలో విశాఖ ఇప్పటికే దూసుకుపోతోందని మీకు తెలుసా? 'డిఫెన్స్'లో ఈ నగరానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యముందని మీకు తెలుసా? 'విశాఖలో ఏం జరుగుతోంది?' అని అమెరికా, చైనా వంటి దేశాలే కన్నేసి ఉంచే స్థాయి సంస్థలు అక్కడున్నాయని మీకు తెలుసా? విశాఖ నగరం... దేశ రక్షణకు అత్యంత కీలకం! దీనిపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం... 14లో..



హై స్పీడ్.. ఏపీ!

రాష్ట్రానికి 2 ఎలివేటెడ్ రైల్ కారిడార్లు

వ్యయం 5.42 లక్షల కోట్లు.. వేగం 350 కి.మీ.

హైదరాబాద్-చెన్నై 760 కి.మీ.. వ్యయం 3.04 లక్షల కోట్లు

రాష్ట్రంలో 7 జిల్లాలు.. 9 ప్రత్యేక స్టేషన్లు.. 504 కి.మీ. లైన్

హైదరాబాద్-బెంగళూరు 605 కి.మీ.. 2.38 లక్షల కోట్ల ఖర్చు

రాష్ట్రంలో 4 జిల్లాలు.. 6 ప్రత్యేక స్టేషన్లు.. 263 కి.మీ. లైన్

దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదనలు.. రూట్ మ్యాప్ సిద్ధం

నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ సహకారం

13


నిర్మాణ అంచనా వ్యయం రూ.5.42 లక్షల కోట్లు.. గంటకు 350 కిలో మీటర్ల వేగం.. ఆంధ్రప్రదేశ్ మీదుగా హైదరాబాద్-బెంగళూరు(605 కి.మీ), హైదరాబాద్-చెన్నై (760 కి.మీ.) హై స్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ల నిర్మాణానికి రైల్వే శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్రంలో కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల గుండా(ఏపీలో 263 కిలోమీటర్లు) హైదరాబాద్-బెంగళూరు కారిడార్ వెళ్లనుంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల మీదుగా (ఏపీలో 504 కి.మీ.) హైదరాబాద్-చెన్నై కారిడార్ నిర్మాణం జరగనుంది. ఈ రెండు హై స్పీడ్ కారిడార్ల నిర్మాణం పూర్తయితే బెంగళూరు, చెన్నైకు వెళ్లేందుకు పట్టే సమయం గణనీయంగా తగ్గనుంది.

జగన్ తప్పుడు నంబర్ ఇచ్చారు

కోర్టును తప్పుదోవ పట్టించారు

షరతులను ఉల్లంఘించారు

ఇక విదేశీ పర్యటనలకు అనుమతివ్వొద్దు

ప్రత్యేక కోర్టులో సీబీఐ వాదనలు

జగన్ అసలు ఫోనే వాడరు

గతంలోనూ వ్యక్తిగత సిబ్బంది నంబర్లే ఇచ్చారు

మాజీ సీఎం తరఫు న్యాయవాదుల వెల్లడి



హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడు (ఏ1), ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లండన్ పర్యటనకు న్యాయస్థానం విధించిన షరతులను ఉల్లంఘించారని సీబీఐ పేర్కొంది. తప్పుడు ఫోన్ నంబర్ ఇచ్చి వెళ్లారని, కోర్టును తప్పుదోవ

మిగతా 12వ పేజీలో...



భారతికి ఫోన్ చేసిందెవరు.. ఏం చెప్పారు?

11

తదుపరి దర్యాప్తునకు ఆదేశించండి

లేదంటే అసలు వ్యక్తులు తప్పించుకుంటారు

వివేకా హత్యపై సీబీఐ కోర్టులో సునీత పిటిషన్

దర్యాప్తు సంపూర్ణంగా జరగాలి.. లేదంటే తండ్రిని కోల్పోయిన నాకు మరింత అన్యాయం

అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేసి కస్టడీలో విచారణ జరపాలి

సప్లిమెంటరీ చార్జిషీటు దాఖలుకు ఆదేశాలివ్వండి

వివేకానందరెడ్డి కుమార్తె అభ్యర్థన

సుంకాలు 16% లోపే!

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై తుది దశలో చర్చలు

జున్నుమార్పిడి చేయని మొక్కజొన్న, సోయామీల్ దిగుమతులను పెంచుకునేందుకు భారత్ అంగీకారం!

ఈ నెలాఖరులోనే ప్రకటన వెలువడే అవకాశం

కేంద్ర అధికారవర్గాలను ఉటంకిస్తూ 'మింట్' కథనం

అమెరికా శ్వేతసౌధంలో ఘనంగా దీపావళి వేడుకలు

మోదీకి ట్రంప్ ఫోన్.. భారతీయులకు శుభాకాంక్షలు

రష్యా చమురు కొనుగోళ్లు భారత్ తగ్గిస్తుందని వ్యాఖ్య


వైట్‌హౌస్‌లో జరిగిన దీపావళి వేడుకల్లో దీపాలు వెలిగిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్/ న్యూఢిల్లీ, అక్టోబరు 22: భారత్‌కు అమెరికా అడ్డగోలు సుంకాల బాధ తప్పనుంది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంతో ఈ సమస్యకు పరిష్కారం దొరకనుంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చలతో సంబంధమున్న ముగ్గురు అధికారులను ఉటంకిస్తూ జాతీయ మీడియా సంస్థ 'మింట్' ఈ మేరకు కథనం ప్రచురించింది. దానికితోడు భారత్, అమెరికాలలో తాజా పరిణామాలు కూడా సుంకాల బాధ తొలగిపోయి, భారత్-అమెరికా మధ్య సంబంధాలు తిరిగి బలపడతాయనే సంకేతాలు ఇస్తుండటం గమనార్హం. మొత్తానికి భారత్‌పై సుంకాలు 15%-16%కు దిగివస్తాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై

మిగతా 2వ పేజీలో...

హెచ్-1బీ గందరగోళం.. వాల్‌మార్ట్‌లో నియామకాలు బంద్

న్యూఢిల్లీ, అక్టోబరు 22: హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచిన నేపథ్యంలో అమెరికా రిటైల్ దిగ్గజ సంస్థ వాల్‌మార్ట్.. ఉద్యోగ నియామకాల అంశంలో కీలక నిర్ణయం తీసుకుంది. హెచ్-1బీ వీసా స్పాన్సర్‌షిప్ అవసరమున్న వారికి ఉద్యోగాలు ఇవ్వడాన్ని తాత్కాలికంగా ఆపేసింది. అయితే, హెచ్-1బీ వీసా నూతన నిబంధనల నేపథ్యంలో దీనిపై పునరాలోచనలు చేస్తున్నామని వాల్‌మార్ట్ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. తమ వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు అవసరమైన నియామకాలు చేపట్టేందుకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. వాల్‌మార్ట్ ఇప్పటిదాకా 2,390 హెచ్-1బీ వీసాదారులకు ఉద్యోగాలు ఇచ్చింది. అయితే, వాల్‌మార్ట్ తీసుకున్న నిర్ణయం విదేశీ ఉద్యోగుల నియామకం అంశంలో అమెరికన్ సంస్థలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న గందరగోళానికి నిదర్శనమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అమెజాన్‌లో రోబోలు!

» 6లక్షల మంది ఉద్యోగుల స్థానంలో నియామకం!



న్యూఢిల్లీ, అక్టోబరు 22: ప్రముఖ దిగ్గజ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్.. తమ ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకునే ప్రయత్నం చేస్తోంది. రోబోల ద్వారా ఆ స్థానాలను భర్తీ చేసుకోవాలని యోచిస్తోంది. 2033 నాటికి 6లక్షల మంది దాకా ఉద్యోగులను తగ్గించుకొని.. రోబోలతో ఆ పనులు చేయించే ఆలోచనలో ఉంది. ఇందుకు సంబంధించి అమెజాన్‌కు చెందిన కీలక సమాచారంతో కూడిన పత్రాలు లీకైనట్లు న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొంది. ఇప్పటికే వేర్‌హౌస్‌లలో భారీగా రోబోలను వినియోగిస్తున్న అమెజాన్.. రానున్న రోజుల్లో వాటిని మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపింది. 75 శాతం పనులను ఆటోమేషన్ చేసేందుకు రోబోటిక్స్ బృందం పనిచేస్తోందని పేర్కొంది. అయితే దీనిపై అమెజాన్ సూటిగా స్పందించలేదు. లీకైన పత్రాలు పూర్తిగా సంస్థ ప్రణాళికను వెల్లడించేవి కావని అమెజాన్ అధికార ప్రతినిధి కెల్లీ నాంటెల్ అన్నారు. సంస్థలోని ఒక బృందం అభిప్రాయాలనే తెలియజేస్తాయని పేర్కొన్నారు. రానున్న హాలిడే సీజన్‌లో 2.5 లక్షల మంది ఉద్యోగులను నియమించుకునే ప్రణాళికను వెల్లడించినట్లు తెలిపారు.

బంగారం ధర తగ్గుముఖం

» మంగళవారంతో పోలిస్తే రూ.4,690తగ్గిన రేటు

» హైదరాబాద్‌లో 10గ్రాములకు రూ.1,25,890

న్యూఢిల్లీ, అక్టోబరు 22: బంగారం ధర క్రమంగా దిగివస్తోంది. మంగళవారంతో పోలిస్తే బుధవారం పసిడి రేటు 10గ్రాములకు రూ.4,690తగ్గిపోయింది. 24క్యారట్ల బంగారం ధర హైదరాబాద్‌లో రూ.1,25,890గా ఉంది. మంగళవారం ఇది రూ.1,30,580గా ఉంది. అక్టోబరు 17న బంగారం ధర రికార్డు స్థాయిలో రూ.1,32,770కి చేరుకున్న సంగతి తెలిసిందే. దీనితో పోలిస్తే బంగారం రేటు బుధవారానికి రూ.6,880 తగ్గింది. ఇక, అంతర్జాతీయ విపణిలో ఔన్సు(31.10గ్రాముల) బంగారం రేటు 4,053డాలర్లకు పడిపోయింది. డాలర్ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కాస్త తగ్గుముఖం పట్టడంతోనే బంగారం ధర తగ్గుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, వెండి ధర బుధవారం ఇండియాలో కిలోకు రూ.1.60లక్షలుగా ఉంది.

లోకం తీరు



హిందూ వారసత్వ చట్టం ఎస్టీలకు వర్తించదు!

» హిమాచల్ గిరిజనుల కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హిందూ వారసత్వ చట్టం షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)కు వర్తించదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాల్లో కుమార్తెలు గిరిజన ఆచారాల ప్రకారం కాకుండా హిందూ వారసత్వ చట్టం (హెచ్ఎస్ఏ) ప్రకారం ఆస్తిని పొందేందుకు అనర్హులని స్పష్టం చేసింది. హెచ్ఎస్ఏ ప్రకారం గిరిజనులు ఆస్తిని పొందేందుకు అర్హులేనంటూ హిమాచల్ హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. హెచ్ఎస్ఏలోని సెక్షన్ 2(2)కి హైకోర్టు తీర్పు విరుద్ధంగా ఉందని ధర్మాసనం పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 336లో నిబంధన(25) ప్రకారం ఏ షెడ్యూల్డ్ తెగ సభ్యులకూ హెచ్ఎస్ఏ వర్తించదని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, హెచ్ఎస్ఏను ఎస్టీలకు వర్తింపజేయాలంటూ సుప్రీంకోర్టు గతంలోనే కేంద్రానికి సూచించిన విషయాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలించాల్సిన సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించింది.

రాజకీయ చరమాంకంలో మా నాన్న!

» సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర సంచలన వ్యాఖ్యలు



బెంగళూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో నాయకత్వ మార్పుపై జోరుగా ఊహాగానాలు కొనసాగుతున్న సమయంలో సీఎం సిద్దరామయ్య కుమారుడు, ఎమ్మెల్సీ యతీంద్ర సిద్దరామయ్య చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. తన తండ్రి సిద్దరామయ్య రాజకీయ చరమాంకంలో ఉన్నారని, ఆయన తర్వాత కాంగ్రెస్ పార్టీని నడిపించేందుకు సతీశ్ జార్కిహొళి సమర్థుడని యతీంద్ర పేర్కొన్నారు. బెళగావి జిల్లా రాయభాగ తాలూకా కప్పలగుడ్డిలో బుధవారం జరిగిన కనకదాస విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దీంతో, రాష్ట్రంలో త్వరలో నాయకత్వ మార్పు ఉంటుందని యతీంద్ర సంకేతం ఇచ్చారంటూ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, యతీంద్ర కొంతసేపటికే యూటర్న్ తీసుకున్నారు. నాయకత్వ మార్పు ఊహాగానమే అంటూ కొట్టిపారేశారు. ఈ విషయంలో తమ పార్టీ అధిష్ఠానం ఇప్పటికే స్పష్టత ఇచ్చిందని తెలిపారు.

ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త ఏక్‌నాథ్ చిట్నిస్ కన్నుమూత



పుణె, అక్టోబరు 22: భారత అంతరిక్ష పరిశోధన రంగానికి విశేష సేవలందించిన ప్రముఖ శాస్త్రవేత్త, పద్మ భూషణ్ గ్రహీత డాక్టర్ ఏక్‌నాథ్ వసంత్ చిట్నిస్ (100) కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న చిట్నిస్, బుధవారం నాడు గుండెపోటు రావడంతో పుణెలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. భారత అంతరిక్ష కార్యక్రమ పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ చివరి సహచరులలో చిట్నిస్ ఒకరు. ప్రస్తుతం ఇస్రోగా రూపాంతరం చెందిన ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ తొలి నాళ్లలో ఆయన కీలకమైన పాత్ర పోషించారు. భారతదేశపు మొట్టమొదటి రాకెట్ ప్రయోగ కేంద్రం కోసం కేరళలోని తుంబాను ఎంపిక చేయడంలో కూడా చిట్నిస్ కీలకంగా వ్యవహరించారు. అప్పటి యువ శాస్త్రవేత్త అబ్దుల్‌కలాంకు మార్గనిర్దేశం చేశారు.

4 కోట్ల గడియారం ఆర్డరిస్తే.. రూ.400 విలువైనది వచ్చింది

» ఆన్‌లైన్ షాపింగ్‌లో మోసం.. చెన్నైలో పోలీసులకు ఫిర్యాదు

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ షాపింగ్‌లో బడా మోసం చెన్నైలో వెలుగుచూసింది. ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్‌లో రూ.4 కోట్ల విలువైన చేతి గడియారాన్ని చూసి కొనుగోలు చేసిన ఓ వ్యాపారి కుమారుడు.. తనకు అందిన రూ.400 విలువైన గడియారం చూసి షాక్ తిన్నాడు. దీనిపై కొట్టూరుపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఓ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఆ గడియారాన్ని చూసి ప్రముఖ వస్త్రదుకాణం యజమాని కుమారుడు ముచ్చట పడ్డాడు. వెంటనే దానిని కొనుగోలు చేయడానికి స్థానిక బోట్‌క్లబ్‌కు చెందిన ఓ ఏజెంట్‌ను సంప్రదించాడు. నిబంధనల్లో భాగంగా ఆ గడియారం కోసం ఆన్‌లైన్‌లో రూ.2.3 కోట్లు చెల్లించాడు. కానీ మంగళవారం అతనికి వచ్చిన పార్శిల్‌లో కేవలం రూ.400 విలువైన గడియారం మాత్రమే ఉండటం చూసి మోసపోయినట్లు గ్రహించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బిహార్‌లో మహాకూటమి సర్దుబాటు కొలిక్కి!

న్యూఢిల్లీ/పట్నా, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో మహాగఠ్‌బంధన్ కూటమిలోని పార్టీల మధ్య ఏర్పడిన సీట్ల సర్దుబాటు పంచాయితీ ఓ కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తోంది. 13 సీట్లపై ఆర్జేడీ, కాంగ్రెస్, సీపీఐ(ఎం) పార్టీల మధ్య ఏర్పడిన వివాదం చిలికిచిలికి గాలివానగా మారడంతో సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లోత్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దింపింది. ఆయన బుధవారం పట్నాలోని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ నివాసానికి వెళ్లి అక్కడ తేజస్వితో పాటు లాలూ యాదవ్, రాబరీదేవిలతో దాదాపు గంటపాటు చర్చలు జరిపారు. ఈ చర్చల్లో సీట్ల సర్దుబాటు విషయంలో స్పష్టత ఏర్పడిందని, మహా అయితే అయిదారు సీట్లలో కాంగ్రెస్, ఆర్జేడీల మధ్య స్నేహపూర్వక పోటీ ఉంటుందని గెహ్లోత్ చెప్పారు. ఇప్పటి వరకు ఆర్జేడీ 143, కాంగ్రెస్ 61 సీట్లలో పోటీ చేయనున్నట్లు ప్రకటించాయి. మిగతా 39 సీట్లను సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ (ఎంఎల్), వికాస్ శీల్ ఇన్సాఫ్ పార్టీలకు కేటాయించనున్నారు. గురువారం కూటమి నేతలంతా విలేకరుల సమావేశంలో పాల్గొని వారి మధ్య కుదిరిన సీట్ల సర్దుబాటును ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. కాగా, సీఎం అభ్యర్థిగా తేజస్వీ పేరునే కూటమి నేతలు ప్రకటించే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

నిపుణులను స్వదేశానికి రప్పిద్దాం!

» విదేశాల్లో స్థిరపడినవారిని ఆకర్షించేందుకు కేంద్రం ప్లాన్

న్యూఢిల్లీ, అక్టోబరు 22: ఉన్నత విద్యపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న విధానాలతో పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఈ నేపథ్యంలో అమెరికా సహా విదేశాల్లో స్థిరపడిన భారతీయ, భారత సంతతి పరిశోధకులు, విద్యా నిపుణులను స్వదేశానికి రప్పించి.. వారిని ఇక్కడి విద్యా సంస్థల్లో బోధించేలా, పరిశోధనలు చేసేలా కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. దేశ పరిశోధన, సృజనాత్మక రంగాలను బలోపేతం చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. గతంలో ఇలాంటి ప్రణాళికను పరిశీలించినప్పటికీ.. విధానపరమైన జాప్యం, అనిశ్చిత పరిస్థితులు వంటి అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. అయితే అమెరికాలో ఇటీవలి పరిణామాల నేపథ్యంలో మోదీ సర్కారు.. ఈ ప్రణాళికను కొత్తగా పరిశీలిస్తోంది. పరిశోధనలు లేదా బోధన కోసం నిర్దిష్ట కాలంపాటు భారత్‌లో గడిపేందుకు సిద్ధంగా ఉన్న వారిని తిరిగి తీసుకురావడం కోసం విద్య, శాస్త్ర సాంకేతిక శాఖలతో సంప్రదించి ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో వారికి ఉద్యోగాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి.

రాష్ట్రపతికి త్రుటిలో తప్పిన ముప్పు!

హెలికాప్టర్ ల్యాండ్ అవుతుండగా కుంగిన కాంక్రీట్.. కాంక్రీట్‌లో ఇరుక్కుపోయిన హెలికాప్టర్ చక్రం

పథనంథిట్ట, అక్టోబరు 22: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు త్రుటిలో ప్రమాదం తప్పింది. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం సాయంత్రం ముర్ము తిరువనంతపురం చేరుకున్నారు. బుధవారం ఉదయం ఆమె శబరిమల బయల్దేరారు. ప్రమదంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రపతి హెలికాప్టర్ ల్యాండ్ అవుతుండగా.. హెలీప్యాడ్‌లోని కాంక్రీట్ ఒక్కసారిగా కుంగిపోయింది. హెలికాప్టర్ చక్రం ఒకటి లోపలికి దిగిపోయింది. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది రాష్ట్రపతిని సురక్షితంగా హెలికాప్టర్ నుంచి కిందకు దించారు. ఈ ఘటనలో రాష్ట్రపతికి ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు వెల్లడించారు. అనంతరం ఆమె రోడ్డు మార్గంలో పంబకు బయల్దేరారు. హెలికాప్టర్ చక్రాన్ని బయటకు తీసేందుకు పలువురు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది దాన్ని తోస్తున్న చిత్రాలు పలు టీవీ చానళ్లలో ప్రసారమయ్యాయి. వాస్తవానికి రాష్ట్రపతి హెలికాప్టర్ పంబ సమీపంలోని నీలక్కల్ వద్ద దిగాల్సి ఉంది. కానీ, ప్రతికూల వాతావరణం కారణంగా ల్యాండింగ్ స్థలాన్ని ప్రమదం ప్రాంతానికి మార్చారు. "ప్రమదం ప్రాంతంలో హెలికాప్టర్‌ను ల్యాండ్ చేయాలని చివరి నిమిషంలో నిర్ణయించారు. అందువల్ల మంగళవారం రాత్రే ఇక్కడ హెలీప్యాడ్‌ను నిర్మించారు. దీంతో కాంక్రీట్ పూర్తిగా గట్టిపడలేదు. బుధవారం ఉదయం హెలికాప్టర్ దిగిన తర్వాత ఆ బరువును మోయలేక అది కుంగిపోయింది. చక్రం ఒకటి కాంక్రీట్‌లో ఇరుక్కుపోయింది" అని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు.



శబరిమలలో ఇరుముడితో పదునెట్టాంబడిపై రాష్ట్రపతి ముర్ము

పూర్తిగా భద్రతా వైఫల్యమే

రాష్ట్రపతి ముర్ము హెలికాప్టర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పడంపై కేంద్ర మాజీ మంత్రి మురళీధరన్ తీవ్రంగా స్పందించారు. ఇది పూర్తిగా భద్రతా వైఫల్యమేనన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి భద్రత విషయంలో కేరళ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే దానికి ఇదే నిదర్శనమన్నారు. భద్రతా వైఫల్యంపై దర్యాప్తు జరపాలన్నారు. అయ్యప్ప దయ వల్ల రాష్ట్రపతికి ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పారు.

ఇరుముడితో శబరిమలకు ముర్ము

రాష్ట్రపతి ముర్ము ప్రత్యేక కాన్వాయ్‌లో ఉదయం 11 గంటలకు పంబ చేరుకున్నారు. అక్కడి నదిలో కాళ్లు కడుక్కున్న ఆమె.. గణపతి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రధాన పూజారి విష్ణు నంబూద్రి ముర్ముకు ఇరుముడి కట్టారు. భద్రతాధికారులు సౌరబ్ నాయర్, వినయ్ మాథుర్‌లతో పాటు ముర్ము అల్లుడు గణేశ్‌చంద్ర హోంబ్రమ్‌కు కూడా ఇరుముడు కట్టారు. నల్ల చీరతో తలపై ఇరుముడి పెట్టుకొని రాష్ట్రపతి ముర్ము ప్రత్యేక వాహనంలో సన్నిధానానికి చేరుకున్నారు. పవిత్రమైన 18 బంగారు మెట్లు ఎక్కారు. అయ్యప్ప స్వామిని దర్శించుకొని, ఇరుముడి సమర్పించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్న తొలి మహిళా రాష్ట్రపతిగా నిలిచారు. అంతకుముందు 1970ల్లో అప్పటి రాష్ట్రపతి వీవీ గిరి శబరిమల అయ్యప్పను దర్శించుకున్నారు. ఆయన డోలీలో సన్నిధానానికి చేరుకున్నారు. తాజాగా ముర్ము ఫోర్ వీల్ డ్రైవ్ వాహనంలో సన్నిధానానికి వెళ్లారు.

మహిళల పథకంలో మగాళ్లు!

మహారాష్ట్రలో 'లడకీ బహిన్ యోజన'లో

12,431 మంది పురుషులకు లబ్ధి

వారిలో ప్రభుత్వ ఉద్యోగులు కూడా

ముంబై, అక్టోబరు 22: మహారాష్ట్రలో ప్రత్యేకించి మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకం 'ముఖ్యమంత్రి మాఝీ లడకీ బహిన్ యోజన'లో ఏకంగా 12 వేలమందికి పైగా పురుషులు అక్రమంగా లబ్ధిపొందారు. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. 13 నెలల పాటు ప్రతినెలా రూ.1500 చొప్పున నగదు అందుకున్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చినట్టు జాతీయ మీడియా వెల్లడించింది. మహారాష్ట్రలో కుటుంబ వార్షికాదాయం 2.5 లక్షల లోపు ఉన్న 21-65 ఏళ్ల మధ్య వయసు మహిళలకు ఈ పథకం కింద ప్రతినెలా రూ.1500 ఇస్తున్నారు. అయితే 12,431 మంది పురుషులతో పాటు అనర్హులైన 77,980 మంది మహిళలు (12 నెలల పాటు) ఈ జాబితాలో ఉన్నట్టు బయటపడింది. మొత్తం రూ.164.52 కోట్ల నిధులు దుర్వినియోగం అయినట్టు తేలింది. వీరందరూ అనర్హులుగా తేలడంతో ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించినట్టు మహారాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. లబ్ధిపొందిన వారిలో పురుషులతో కలిపి కనీసం 2400 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వారిపై క్రమశిక్షణా చర్యలు ప్రారంభించినట్టు వెల్లడించారు. ఇంకా వెరిఫికేషన్ కొనసాగుతోందని, అనర్హుల సంఖ్య మరింత పెరగవచ్చని పేర్కొన్నారు. అక్రమ చెల్లింపులకు సంబంధించి ఎలాంటి రికవరీ చేయలేదన్నారు.

మావోయిస్టు మద్దతుదారులపై నజర్!

» కేంద్ర బృందాల నిఘా

హైదరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా ఓవైపు భద్రతా బలగాలు ముందుకు సాగుతుండగా.. మరోవైపు మావోయిస్టు దళాలకు, నాయకత్వానికి పట్టణ ప్రాంతాల నుంచి ఆర్థిక , సైద్ధాంతిక మద్దతునిస్తున్న వారిపై కేంద్ర, తెలంగాణ రాష్ట్ర నిఘా వర్గాలు దృష్టి సారించాయి. ఇటీవల మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్.. పార్టీ వైఫల్యాలను ప్రశ్నిస్తూ ఆయుధాలతో లొంగిపోయిన సందర్భంలో, అంతకు ముందు ఆయన చేసిన ప్రకటనలపై స్పందించిన వ్యక్తులు, సంస్థల కార్యకలాపాలపై పోలీసులు దృష్టి పెట్టారు. ఈ క్రమంలో సోషల్ మీడియా పోస్టులనూ నిఘా వర్గాలు జల్లెడ పడుతున్నాయి. మల్లోజులతో పాటు ఆశన్న తదితరులు లొంగిపోవడం, పార్టీని పునర్‌నిర్మిస్తామన్న మావోయిస్టుల తాజా ప్రకటనల నేపథ్యంలో ఆయా అంశాలపై స్పందిస్తున్న వారెవరన్న దానిపై ఆరా తీస్తున్నారు. వారి కుటుంబ, ఉద్యోగ వివరాలు, ఆర్థిక లావాదేవీలను సైతం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో పోస్టులు తాత్కాలిక ఆవేశానికి గురై పెట్టారా? లేక మావోయిస్టు పార్టీతో సుదీర్ఘమైన అనుబంధాన్ని కొనసాగిస్తూ బహిరంగంగా నైతిక మద్దతు తెలుపుతున్నారా? అనే అంశాలను కూడా తెలంగాణ పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఎన్ఐఏ మావోయిస్టులకు ఆర్థిక అండదండలు అందిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి దాదాపు రూ.20 కోట్ల లావాదేవీలను గుర్తించింది. ఈ క్రమంలో కొన్ని ఎన్‌జీవో సంస్థలకు అందుతున్న విదేశీ నిధులు.. మావోయిస్టు కార్యకలాపాల కోసం దారి మళ్లుతున్నాయనే అనుమానంతో నిఘా బృందాలు ఆయా సంస్థల జాతకాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టు ఫ్రంటల్ ఆర్గనైజేషన్లలో గతంలో చురుగ్గా పనిచేసిన వారిపైనా, సానుభూతిపరుల పైనా పోలీసులు దృష్టి సారించినట్లు సమాచారం.

సుంకాలు 16% లోపే!

వైట్ హౌస్‌లో దీపావళి వేడుకల్లో ట్రంప్, భారత సంతతికి చెందిన వ్యాపారవేత్తలు



(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 26-27 తేదీల్లో మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరగనున్న ఆసియాన్ సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ ప్రకటన చేసే అవకాశం ఉందని అంటున్నాయి.

ఇరువర్గాలు దిగొస్తుండటంతో

అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంపై కొన్ని నెలలుగా చర్చలు జరుగుతున్నా.. వ్యవసాయ, పాడి రంగాలకు సంబంధించిన అంశాలపై పీటముడి పడింది. అదే సమయంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని కూడా అమెరికా డిమాండ్ చేస్తోంది. ఈ కారణంతో చూపుతూనే భారత్‌పై ఏకంగా 50శాతం సుంకాలను విధించింది. అయితే ఇరువర్గాల కొంతమేర దిగివచ్చాయని, దీనితోవాణిజ్య ఒప్పందంపై తుది చర్చలు కొలిక్కి వచ్చినట్టేనని తెలిసింది. చవకగా వచ్చే అమెరికా మొక్కజొన్న, పాల ఉత్పత్తులను అనుమతిస్తే తమ రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఇటీవలి వరకు భారత్ వాదిస్తూ వచ్చింది. దానికితోడు అమెరికా జన్యుమార్పిడి ఉత్పత్తులు, మాంసాహార పదార్థాలు వేసే ఆవులు/గేదెల నుంచి తీసిన పాల ఉత్పత్తులను సెంటిమెంట్, పర్యావరణపరంగా అనుమతించలేమని స్పష్టం చేసింది. అయితే చర్చల సందర్భంగా అమెరికా నుంచి జన్యుమార్పిడి చేయని సాధారణ మొక్కజొన్న, సోయామీల్ దిగుమతులను పెంచుకునేందుకు.. రష్యా నుంచి చమురు దిగుమతి తగ్గించి, అమెరికా నుంచి ఇథనాల్ దిగుమతులు పెంచుకునేందుకు భారత్ అంగీకరించినట్టు సమాచారం. దీనికి అమెరికా కూడా అంగీకరించడంతో ప్రతిష్టంభనకు తెరపడిందని చర్చలతో సంబంధం ఉన్న అధికార వర్గాలు వెల్లడించాయి. మోదీతో ట్రంప్ ఫోన్ చర్చలు, ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాల దిశగా అడుగులు పడుతున్నాయని పేర్కొనడం కూడా.. వాణిజ్య ఒప్పందం దిశగా సంకేతాలేనని పేర్కొన్నాయి. మొత్తంగా భారత్‌పై అమెరికా సుంకాలు 15%-16% మేరకు దిగిరానున్నాయన్నారు.

ఆశల వెలుగులు అందించాలి: మోదీ

తనకు ప్రత్యేకంగా ఫోన్ చేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ట్రంప్‌కు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు విదేశాంగశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. "మోదీకి ట్రంప్ ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారత్-అమెరికా సంబంధాలు మరింత బలోపేతం కావాలని, రెండు ప్రజాస్వామ్య దేశాలు ప్రపంచానికి ఆశ అనే వెలుగును ఇవ్వాలని మోదీ ఆకాంక్షించారు. అదే సమయంలో ఉగ్రవాదంపై పోరాటానికి, అంతర్జాతీయంగా పరస్పర సహకారానికి భారత్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు" అని వెల్లడించింది.

శ్వేత సౌధంలో దీపావళి వేడుకలు

హిందువులు ఘనంగా జరుపుకొనే దీపావళి పండుగ సందర్భంగా అమెరికా అధ్యక్ష కార్యాలయం శ్వేతసౌధంలో వేడుకలు నిర్వహించారు. అక్కడి కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి భారతీయ అమెరికన్ వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖులతో కలసి అధ్యక్షుడు దీపాలను వెలిగించారు. భారతీయులకు, భారతీయ అమెరికన్లకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోదీకి ఫోన్ చేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపానని ఈ సందర్భంగా ట్రంప్ వెల్లడించారు. మోదీ గొప్ప వ్యక్తి అని, తన స్నేహితుడని పేర్కొన్నారు. వాణిజ్యం, భారత్-పాక్ సంబంధాలు సహా తాము చాలా విషయాలు మాట్లాడుకున్నామని చెప్పారు. పాకిస్థాన్‌తో యుద్ధం వద్దని చెప్పానని ట్రంప్ పేర్కొన్నారు. "భారతీయులకు దీపావళి శుభాకాంక్షలు. ఇంతకుముందే ప్రధాని మోదీతో మాట్లాడాను. ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాల దిశగా అడుగులు పడుతున్నాయి. నా లాగే మోదీ కూడా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగియాలని కోరుకుంటున్నారు. అందుకే రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేయబోవడం లేదు. ఇప్పటికే కొనుగోళ్లు తగ్గిస్తూ వస్తోంది" అని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, అమెరికాలోని భారతీయ అమెరికన్లు నేతృత్వం వహిస్తున్న సంస్థలు ప్రపంచంలోనే పెద్దవని, వారు అమెరికా ఆర్థికాభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నారని పేర్కొన్నారు.

డీప్‌ఫేక్‌లపై కేంద్రం కొరడా

» ఏఐ ద్వారా సృష్టించే కంటెంట్ మీద 'ఇది కృత్రిమం' అనే లేబుల్ తప్పనిసరి

» ఐటీ చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ కేంద్ర ఐటీ శాఖ ముసాయిదా పత్రం



న్యూఢిల్లీ, అక్టోబరు 22: కృత్రిమమేధ (ఏఐ) సహాయంతో తప్పుడు సమాచారాన్ని, డీప్‌ఫేక్ ఆడియో, వీడియోలను రూపొందించి జనాల్ని మోసగిస్తున్న ఘటనలు పెరిగిపోతున్న దృష్ట్యా.. వాటి కట్టడికి కేంద్రం నడుంబిగించింది. ఈ మేరకు ఐటీ నిబంధనల చట్టం, 2021కి సవరణలు ప్రతిపాదిస్తూ కేంద్ర ఐటీ శాఖ బుధవారం ముసాయిదాను విడుదల చేసింది. ఏఐ ద్వారా సృష్టిస్తున్న డీప్‌ఫేక్ వంటివి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసి ప్రజలను మోసగిస్తున్నాయని, వ్యక్తులను అప్రతిష్ఠపాలు చేస్తున్నాయని, ఆర్థిక మోసాలకు కారణమవుతున్నాయని, ఎన్నికలను కూడా ప్రభావితం చేస్తున్నాయని ఐటీ శాఖ ఈ సందర్భంగా వెల్లడించింది. దీనిని నివారించటం కోసం ముసాయిదా ప్రతిపాదనలు తయారుచేశామని తెలిపింది. కనీసం 50లక్షల ఖాతాదారులున్న సోషల్ మీడియా సంస్థలు, ఇతర ప్లాట్‌ఫామ్స్‌కు ఈ నియంత్రణలు వర్తిస్తాయని పేర్కొంది. ఈ ముసాయిదా నిబంధనల ప్రకారం.. నిజమైన సమాచారంలాగే భ్రమింపజేసేలా అల్గారిథమ్ ఆధారంగా, కంప్యూటర్ ద్వారా తయారుచేసే కంటెంట్‌ను 'సింథటికల్లీ జెనరేటెడ్ కంటెంట్' (కృత్రిమంగా సృష్టించిన అంశాలు)గా పిలుస్తారు. ఈ తరహా కంటెంట్‌ను అప్‌లోడ్ చేసే వ్యక్తుల నుంచి ఇది కృత్రిమ కంటెంట్ అనే అంగీకారపత్రాన్ని సోషల్ మీడియా సంస్థలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక ఈ ఫేక్ ఆడియో, వీడియో సమాచారాన్ని వినియోగదారులు గుర్తించి జాగ్రత్తపడేలా.. వాటి మీద 'ఇది కృత్రిమ కంటెంట్' అనే హెచ్చరిక కనిపించాలి/వినిపించాలి. వీడియోకైతే.. అది కనిపించే తెర మీద 10 శాతం స్థలంలో ఈ హెచ్చరిక ఉండాలి. ఆడియో అయితే మొత్తం వ్యవధిలో తొలి 10 శాతం వ్యవధి మేర హెచ్చరిక వినిపిస్తూ ఉండాలి. కృత్రిమ కంటెంట్‌ను గుర్తించి, దానిపై నిర్దేశితస్థాయిలో హెచ్చరిక లేబుల్ ఉండేలా సోషల్ మీడియా సంస్థలు సాంకేతికపరంగా చర్యలు తీసుకోవాలి. ఈ ముసాయిదా ప్రతిపాదనలపై అభిప్రాయాల్ని, సూచనల్ని నవంబరు 6వ తేదీ వరకూ తమకు పంపించవచ్చని ఐటీ శాఖ ప్రజలకు పిలుపునిచ్చింది. కాగా, సైబర్‌మోసాల నుంచి వినియోగదారుల్ని రక్షించటానికి కొత్త యాంటీ స్కామ్ ఫీచర్లను ప్రవేశపెట్టినట్లు మెటా ప్రకటించింది.

విదేశీ కార్మికులకు వీడిన 'కఫాలా' పీడ

» సౌదీలో శ్రమదోపిడీకి స్వస్తి

» 1.3 కోట్ల మందికి తక్షణ ఊరట

రియాద్, అక్టోబరు 22: విదేశీ కార్మికులను తీవ్ర వివక్షకు, శ్రమదోపిడీకి గురిచేస్తున్న కఫాలా వ్యవస్థను సౌదీ అరేబియా ప్రభుత్వం రద్దుచేసింది. సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ రూపొందించిన విజన్-2030లో భాగంగా ఈ వ్యవస్థను తొలగించారు. భారత్, నేపాల్, బంగ్లాదేశ్ తదితర దక్షిణాసియా దేశాలకు, ఫిలిప్పైన్స్ వంటి ఆగ్నేయాసియా దేశాలకు చెందిన కార్మికులే సౌదీలో అత్యధికంగా పనిచేస్తున్నారు. ఈ నిర్ణయంతో దాదాపు 1.3 కోట్లమందికి కఠినమైన నిబంధనల నుంచి ఊరట లభించింది. స్పాన్సర్‌షిప్ ఆధారంగా విదేశీ కార్మికులను నియమించుకునే కఫాలా వ్యవస్థ 1950 నుంచి సౌదీలో అమల్లో ఉంది. గల్ఫ్ ఆయిల్ బూమ్ కాలంలో ఉబ్బిడిముబ్బిడిగా వచ్చిపడుతున్న విదేశీ కార్మికులను నియంత్రించడం కోసం ఈ వ్యవస్థను రూపొందించారు. కఫాలా అనే అరబిక్ పదానికి అర్థం స్పాన్సర్‌షిప్. ఈ విధానంలో ప్రతి విదేశీ కార్మికుడు స్థానిక స్పాన్సర్ అదుపాజ్ఞల్లో ఉండాలి. కఫీల్ అని పిలిచే ఈ స్పాన్సరే విదేశీ కార్మికుడి పని, నివాసం, చట్ట హోదా విషయంలో నిర్ణయాలు తీసుకుంటాడు. స్పాన్సర్లు తమ అదుపులోని కార్మికుల పాస్‌పోర్టులను తమ దగ్గర ఉంచుకోవడంతోపాటు వారికి భత్యాలను సకాలంలో చెల్లించేవారుకాదు. విదేశీ కార్మికుల కదలికలపై ఆంక్షలు విధించేవారు.

యూకే విద్యార్థులకు ఫీజుల షాక్!

ఇకపై ఏటా పెరుగుదల

న్యూఢిల్లీ, అక్టోబరు 22: ఇంగ్లాండ్‌లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఫీజుల షాక్ తగలనుంది. అక్కడి వర్సిటీలు ట్యూషన్ ఫీజులను ఇకపై ఏటా పెంచేందుకు సిద్ధమయ్యాయి. 2026 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించి, ఈ ఫీజులు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెరుగుతాయని యూకే విద్యా కార్యదర్శి బ్రిడ్జెట్ ఫిలిప్సన్ తెలిపారు. ఈ నిర్ణయంతో కేవలం ట్యూషన్ ఫీజులే కాక, విద్యార్థులు జీవన వ్యయాల కోసం తీసుకునే మెయింటెనెన్స్ లోన్‌లు కూడా ప్రతి సంవత్సరం పెరుగుతాయి. ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో వార్షిక ట్యూషన్ ఫీజు 9,535 పౌండ్లుగా ఉంది.

శ్రీగిరికి కార్తీక శోభ..


శ్రీశైలంలో ఆలయం పుష్కరిణి వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు.. (ఇన్‌సెట్) ఆకాశదీపం

నంద్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగం, శక్తిపీఠం కలిగిన ఏకైక క్షేత్రం శ్రీశైలంలో బుధవారం నుంచి కార్తీక మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నవంబరు 21వ తేదీ వరకు జరిగే ఉత్సవాల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచే రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. కిలోమీటర్ల పొడవున బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మల్లన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఇదిలా ఉండగా కార్తీకమాసంలో సాధారణ భక్తులకు సులభంగా దర్శనం కల్పించేందుకు పలు మార్పులు చేశారు. రూ.5వేల గర్భాలయ అభిషేకం టికెట్లు, రూ.1500 సామూహిక అభిషేకం టికెట్లను రద్దు చేసినట్టు ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. రోజూ విడతల వారీగా మల్లికార్జున స్వామి స్పర్శదర్శనం కల్పిస్తున్నట్లు తెలిపారు. శని,ఆది సోమవారాల్లో అంతరాలయంలో అమ్మవారికి జరిగే కుంకుమార్చనలను నిలిపివేసి, వేదాశీర్వచన మండపంలో నిర్వహిస్తామని తెలిపారు.

ఎన్నాళ్లీ కష్టాలు..?



చంపావతి నది ఉధృతంగా ప్రవహించినప్పుడల్లా విజయనగరం జిల్లా గజపతినగరం మండలం మర్రివలస గ్రామస్థులకు అవస్థలు తప్పడం లేదు. ఏటా వర్షాకాలంలో చంపావతి నది ఉధృతి కారణంగా ఆస్పత్రికి వెళ్లాలంటే ప్రాణాలకు తెగించి నది దాటుతున్నారు. ఇప్పటికైనా వంతెన నిర్మించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, గజపతినగరం

లేటరైట్ మైనింగ్ దోపిడీని అరికట్టాలి

- తవ్వకాల వెనుక గత ప్రభుత్వ పెద్దల హస్తం
- డిప్యూటీ సీఎంకు అనకాపల్లి జిల్లా గిరిజనులు ఫిర్యాదు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సుందరకోడ పంచాయతీ బమిడికలొద్ది, తోరడాల్లో జరుగుతున్న లేటరైట్ మైనింగ్ దోపిడీని అరికట్టాలని ఆ గ్రామాల గిరిజనులు డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాసానికి బుధవారం వచ్చిన గిరిజనులు అక్కడి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ తవ్వకాలు, దోపిడీ వెనుక గత ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. నిత్యం వందలాది లారీల్లో లేటరైట్ తవ్వి తరలిస్తున్నారని, తద్వారా కోట్లాది రూపాయలు గడిస్తున్నారని తెలిపారు. కానీ తమ గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించట్లేదని చెప్పారు. లేటరైట్ రవాణా చేసే లారీల కారణంగా జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. లేటరైట్ మైనింగ్ తక్షణం నిలిపివేయాలని, తమ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు.

లక్ష్మయ్యనాయుడు కుటుంబానికి అండగా ఉంటాం

- పరిహారం అందజేసిన మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం దారికానిపాడు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి లక్ష్మయ్యనాయుడు హత్య చాలా దారుణమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. లక్ష్మయ్యనాయుడు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.18లక్షల చెక్కును బుధవారం నెల్లూరు నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదుతోపాటు లక్ష్మయ్యనాయుడు కుటుంబ సభ్యులకు రెండు ఎకరాల చొప్పున మొత్తం ఆరు ఎకరాల భూమిని కేటాయించామన్నారు. ఆయన పిల్లల చదువుల ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, డీఆర్వో విజయకుమార్, నెల్లూరు ఆర్డీవో అనూష, ఎల్‌డీఎం ఎం.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మయ్యనాయుడు కుటుంబ సభ్యులకు చెక్కు అందచేస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్, ఎమ్మెల్యే ఇంటూరి తదితరులు

పెదకాకాని శివయ్య సేవలో హైకోర్టు న్యాయమూర్తి

పెదకాకాని, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావు దంపతులు బుధవారం దర్శించుకున్నారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు అనంతరం నిత్య కల్యాణ మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అర్చకులు స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి, లడ్డూ ప్రసాదాలు, శ్రీ స్వామి వారి చిత్రపటం అందజేశారు.


హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాల కృష్ణారావు దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న అర్చకులు

గుంటూరులో యూరోపియన్ ఆరోగ్య సంరక్షణ సేవలు

- మెడికవర్‌తో ఆదిత్య హాస్పిటల్స్ కీలక ఒప్పందం

గుంటూరు మెడికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన యూరోపియన్ ఆరోగ్య సంరక్షణ సంస్థ మెడికవర్ హాస్పిటల్స్‌తో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. గుంటూరు సమీపంలోని ఏటుకూరు, బుడంపాడు మధ్య జాతీయ రహదారి పక్కనే 350 పడకలతో అత్యాధునికంగా నిర్మించిన ఆదిత్య హాస్పిటల్‌లో చైర్మన్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పీ కృష్ణ స్రవంత్, మేనేజింగ్ డైరెక్టర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ అమూల్య, మెడికవర్ హాస్పిటల్స్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణ జి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ పి బుధవారం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ స్రవంత్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా పేరు పొందిన మెడికవర్ హాస్పిటల్స్‌తో భాగస్వామ్యం వల్ల మరింత విస్తృత శ్రేణిలో వైద్యసేవలు అందించే అవకాశం లభిస్తుందన్నారు. ఇటీవల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలకు ఆమోదం లభించినట్టు చెప్పారు. ఆస్పత్రిని నవంబరు 27న ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ ఇండియా చైర్మన్ డాక్టర్ అనిల్ కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ ఈ సహకారం గుంటూరు నగరానికి ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణను తీసుకురావాలనే మెడికవర్ లక్ష్యానికి అనుగుణంగా ఉందన్నారు. యూరోపియన్ ప్రొటోకాల్స్, సాంకేతికత, శిక్షణా వ్యవస్థలను అనుసంధానించడం ద్వారా గుంటూరు పరిసర ప్రాంతాల ప్రజలకు టర్షియరీ కేర్ వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నట్టు వెల్లడించారు.



ఆదిత్య, మెడికవర్ హాస్పిటల్స్ ప్రతినిధులు కృష్ణ స్రవంత్, అనిల్ కృష్ణ

శాంతిపై చర్యలు ఇంకెప్పుడు..?

- అసిస్టెంట్ కమిషనర్ నిర్బంధ ఉద్యోగ విరమణకు గతంలోనే నిర్ణయం
- అయినా దేవదాయ అధికారుల కాలయాపన
- మొన్న ఏపీపీఎస్సీకి లేఖ.. నిన్న ప్రభుత్వానికి..
- వైసీపీ హయాంలో అక్రమాలకు పాల్పడిన శాంతి
- అప్పటి కమిషనరే నేడు దేవదాయ కార్యదర్శి
- ఆమెపై చర్యలకు ఆమోదముద్ర వేస్తారా?



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

దేవదాయ శాఖలో వివాదాస్పద అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతిని నిర్బంధ ఉద్యోగ విరమణ చేయించే విషయంలో దేవదాయ శాఖ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఆమెపై మోపిన అభియోగాలన్నీ దాదాపు నిరూపితమయ్యాయి. ఆమె చేయని తప్పంటూ లేదని విచారణాధికారి తన నివేదికలో స్పష్టంగా పొందుపరిచారు. దేవదాయ శాఖ నిధుల దుర్వినియోగం, స్వయంగా అవినీతికి పాల్పడడమే గాక.. సిబ్బందిని కూడా అందుకు ప్రోత్సహించడం, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా మీడియాతో బహిరంగంగా మాట్లాడడం, రాష్ట్ర సర్వీసు (సీసీఏ) నిబంధనలను తుంగలో తొక్కడంతో పాటు నైతిక దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు తేల్చారు. దరిమిలా.. నిర్బంధ ఉద్యోగ విరమణ ఎందుకు చేయించకూడదో 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆగస్టు 16న శాంతికి దేవదాయ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులకు ఆమె వివరణ కూడా ఇచ్చారు. అసిస్టెంట్ కమిషనర్‌గా నిబంధనల ప్రకారమే వ్యవహరించానని, ఉల్లంఘనకు పాల్పడలేదని చెప్పిందే మళ్లీ చెప్పుకొచ్చారు. ఆమె వివరణ సంతృప్తికరంగా లేదని, నిర్బంధ ఉద్యోగ విరమణ చేయించాలని కమిషనరేట్ అధికారులు నిర్ణయించారు. గత నెలలోనే ఈ ప్రక్రియ మొత్తం పూర్తయింది. ఆమెను విధుల నుంచి పూర్తిగా తొలగించేందుకు దేవదాయ శాఖ ఫైలు సిద్ధం చేసింది. కేవలం కమిషనర్ ఆర్డర్ ఇవ్వడమే తరువాయి. ఈ దశలో.. ఏపీపీఎస్సీ ద్వారా నియమితులైన ఉద్యోగులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నా.. ముఖ్యంగా నిర్బంధ ఉద్యోగ విరమణ లాంటి చర్యలు తీసుకునే సమయంలో కచ్చితంగా ఏపీపీఎస్సీ అనుమతి తీసుకోవాలన్న నిబంధన ఉందని కొత్త రూల్‌ను కమిషనరేట్ అధికారులు తెరపైకి తీసుకువచ్చారు. దీంతో నిర్బంధ ఉద్యోగ విరమణ ఫైలుకు బ్రేకు పడింది. గత నెల రెండో వారంలో దేవదాయ శాఖ అధికారులు ఏపీపీఎస్సీకి లేఖ రాశారు. శాంతిని నిర్బంధ ఉద్యోగ విరమణ చేయించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. 20 రోజుల తర్వాత దేవదాయ శాఖ కమిషనరేట్‌కు ఏపీపీఎస్సీ నుంచి సమాధానం వచ్చింది. దేవదాయ కమిషనరేట్ నుంచి వచ్చే లేఖలపై తాము జవాబివ్వబోమని.. ప్రభుత్వం నుంచి వచ్చే లేఖలకు మాత్రమే స్పందిస్తామని.. అవసరమైతే ప్రభుత్వాన్ని అనుమతి కోరాలని అందులో సూచించారు. దీంతో దేవదాయ కమిషనరేట్ అధికారులు శాంతి విషయంలో ఏం చేయాలో స్పష్టత కోరుతూ.. ఏపీపీఎస్సీ నుంచి వచ్చిన లేఖను కూడా జత చేసి.. ప్రభుత్వానికి అంటే దేవదాయ శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. ప్రస్తుతం హరిజవహర్‌లాల్ ఆ శాఖ కార్యదర్శిగా ఉన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆయన దేవదాయ కమిషనర్‌గా పనిచేశారు. ఆయన హయాంలోనే అసిస్టెంట్ కమిషనర్‌గా శాంతి పలు అక్రమాలు, అరాచకాలకు పాల్పడ్డారు. అప్పట్లోనే అనేక ఆరోపణలు వచ్చినా ఆమెపై హరిజవహర్‌లాల్ ఎలాంటి చర్యలూ తీసుకోకపోగా.. కొన్ని చోట్ల అదనపు బాధ్యతలు కూడా అప్పగించేవారు. ఈ నేపథ్యంలో శాంతిని సాగనంపే నిర్ణయాన్ని ఆయన ఆమోదిస్తారా అనేది చూడాలి.

తొలి నుంచీ ఆలస్యమే..

శాంతి విషయంలో దేవదాయ కమిషనరేట్ మొదటి నుంచీ మెతకగానే వ్యవహరిస్తోంది. విచారణ జరిపే విషయంలో అధికారులు చాలా ఆలస్యం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎట్టకేలకు గతేడాది జూలై 2వ తేదీన ఆమెను సస్పెండ్ చేసి.. అభియోగాలు నమోదు చేశారు. సస్పెండ్ చేసి దాదాపు 15 నెలలు పూర్తయింది. నిర్బంధ ఉద్యోగ విరమణ చేయించాలని నిర్ణయించి.. సదరు ఫైల్‌ను ఏపీపీఎస్సీ, ప్రభుత్వం అంటూ తిప్పుతూనే ఉన్నారు. ఆమెపై చర్యల విషయంలో ఇంత ఆలస్యం ఎందుకు చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శాంతి అసిస్టెంట్ కమిషనర్‌గా కేవలం 6సీ ఆలయాలకు సంబంధించిన పరిపాలన వ్యవహారాలు మాత్రమే చూసుకోవాలి. కానీ ఆమె 6బీ, 6ఏ ఆలయాల వ్యవహారాల్లో జోక్యం చేసుకుని.. వాటి పరిధిలోని లీజులు, లైసెన్సుల కొనసాగింపునకు సంబంధించిన ఫైళ్లను దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయానికి పంపించారు. అధికారులు ఆమె అధికార పరిధిని ప్రశ్నించకుండా.. ఆమె పంపించిన ప్రతి ఫైలునూ ఆమోదించారు. ఆమె పరిధి కాకపోయినా లీజులు, లైసెన్సుల కొనసాగింపు ఫైళ్లను పంపడం.. వాటిని ప్రధాన కార్యాలయ అధికారులు ఆమోదించడం కూడా పెద్ద నేరం. అప్పట్లో దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆమెకు సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు ఎప్పటి నుంచో ఉన్నా.. శాఖ ఉన్నతాధికారులు ఏ ఊసే ఎత్తడం లేదు. ఎందుకంటే.. అప్పుడు అనుమతులిచ్చిన అధికారులే ఇప్పుడు కమిషనరేట్‌లో, సచివాలయంలో కీలకమైన పోస్టుల్లో ఉన్నారు. శాంతి పంపిన ఫైళ్లన్నీ బయటకు తీస్తే దేవుడి ఆదాయానికి ఎంత నష్టం జరిగిందో, ఆమెకు ఎవరెవరు సహకరించారో వెలుగులోకి వస్తుంది. ఇది బయటకు వస్తుందనే ఆమెపై చర్యలను దేవదాయ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఉద్యోగుల హక్కుల సాధనే ప్రధాన లక్ష్యం

- డీఏ జీవో సవరణ, హెల్త్‌కార్డులపై సీఎం స్పందన హర్షణీయం
- ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

విజయవాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల హక్కుల సాధనే ఏపీ ఎన్జీవో సంఘం ప్రధాన లక్ష్యమని, వారి సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటాన్ని కొనసాగిస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ స్పష్టం చేశారు. డీఏ జీవో సవరణ, హెల్త్‌కార్డుల అమలు వంటి అంశాల్లో సీఎం చంద్రబాబు స్పందించిన తీరుపై హర్షం వ్యక్తం చేశారు. సంఘం ఎన్టీఆర్ జిల్లా, క్యాపిటల్ సిటీ ఆఫీస్ బ్యారర్స్ సమావేశం విజయవాడలోని ఎన్జీవో హోంలో బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. గత ఆరేళ్లలో జరగని విధంగా ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చించి ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి హామీ ఇచ్చిందన్నారు. ఒక విడత కరువు భత్యం మంజూరు చేయడం, 60 రోజుల్లో హెల్త్‌కార్డు సేవలను ఉద్యోగులకు అందేలా చర్యలు తీసుకుంటామని.. కార్డులను ఇన్సూరెన్స్ పరిధిలోకి తీసుకురావడానికి అవకాశాలను పరిశీలిస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. డీఏ మంజూరు జీవోలో గందరగోళంపై వెంటనే స్పందించి జీవో 62, 63 విడుదల చేయడం పట్ల సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

బంగ్లాదేశ్ కోస్టుగార్డ్ ఆధీనంలో విజయనగరం జిల్లా మత్స్యకారులు

- సముద్రంలో వేటకు వెళ్లి చిక్కిన 8 మంది
- ఆందోళనలో కుటుంబ సభ్యులు
- హోం శాఖకు విన్నవించిన కలెక్టర్

విజయనగరం/భోగాపురం, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాకు చెందిన ఎనిమిది మంది మత్స్యకారులు సముద్రంలో వేట సాగిస్తూ బంగ్లాదేశ్ కోస్టు గార్డ్‌కు చిక్కారు. వివరాలు.. విజయనగరం జిల్లా భోగాపురం మండలం కొండ్రాజుపాలేనికి చెందిన మరుపల్లి చిన్నఅప్పన్న, మరుపల్లి రమేష్, సూరాడ అప్పలకొండ, మరుపల్లి ప్రవీణ్, సురపతి రాము, మైలపల్లి చిన్నఅప్పన్న, పూసపాటిరేగ మండలం తిప్పలవలసకు చెందిన నక్కారాము, వాసపల్లి సీతయ్య విశాఖపట్నంలోని జాలరుపేటలో నివాసముంటున్నారు. వీరంతా వడ్డాది సత్యనారాయణకు చెందిన పడవపై ఈ నెల 13వ తేదీన విశాఖ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లారు. ఈ క్రమంలో బుధవారం వేకువజామున సుమారు 2 గంటల సమయంలో సముద్రంలో బంగ్లాదేశ్ సరిహద్దు దాటారు. గుర్తించిన బంగ్లాదేశ్ కోస్టుగార్డు పడవతో పాటు ఎనిమిది మంది మత్స్యకారులనూ అదుపులోకి తీసుకొన్నారు. అంతకు కొద్దిక్షణాల ముందు వారు వాకీటాకీ ద్వారా సముద్రంలో దూరంగా వేట సాగిస్తున్న తమ సహచరులకు తాము బంగ్లాదేశ్ కోస్ట్ గార్డ్‌కు చిక్కిన విషయం తెలియజేశారు. ఈ సమాచారం అందుకున్న పడవ యజమాని మత్స్యకారుల కుటుంబీకులకు, కొండ్రాజుపాలెం నాయకుడు చిన్నారావుకు సమాచారం అందించారు. బంగ్లాదేశ్ కోస్టుగార్డుకు మత్స్యకారులు చిక్కినట్లు తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కాగా.. మత్స్యకారులు బంగ్లాదేశ్ కోస్ట్‌గార్డ్‌కు పట్టుబడిన విషయాన్ని హోంశాఖకు విన్నవించామని, వారిని క్షేమంగా తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తెలిపారు. విషయాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లామని, మత్స్యకార కుటుంబాలు ధైర్యంగా ఉండాలని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు సూచించారు.

రైతులకు 300 కోట్ల టోకరా

అంతర్రాష్ట్ర కేడీ దాల్‌మిల్ సూరి అరెస్టు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో రైతులను మోసగించడంతోపాటు ఎస్సీ, ఎస్టీలపై దాడులకు పాల్పడిన కేసుల్లో నిందితుడు, అంతర్రాష్ట్ర మోసగాడు మోరంశెట్టి సురేశ్ అలియాస్ దాల్‌మిల్ సూరిని తెలంగాణలోని వరంగల్ జిల్లా కేంద్రంలో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. దాల్ మిల్ సూరిపై ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల్లో 57 కేసులు ఉన్నాయని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ తెలిపారు. ఆ వివరాలను పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాకు ఆయన వివరించారు. పోలీసుల కథనం ప్రకారం, శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు పట్టణానికి చెందిన దాల్‌మిల్ సూరి రైతులకు అధిక లాభాలను ఆశ చూపి, అప్పుమీద వారు పండించిన ధాన్యం తీసుకునేవాడు. ఆ తరువాత డబ్బులు ఎగ్గొట్టేవాడు. ఇలా రైతులు, వ్యాపారులను మోసగించి రూ.300 కోట్లకు పైగా దోచేశాడు. ఎస్సీ, ఎస్టీలపై దౌర్జన్యం చేసేవాడు. ఆరునెలల క్రితం భూమి విషయంలో కొత్తచెరువులో గొడవ జరిగింది. ఈ ఘటనలో దాల్‌మిల్ సూరిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఒక్క సత్యసాయి జిల్లాలోనే ఇతనిపై 26 కేసులు ఉన్నాయి. మొత్తంగా 57 కేసులు నమోదయ్యాయి. ఈ వ్యవహారంలో దాల్ మిల్ సూరితోపాటు తమ్ము డు పాండు, కుటుంబ సభ్యులను కూడా విచారిస్తున్నారు. దాల్‌మిల్ సూరిపై పీడీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ తెలిపారు. నిందితుడు హైకోర్టులో వేసిన పిటిషన్ డిస్మిస్ కావడంతో కేసు మరింత బలపడిందన్నారు. నిందితుడు, అతడి కుటుంబ సభ్యుల ఆస్తులను జప్తు చేయనున్నట్టు తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఐరన్‌లేడీ నీడలో జపాన్

జపాన్‌లో చీటికీమాటికీ ప్రధానులు ఎందుకు దిగిపోతారన్నది వేరే చర్చ కానీ, మంగళవారం ఆ దేశం తన తొలి మహిళా ప్రధానిని ఎన్నుకొని చరిత్ర సృష్టించింది. పురుషాధిక్య రాజకీయాలకు మారుపేరైన జపాన్‌లో నూటముగ్గురు పురుష ప్రధానుల తరువాత, సనే తకైచీకి గద్దె నెక్కే అవకాశం దక్కింది. ఆ దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉన్నప్పుడూ, అధికార పార్టీ ఎల్‌డీపీ గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్న స్థితిలోనూ ఈమె చేతిలో అధికారం పెట్టి తోటివారంతా అద్భుతాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవలివరకూ ప్రధానిగా ఉన్న షిగెరు ఇషిబా నేతృత్వంలో ఆ పార్టీ ఎగువసభ ఎన్నికల్లో ఘోరపరాజయం చవిచూడడంతో, ఉభయసభల్లోనూ బలం మరింత క్షీణించింది. ఏడాదిమాత్రమే పదవిలో కొనసాగిన ఆయన విధిలేక రాజీనామా చేయడంతో ఈ రక్షకురాలు కావలసివచ్చింది. ఈ నెలారంభంలో అనేకమంది దిగ్గజాలను ఓడించి ఎల్‌డీపీ నేతగా ఆమె ఎన్నిక కావడమే నిజానికి ఒక చరిత్ర. ఐదేళ్ళలో నాలుగోప్రధానిగా ప్రజలముందుకు వచ్చిన అరవైనాలుగేళ్ళ ఈ అతివాద నాయకురాలు రాజకీయంగానూ, ఆర్థికంగానూ చేయాల్సింది చాలా ఉంది.

ఎన్నికల సంస్కరణలకు సంబంధించి తలెత్తిన వివాదంతో ఎల్‌డీపీకి సుదీర్ఘకాలంగా మద్దతు ఇస్తున్న కొమిటో పార్టీ భాగస్వామ్యం నుంచి తప్పుకోవడంతో ఇప్పుడు కొత్త ప్రధాని మరో మితవాద పార్టీని భాగస్వామిగా తెచ్చుకొని పార్లమెంట్‌లో స్వల్పమెజారిటీతో గట్టెక్కేశారు. మాజీ ప్రధాని షింజో అబే ఆర్థికవిధానాలను సమర్థించే ఈ మాజీ ఆర్థికమంత్రికి ఐరన్‌లేడీగా ప్రజల్లో గుర్తింపు ఉంది. ప్రభుత్వం తన భారీ వ్యయంతో పారిశ్రామికవేత్తలకు అండగా నిలవాలనే ఈమె బ్యాంక్ ఆఫ్ జపాన్‌ను పిసినారిగా తరచూ ఆడిపోసుకొనేవారట. ఆమె అనుసరించబోయే ఆర్థికవిధానాలు ఏమిటన్నవి సుస్పష్టం. తదనుగుణంగానే ఆమె తానుమెచ్చిన మరో మహిళను ఆర్థికమంత్రిగా తెచ్చిపెట్టుకుంటారన్నదీ నిజమే అయింది. అయితే, పరమ ఛాందస జపాన్ సమాజంలో మహిళల హక్కులు, వారి నెలసరి సమస్యల గురించి కూడా బహిరంగంగా మాట్లాడే ఈ మహిళా ప్రధాని తన మంత్రివర్గంలో పెద్దసంఖ్యలో మహిళలకు స్థానం కల్పిస్తారన్న ఆశలు మాత్రం తలకిందులైనాయి. ఇరవైమంది మంత్రివర్గంలో ఆమె ఇద్దరికి మాత్రమే చోటిచ్చారు. దీంతో ఆమె మహిళా పక్షపాతి కాదంటూ గతంలో చేసిన కొన్ని వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో మళ్ళీ చక్కర్లు కొట్టడం ఆరంభించాయి. మగాళ్ళు గుర్రాల్లా కష్టపడి సంపాదించాలనీ, ఆడవాళ్ళు వారికి వెన్నుదన్నుగా నిలవాలనీ, అలాగే, పెళ్ళయిన జంట ఒకే ఇంటిపేరుతో వ్యవహరించాలనే వాదనలు చేసే ఈమె నుంచి విప్లవాలు ఆశించలేమని కొందరు విమర్శలు చేస్తున్నారు. మహిళల్లో కంటే పురుషుల్లోనే అధిక క్రేజ్ ఉన్నందున, స్త్రీ పక్షపాతిగా కనిపించి పార్టీలోని మిగతా నాయకులను, జపాన్ పురుషాధిక్య సమాజాన్ని ఆమె ఇబ్బంది పెట్టదల్చుకోలేదేమో. ఒక స్త్రీ ఈ అత్యున్నత స్థానాన్ని అధిరోహించడానికి 120 సంవత్సరాలు పట్టిన చోట, ఆమె పార్టీ సైతం మహిళాప్రాతినిధ్యాన్ని వెనకపట్టుపట్టించిన స్థితిలో తక్షణ పరిష్కారాలు అసాధ్యం.

అంతర్గత వైరాలు, ఆధిపత్యపోరుతో సతమతమవుతున్న ఆమె పార్టీ ఒక్కటిగా లేదు. ప్రజలు కూడా ఎల్‌డీపీ పట్ల సానుకూలంగా లేరు. జపాన్ గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్న స్థితిలో, దేశీయంగా కొత్త ప్రధాని చేపట్టబోయే సంస్కరణలతో పాటు, అమెరికా అధ్యక్షుడి కరుణాకటాక్షాలు కూడా ఎంతో ముఖ్యం. పేరుకు మిత్రదేశమే అయినప్పటికీ, భారీ సుంకాలతో డోనాల్డ్ ట్రంప్ జపాన్‌మీద కూడా కక్షతీర్చుకున్నారు. తదనంతరం వాణిజ్య ఒప్పందం కుదిరినప్పటికీ, ట్రంప్ ఒత్తిడిమేరకు దిగుమతులు కూడా పెంచుకున్న జపాన్ ఎగుమతులు పడిపోయి కుదేలైంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంలో భాగంగా, ట్రంప్ తనకు నచ్చిన చోట ఖర్చుచేయగలిగేందుకు వీలుగా ప్రభుత్వనిధుల్లో 550 బిలియన్ డాలర్లు పెట్టుబడిపెట్టేందుకు జపాన్ గతంలో అవగాహన కుదుర్చుకుందట. ఈ నెలాఖరులో జపాన్ వస్తున్న ట్రంప్ ఆ విషయాన్ని గుర్తుచేయవచ్చు. వ్యక్తిగత స్నేహాలే దౌత్య సంబంధాలను నిర్ణయించే ట్రంప్ వైఖరి కొత్త ప్రధానికి తెలియనిదేమీ కాదు. ఈనెలారంభంలో ఆమె ఎల్‌డీపీ నేతగా ఎన్నికకాగానే జపాన్ నుంచి శుభవార్త అందింది అంటూ తనలాగానే మరో మితవాది మిత్రదేశానికి నాయకత్వం వహిస్తున్నందుకు ట్రంప్ సంతోషించారు. అమె ఎంతో తెలివైనదనీ, గౌరవనీయురాలనీ ప్రశంసించారు. ఎంతోకాలంగా ఆశిస్తున్న ప్రధాని స్థానాన్ని మూడోప్రయత్నంలో కానీ దక్కించుకోలేకపోయిన తకైచీని ట్రంప్ సైతం ఇబ్బందిపెట్టకపోవచ్చు.

ట్రైబ్యునల్ ముందు తెలంగాణ వింత ప్రతివాదం

ప్రస్తుతం బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ ముందు జరుగుతున్న కృష్ణా జలాల పంపిణీ విచారణలో చట్టాల వివరణ, నిరూపణ చాలా ప్రాముఖ్యం కలిగిన అంశం. 'చట్టాల యోగ్యత'పై తెలంగాణ వింతయైన అనేక ప్రతివాదనలను ఎంచుకున్నది. వాటిలో... 'కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్‌లో సెక్షన్-3 ప్రకారం 'బచావత్ ట్రైబ్యునల్ చేసిన మొత్తం 811 టీఎంసీల పంపిణీని రద్దుగా భావించి, ఇరు రాష్ట్రాల మధ్య వాటాలను పునఃపంపిణీ చేయాలి!' అలాగే బచావత్ ట్రైబ్యునల్ 811 టీఎంసీలను గుంపగుత్తగా కేటాయింపులు చేసిందనీ, అలా కాకుండా ప్రాంతాల వారీగా పంపిణీ చేయాలంది. అంతేకాదు, ట్రైబ్యునల్-2 ఉమ్మడి రాష్ట్రానికి చేసిన 65 శాతం విశ్వసనీయ జలాలు, మిగులు జలాల మొత్తం కేటాయింపులను బేసిన్ ప్రాంతంలోని తమ ప్రాజెక్టులకు కేటాయించవచ్చని తెలంగాణ తెలిపింది. మిగతా రాష్ట్రాలకంటే లోటు సంవత్సరాల్లో తాము ఎక్కువ నష్టపోతున్నామనీ, ఆంధ్రప్రదేశ్ కడపటి రాష్ట్రం కాదు కనుక మిగులు జలాలు కూడా తమకే చెందాలనీ తెలంగాణ వాదించింది. కృష్ణా బేసిన్ లోపలి, బయటి ప్రాజెక్టులతో పాటు పులిచింతల ప్రాజెక్టు, కారీ ఓవర్ స్టోరేజ్‌కు సంబంధించిన అనేక అంశాలను ట్రైబ్యునల్ ముందు ప్రతిపాదించింది.

మొత్తంగా ఆంధ్రప్రదేశ్ నుంచి సింహభాగం కృష్ణా జలాలను లాగేసుకోవాలనే తెలంగాణ వ్యూహం రచించినట్లుంది. పై వాదనలు ఎంత సమంజసంగా ఉన్నాయో వేరే చెప్పనక్కరలేదు. ప్రస్తుతమున్న చట్టాలు తమకు సంబంధించవని తెలంగాణ చెబుతోంది. చివరకు ఏ విభజన చట్టం ద్వారా తెలంగాణ ఏర్పడిందో ఆ చట్టాన్ని కూడా కృష్ణాజలాల పంపిణీ పరంగా ఒప్పుకోనంటోంది ఆ రాష్ట్రం. ఈ చట్టంలో ఇరు రాష్ట్రాలకు విభజనకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో అమలులో ఉన్న నీటి వాటాల్లో మార్పుండదని స్పష్టంగా ఉంది. ఇదీ వర్తించదని తెలంగాణ చెప్తోంది. అలాగే 1956–2002 సవరణ అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టంలోని నాలుగో నిబంధనకు కూడా చెల్లుబాటు చేస్తోంది. అంటే విభజన మూలంగా సాగుకు ఆంధ్రప్రదేశ్ ఇబ్బందులు పడాలా? ట్రైబ్యునల్ 2016 అక్టోబర్ 19న వెలువరించిన ఉత్తర్వుల్లో చాలా రూఢీగా చెప్పింది. 2014 చట్టంలో 'నీటి కేటాయింపులు ఆంధ్రప్రదేశ్‌కు తగ్గించి తెలంగాణాకివ్వాలి' అని లేదనీ, ప్రస్తుత తెలంగాణ జనాభాకు సంబంధించి విభజనకు ముందున్న యథాపూర్వ స్థితి (స్టేటస్ కో) మార్చాల్సిన అవసరం లేదనీ అభిప్రాయపడింది.



ఆంధ్రప్రదేశ్ నుంచి సింహభాగం కృష్ణా జలాలను లాగేసుకోవాలనే తెలంగాణ వ్యూహం రచించినట్లుంది. ఏ విభజన చట్టం ద్వారా తెలంగాణ ఏర్పడిందో ఆ చట్టాన్ని కూడా కృష్ణాజలాల పంపిణీ పరంగా ఒప్పుకోనంటోంది ఆ రాష్ట్రం. కానీ, చట్టాలకు తెలంగాణ అతీతం కాదనీ, ఆ రాష్ట్రం కోసం తాము నష్టపోవాల్సిన అవసరం లేదనీ ట్రైబ్యునల్ ముందు ఏపీ వాదించాలి.

సెక్షన్-3 ప్రకారం విచారించాలని చెబుతూ కేంద్ర ప్రభుత్వం వెలువరించిన నోటిఫికేషన్‌లో ఈ విధంగా ఉంది. 'గుంపగుత్తగా ట్రైబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీల కృష్ణా జలాలను ఇరు రాష్ట్రాలకు పంచేందుకు పరిగణనలోకి తీసుకోవాలి. అదే ట్రైబ్యునల్ ప్రస్తావించిన అదనపు జలాలను (811కు పైబడి) కేటాయించినట్లయితే వాటిని కూడా పంచాలి. పోలవరం ప్రాజెక్టు నుంచి గోదావరి ట్రైబ్యునల్ కృష్ణాబేసిన్‌కు అనుమతించిన పరిమాణం కంటే అదనంగా గోదావరి జలాల తరలింపు ప్రతిపాదనలున్నా, ఆ జలాలనూ ఇరు రాష్ట్రాల మధ్య పంచాలని కూడా నోటిఫికేషన్‌లో ఉంది.

ఈ నోటిఫికేషన్‌లో ట్రైబ్యునల్-2 ప్రస్తావన లేదు. ట్రైబ్యునల్-1 కేటాయింపుల గురించే తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్‌లో బచావత్ ట్రైబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీలను పంపిణీ చేయాలని చెప్పింది కానీ, 'పునః పంపిణీ' అనలేదు. 2002 సవరణ చట్టానికి, 2014 విభజన చట్టానికి అతీతంగా పునఃపంపిణీ చేయాలని కూడా లేదు. '811 టీఎంసీలకు అదనంగా అవిభక్త రాష్ట్రానికి ట్రైబ్యునల్ ఏమి కేటాయింపులు చేసింది?' అంటే ఇక్కడ రెండు అంశాలు కన్పిస్తాయి. ఒకటి 811 టీఎంసీలకు అదనంగా 150 టీఎంసీలను కారీఓవర్ స్టోరేజ్‌గా శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో నిల్వ చేయడానికి అనుమతించింది. కృష్ణానదిలో 75 శాతం విశ్వసనీయ లభ్యతగా నిర్ణయించబడిన 2,130 టీఎంసీల కంటే అదనంగా లభ్యమయ్యే మిగులు జలాలను హక్కులేని జలాలుగా వినియోగించుకోవచ్చని కూడా చెప్పింది.

రెండు ట్రైబ్యునల్స్ కూడా బేసిన్ లోపల, బేసిన్ బయట ప్రాజెక్టుల మధ్య వివక్ష చూపలేదు. తెలంగాణ చెబుతున్నట్లు బేసిన్ బయట ప్రాజెక్టులకు నీటి సరఫరాను ఆరుతడి పంటలకు మాత్రమే పరిమితం చేయకూడదని ఏపీ వాదించాలి. నాగార్జునసాగర్ ఆయకట్టులో మాగాణి మెట్ట పంటల విస్తీర్ణాలున్నాయి. ప్రస్తుతం తెలంగాణ ఆవిర్భవించింది కాబట్టి, అయిదు దశాబ్దాలుగా కొనసాగుతున్న విధానాన్ని తమ రైతులు మార్చుకోవాల్సిన అవసరం లేదని ఆంధ్రప్రదేశ్ తేల్చిచెప్పాలి.

పోలవరం నుంచి మళ్లించిన 80 టీఎంసీల్లో కర్ణాటక, మహారాష్ట్రకు భాగాలు కేటాయించగా మిగిలిన 45 టీఎంసీలను తమ రాష్ట్రానికి చెందాలని తెలంగాణ అంటోంది. కానీ 'గోదావరి ట్రైబ్యునల్ అనుమతించిన 80 టీఎంసీల కంటే అదనంగా తరలింపు ప్రతిపాదనలుంటే వాటిని కూడా పంచాలి' అని కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్‌లో ఉంది. అంతేకానీ 80టీఎంసీల్లో మిగిలిన 45 టీఎంసీల గురించిన ప్రస్తావనే లేదు.

ట్రైబ్యునల్-1 అనుమతించిన అదనపు జలాల వినియోగంలో కారీఓవర్ స్టోరేజ్‌కు నిర్దిష్ట కేటాయింపు లేదు. ఇది రిజర్వాయర్ నిర్వహణకు సంబంధించినది. ఉమ్మడి రాష్ట్ర రిజర్వాయర్లయిన శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నిర్వహణ ప్రస్తుతం కృష్ణా మేనేజ్‌మెంట్ బోర్డు పరిధిలో ఉంది. కాబట్టి కేఎంబీ స్వాధీనంలోనే ఆ స్టోరేజ్‌ను ఉంచాలి. అంతేగానీ రాష్ట్రాలకు పంచకూడదు. పంచితే రిజర్వాయర్ల నిర్వహణ పాక్షికంగా బోర్డు పరిధి నుంచి తొలగించినట్లవుతుంది.

కృష్ణా డెల్టాలోని పంటలకు పులిచింతల నుంచి నీటి విడుదల అవసరమవుతుంది. ఈ రిజర్వాయర్ కృష్ణా డెల్టా అవసరాల కోసమే బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా నిర్మించారు. అంతేగానీ సాగర్ ఆయకట్టుకు పంపింగ్ కోసం కాదు. పులిచింతల దిగువ లభ్యమయ్యే నీటిని డెల్టాకు ఉపయోగించడంలో అనిశ్చితి ఉంటుంది. మున్నేరు, పాలేరుల్లో నీటి ప్రవాహం వాటి పరీవాహక ప్రాంతాల్లో వర్షపాతం మూలానే సంభవిస్తుంది. కానీ అప్పుడు వర్షాలు కురవడం వల్ల పంటలకు నీటి అవసరాలు తగ్గుతాయి. దాంతో ఆ రెండు పాయల నుంచి వచ్చిన నీటిని సముద్రంలోకి వదలాల్సి వస్తున్నది. ఈ అనిశ్చితి గమనించే ట్రైబ్యునల్-1 నాగార్జునసాగర్ నుంచి డెల్టాకు నీటి విడుదలను అనుమతించింది. ఆ రిజర్వాయర్‌లో కారీఓవర్ స్టోరేజ్ కూడా కృష్ణా డెల్టాను దృష్టిలో ఉంచుకుని చేసినదని ట్రైబ్యునల్‌కు నొక్కి చెప్పాలి. నాగార్జునసాగర్ కుడికాలువకు అధిక ఖర్చుతో నీటిపారుదల సౌకర్యం ఏర్పరుచుకొని, దానికి బదులుగా ఇంకా ఎక్కువ ఖర్చుతో పులిచింతల నుంచి పంపింగ్ ఏర్పరచవలసిన అవసరం తమకు లేదని ఆంధ్రప్రదేశ్ తేల్చి చెప్పాలి. చట్టాలకు తెలంగాణ అతీతం కాదనీ, ఆ రాష్ట్రం కోసం తాము నష్టపోవాల్సిన అవసరం లేదని ట్రైబ్యునల్ ఎదుట ఏపీ వాదించాలి.

■ **కురుమద్దాలి వెంకటసుబ్బారావు**
విశ్రాంత చీఫ్ ఇంజనీర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ-మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

హమాస్ దుర్మార్గం! ఇజ్రాయెల్ అమానుషం!!

అక్టోబర్ 7, 2023న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడి, నాజీ పాలన తర్వాత జరిగిన అతి పెద్ద మానవ ఊచకోత. ఈ దాడి ప్రధానంగా జరిగింది మిలిటరీ మీద కాదు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం చనిపోయిన వారిలో సుమారు 850మంది పౌరులు ఉండగా 350మంది మిలిటరీ పోలీసులు ఉన్నారు. ఈ దాడిలో సేఫ్ హౌస్‌లో దాక్కోడానికి ప్రయత్నించిన సాధారణ పౌరులను- వారు పిల్లలా, వృద్ధులా అన్నదానితో సంబంధం లేకుండా- మంటల్లో తగలబెట్టారని ఐక్యరాజ్యసమితి నిర్ధారించింది. లూటీలు జరిగాయని, తలలు నరికివేయడం కూడా జరిగిందని ఆ నివేదిక తేల్చిచెప్పింది. అంతేగాక సెక్సువల్ వయెలెన్స్ మీద ఐరాస సెక్రెటరీ జనరల్ జరిపిన ప్రత్యేక పరిశోధనలో కిబ్బుట్జ్ ప్రాంతంలో రేప్‌లు, గ్యాంగ్ రేప్‌లు జరిగాయని తేలింది. ఎన్నోచోట్ల స్త్రీల అర్ధనగ్న, నగ్న దేహాలు పడివున్నాయని, మర్మాంగాల ఛేదనం జరిగిందని ఆ ఐరాస బృందం కనుగొన్నది. ఈ బృందం సుమారు 5000 ఫొటోలు, 50 గంటల నిడివి ఉన్న ట్రాఫిక్ కెమెరాలతో సహా అన్ని రకాల ఆడియో, వీడియో ఫైళ్లనూ పరిశీలించి, ప్రత్యక్ష సాక్షులను విచారించి ఈ నివేదికను రూపొందించింది.

'హమాస్' అనే పేరు 'హరఖత్ అల్ ముఖవా అల్ ఇస్లామియా' అన్న పూర్తి పేరుకు క్లుప్తపదం. దీనికి అర్థం 'ఇస్లామిక్ ప్రతిఘటన ఉద్యమం' అని. ఈ సంస్థ ఫండమెంటల్ స్వభావం కలిగినది. యాసర్ అరాఫత్ నాయకత్వంలో పాలస్తీనా విమోచన ఉద్యమంలో భాగంగా ఏర్పడిన పార్టీ 'ఫతా'. ఈ ఫతా పార్టీ పాలస్తీనాలోని వెస్ట్ బ్యాంక్‌ను పాలిస్తుంది. ఫతా పార్టీ ఆదర్శం ఒక సర్వసత్తాక, గణతంత్ర, లౌకిక పాలస్తీనాను ఏర్పరచడం. అయితే హమాస్ భావజాలం అందుకు భిన్నమైనది. కేవలం ఇస్లాం మత సౌభ్రాతృత్వంతో కూడిన పాలస్తీనాను ఏర్పరచడమే దాని ఆదర్శం. ఆ సంస్థ 1988లో తన శాసనావళిలో స్పష్టంగా- ఇజ్రాయెల్‌ను తుడిచిపెట్టేసి జోర్డాన్ నది నుంచి మధ్యధరా సముద్రం దాకా పాలస్తీనా 'ఇస్లామిక్ సామ్రాజ్యాన్ని' ఏర్పరచడం తన ఆదర్శమని రాసుకున్నది. హమాస్ ఇంతటి స్పష్టమైన ఉద్దేశంతో ఏర్పడటంతో సహజంగానే ఇజ్రాయెల్‌లో దీనిపట్ల అప్రమత్తత నెలకొన్నది. 2007 ఎన్నికల్లో ఫతా పార్టీని హమాస్ గాజాలో ఓడించింది (132 సీట్లకు గాను 74 సీట్లు గెలుచుకుంది). ఆ తర్వాత ఫతా సంస్థపై దాడులు, హత్యలు, చిత్రహింసలతో విరుచుకుపడింది. చివరకు ఆ ప్రాంతంలో తానే ఏకైక పార్టీగా మిగిలి, అధికారం చెలాయిస్తూ వచ్చింది. మిలిటరీ హత్యాకాండను నమ్ముతూ, తమను రూపుమాపే లక్ష్యంతో ఉన్న హమాస్ అధికారంలోకి రావటంతో సహజంగానే ఇజ్రాయెల్ 2007 తర్వాత గాజా చుట్టూ ఒక పూర్తి నిర్బంధ స్థితిని తీసుకువచ్చింది. అంతవరకు అమెరికా, యూరోప్‌ల నుంచి మిలియన్ డాలర్లలో అందే ఆర్థిక సహాయం కూడా నిలిచిపోయింది.

హమాస్ ఒక విముక్తి పోరాట సంస్థ అని చెప్పే వాళ్ళకు విప్లవం ఎలా ఉంటుందో తెలియకపోయి ఉండాలి, లేదా అది 'ఫాల్స్ గ్లోరిఫికేషన్' ద్వారా సమర్థించడం అయినా అయి ఉండాలి. మన దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ పార్లమెంట్‌లో బాంబులు వేసాడు గాని, వెళ్ళి బ్రిటిష్ కుటుంబంలో చిన్నపిల్లల మీద, ఇంట్లో స్త్రీల మీద బాంబు వేయలేదు. మన దేశంలో మిలిటరీ విముక్తి పోరాటం చేస్తోందని చెప్పుకునే అతి పెద్ద సాయుధ పోరాట మావోయిస్ట్ సంస్థ కూడా ఇందులో కనీసం ఒకటవ వంతు హత్యాకాండకు కూడా పాల్పడలేదు. కేవలం మిలిటరీ పైన, పోలీసుల పైన, అధికార యంత్రాంగం పైన మాత్రమే దాడులు చేయడం అన్నది- ఏ విముక్తి పోరాటం అయినా పాటించే ఒక అలిఖిత యుద్ధ న్యాయం. నక్సలైట్లు భూస్వాముల ఇళ్ళల్లోకి ప్రవేశించి భూస్వాములను చంపిన సందర్భాలు ఉన్నాయి కానీ, వాళ్ళ ఇంట్లో భార్యలను చెరచడం, పిల్లల్ని తగలబెట్టడం జరగలేదు. హింసను అంగీకరించడం అంగీకరించకపోవడం అది వేరే చర్చ. ఏ దిశా లేని హింస అన్నది కేవలం టెర్రరిజం మాత్రమే! అయితే హమాస్ నాయకుడు ఘజీ హమద్ "మేము అక్టోబర్ 7న చేసిన హత్యాకాండ వల్లనే ఈ రోజు ప్రపంచం మా సమస్యను గుర్తిస్తున్నది" అని ప్రకటించాడు. అడ్డూ అదుపూ లేని ఏ హింసనైనా ఎవరైనా గుర్తిస్తారు. ఆ గుర్తించేది ఏ దృక్పథంతో గుర్తిస్తున్నారు అన్నది ముఖ్యం. ఈ కనీస ఆలోచన లేని యుద్ధ వీరులు చేసే దుర్మార్గాన్ని లిబరల్స్ ఏ మాత్రం విచక్షణ లేకుండా తలకెత్తుకోవడం ఈ ప్రపంచ మానవ సమాజం చేసుకున్న దురదృష్టం. పాలస్తీనా సమస్య వేరు, హమాస్ ప్రతిఘటన వేరు. ఈ రెంటి మధ్య అయోమయానికి గురై, రెండిటినీ ఒకే రకంగా తలకెత్తుకోవడం అవివేకం.



"హమాస్ నాయకుడు ఘజీ హమద్ "మేము అక్టోబర్ 7న చేసిన హత్యాకాండ వల్లనే ఈ రోజు ప్రపంచం మా సమస్యను గుర్తిస్తున్నది" అని ప్రకటించాడు. అడ్డూ అదుపూ లేని ఏ హింసనైనా ఎవరైనా గుర్తిస్తారు. ఆ గుర్తించేది ఏ దృక్పథంతో గుర్తిస్తున్నారు అన్నది ముఖ్యం. ఈ కనీస ఆలోచన లేని యుద్ధ వీరులు చేసే దుర్మార్గాన్ని లిబరల్స్ ఏ మాత్రం విచక్షణ లేకుండా తలకెత్తుకోవడం ఈ ప్రపంచ మానవ సమాజం చేసుకున్న దురదృష్టం. పాలస్తీనా సమస్య వేరు, హమాస్ ప్రతిఘటన వేరు. ఈ రెంటి మధ్య అయోమయానికి గురై, రెండిటినీ ఒకే రకంగా తలకెత్తుకోవడం అవివేకం.

హమాస్ దాడి తర్వాత ఇజ్రాయెల్ ప్రతిస్పందన మరింత అమానుషం! అందులో 'proportionate response' అన్నది లేదు. హమాస్ సభ్యులు ఇళ్ళ కింద, హాస్పిటల్స్ కింద టన్నెల్స్‌లోనూ దాక్కున్నారని చెప్పి ఇజ్రాయెల్ ఎడాపెడా హాస్పిటళ్లను, స్కూళ్లను పేల్చివేస్తుంటే మానవ సమాజం యావత్తూ సాక్షులుగా మిగిలిపోవాల్సి రావటం దారుణమైన స్థితి! ప్రపంచంలోనే అతిపెద్ద, అతిశక్తిమంతమైన సీక్రెట్ ఏజెన్సీగా పేరుమోసిన ఇజ్రాయెల్‌కి చెందిన 'మొసాద్' కూడా అక్టోబర్ దాడిని పసిగట్టలేకపోయిందంటే ఎంత సిగ్గుమాలిన విషయం! దాడి జరిగిన తర్వాత బందీలు ఎక్కడున్నారో, హమాస్ మిలిటెంట్లు ఎక్కడున్నారో కూడా ఆ ఏజెన్సీ పసిగట్టలేకపోయింది. ఫలితంగా ఎక్కడపడితే అక్కడ ఎయిర్ స్ట్రైక్స్ చేసి 67,000 మందిని ఇజ్రాయెల్ పొట్టనబెట్టుకుంది. ఇందులో 70 శాతం స్త్రీలు, పిల్లలు ఉన్నారు! అందులో హమాస్ మిలిటెంట్స్ 20 శాతం కూడా లేరు అని అంతర్జాతీయ మీడియా నివేదికలు చెప్తున్నాయి. ఇజ్రాయెల్ ఇది 'కొలేటరల్ డ్యామేజ్' అని నచ్చచెప్తోంది. తమాషా ఏమంటే- 'ఇదంతా ఒట్టి కొలేటరల్ డ్యామేజ్ మాత్రమే! మెయిన్ డ్యామేజ్ అతి స్వల్పం! అంటే ఒక్క మిలిటెంట్‌ను చంపాలంటే నలుగురు సాధారణ పౌరులను చంపవచ్చు' అని ఇజ్రాయెల్ ఇక్కడ తీర్మానిస్తున్నది. ఇన్ని యుద్ధాలు జరిగిన ఈ భూ ఖండంలో ఇంత అమానుషంగా, ఇంత స్థాయిలో, ఇంత disproportionateగా సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోయింది లేదు (నాగసాకి, హిరోషిమా బాంబ్ ఘటన మినహాయిస్తే).

నేడు సామ్రాజ్య వాదానికి, ఇస్లామిక్ విస్తరణ వాదానికి మధ్యలో నలిగిపోతున్నది ప్రపంచం. ఒకరు ఆస్తుల గురించి రాజకీయాలు చేస్తే, మరొకరు తమ మత విశ్వాసం వ్యాప్తి కోసం, మూఢులైన ప్రజల్లో తమ అధికార ప్రాబల్యం కోసం మానవ సమాజ వినాశనానికి పాల్పడుతున్నారు. ఒక తోడేలుకీ, ఒక పులికీ మధ్య చిక్కుకున్న గొర్రెపిల్ల పాలస్తీనా! ఫతా పార్టీ పూర్తిగా విఫలం కావడంతో దిక్కు తోచని పాలస్తీనా ప్రజలు హమాస్ వెనుక గుడ్డిగా తరలి వెళ్ళారు. అందుకు మతం అనే సెంటిమెంట్ బలంగా పనిచేసింది. ఇజ్రాయెల్ బోర్డర్ కంట్రోల్ పేరుతో చెక్ పాయింట్స్ పెట్టి పాలస్తీనా ప్రజలను విపరీతమైన వ్యధకు గురిచేసింది. ప్రజల్లో ఉండే కసిని హమాస్ చాలా తప్పుదారిలో నడిపి మరింత క్లిష్టమైన పరిస్థితి తీసుకువచ్చింది. తమ పౌరులను హమాస్ బందీలుగా చేసుకుందన్న కారణంతో పాలస్తీనాలోని సాధారణ ప్రజలను ఇజ్రాయెల్ చంపుతున్నది. దీన్ని ఎవరన్నా యుద్ధం అని నిర్వచిస్తే మనలో మానవ ఇంగితం లోపించినట్లే! పాలస్తీనా వేరు, హమాస్ వేరు! రగిలిపోయిన యూదుల కుటుంబాలు వేరు, వారికి జరుగుతున్న న్యాయం వేరు! ఒకటి దుర్మార్గం, మరొకటి అమానుషం!

◆ **పి. విక్టర్ విజయ్‌కుమార్**

ఎంఎస్ఎంఈలతోనే వికసిత భారత్ సాధ్యం!

దేశం అభివృద్ధి చెందాలంటే పెద్ద ప్రాజెక్టులు మాత్రమే కాదు, చిన్న పరిశ్రమలు కూడా బలపడాలి. కానీ ప్రభుత్వాల దృష్టి అంతా "లార్జ్, మెగా ఇండస్ట్రీస్" వైపునకే పోతోంది. పెద్ద పరిశ్రమలకు, అంతర్జాతీయ సంస్థలకు ఒకదాని తర్వాత ఒకటి ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, భూములు, టారిఫ్ రాయితీలు లభిస్తున్నాయి. అదే సమయంలో కోట్లాది ఉద్యోగాలు కల్పించే ఎంఎస్ఎంఈలు నిశ్శబ్దంగా మూతపడుతున్నాయి.

భారతదేశంలో సుమారు 2.9 కోట్ల ఎంఎస్ఎంఈ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటి ద్వారా 20 కోట్లకు పైగా ప్రజలకు ఉపాధి లభిస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో మూడు లక్షలకు పైగా రిజిస్టర్డ్ ఎంఎస్ఎంఈ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటి ద్వారా 15 లక్షలకు పైగా ప్రజలకు ఉపాధి లభిస్తోంది. ఈ రంగంలో పనిచేసేవారు ప్రధానంగా తక్కువ, మధ్య ఆదాయ వర్గాలవారు, గ్రామీణ యువత, మొదటి తరానికి చెందిన పారిశ్రామికవేత్తలు. ఎంఎస్ఎంఈలు కేవలం వ్యాపారాలు మాత్రమే కాదు– స్థానికంగా ఉపాధి, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక చలనం కలిగించే శక్తి కేంద్రాలు.



ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద ప్రాజెక్టులకు ప్రభుత్వం అందిస్తున్న అనేక ప్రోత్సాహకాలు ఈ చిన్న పరిశ్రమలకు కూడా ఇవ్వవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రభుత్వాలు కేటాయించే భూముల్లో 80 శాతానికి పైగా భూములు మెగా ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలకే దక్కుతున్నాయి. చిన్న పరిశ్రమలు భూమి కోసం సంవత్సరాల తరబడి ప్రభుత్వాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అలాగే పెద్ద పరిశ్రమల వారికి విద్యుత్ చార్జీలలో రాయితీలు, వాయిదాలు, సర్దుబాట్లు, సత్వర కనెక్షన్, అభివృద్ధి చార్జీల మినహాయింపు తదితర ప్రోత్సాహకాలు లభిస్తున్నాయి. చిన్న పరిశ్రమలకు ఎటువంటి రాయితీ లేకపోగా, డ్యూ డేట్ తర్వాత బిల్లు చెల్లించడం ఒక్కరోజు ఆలస్యమైనా పెనాల్టీలు వేయడం, కనెక్షన్ తొలగించడం వంటివి చేస్తున్నారు. మెగా ప్రాజెక్టులకు భవన నిర్మాణ చార్జీల నుంచి మినహాయింపులు, ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్, ప్రోత్సాహక ప్యాకేజీలు లభిస్తుంటే, చిన్న పరిశ్రమలవారు వీటన్నింటినీ తామే భరించవలసి వస్తోంది. ఇక పెద్ద కంపెనీలు అధిక నైపుణ్య ఉద్యోగులను నియమిస్తాయి, అదే ఎంఎస్ఎంఈలు తక్కువ ఆదాయ వర్గాల యువతకు, మొదటి తరం ఉద్యోగార్థులకు అవకాశాలు ఇస్తాయి. ఒక కోటి రూపాయల పెట్టుబడితో ఎంఎస్ఎంఈ రంగం 10 నుంచి 15 ఉద్యోగాలు కల్పిస్తే, మెగా, భారీ పరిశ్రమలు కల్పించే ఉద్యోగాలు ఒకటి రెండు మాత్రమే.

ప్రతి సంవత్సరం వందల ఎంఎస్ఎంఈ యూనిట్లు మూతపడుతున్నాయి. దీనికి కారణాలు మార్కెట్ పోటీ, చెల్లింపుల ఆలస్యం, ఫైనాన్స్ లోపం, బ్యాంకుల కఠిన విధానాలు, పెరిగిన విద్యుత్ చార్జీలు. పెద్ద కార్పొరేట్‌లకు ఓటీఎస్, అప్పు మాఫీలు లభిస్తే, ఎంఎస్ఎంఈలకు అలాంటి అవకాశాలు లేవు. ప్రతి బడ్జెట్‌కు ముందు ప్రభుత్వం పెద్ద పారిశ్రామికవేత్తలు, చాంబర్ ఆఫ్ కామర్స్, ఆర్థిక నిపుణులతో చర్చలు చేస్తుంది. కానీ ఎంఎస్ఎంఈ యజమానులు, రోజువారీ పోరాటం చేస్తున్న పరిశ్రమలు, గ్రామీణ పారిశ్రామికవేత్తలకు ఆ అవకాశం లేదు.

ఇకనుంచైనా ప్రభుత్వాలు పెద్ద పరిశ్రమల వారికిచ్చే ప్రోత్సాహకాలు ఎంఎస్ఎంఈలకు కూడా కల్పించాలి. అవి ఇలా కల్పించవచ్చు. 1) ఉద్యోగ సృష్టి ఆధారంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలి. వాటిని ఎప్పటికప్పుడు డైరెక్ట్‌గా కంపెనీల అకౌంటుకు బదిలీ అయ్యేలా చూడాలి. 2) జిల్లా స్థాయిలో ఎంఎస్ఎంఈ యజమానులతో ప్రత్యక్ష సమీక్షలు నిర్వహించాలి. 3) సమస్యల్లో ఉన్న యూనిట్ల పునరుద్ధరణకు సెల్స్ ఏర్పాటు చేయాలి. 4) బ్యాంకులు, డిస్కం సంస్థలు ఎంఎస్ఎంఈలకు ప్రత్యేక సహకార విధానం అమలు చేయాలి. విద్యుత్ సబ్సిడీ ఆయా నెలల బిల్లుల్లో సర్దుబాటు చెయ్యాలి. 5) ల్యాండ్ బ్యాంక్‌లలో కనీసం 30 శాతం భూములు ఎంఎస్ఎంఈ పార్కులకు రాయితీ ధరకు కేటాయించాలి.

ఒక చిన్న యూనిట్ మూతపడితే, దాని వెనుక ఒక కుటుంబం, ఐదారు ఉద్యోగాలు, ఒక గ్రామ ఆర్థిక చలనం ఆగిపోతాయి. ఎంఎస్ఎంఈలు కేవలం వ్యాపారాలు మాత్రమే కాదు– సామాజిక స్థిరత్వానికి మూలాధారం. తక్కువ, మధ్య ఆదాయ కుటుంబాలకు ఉపాధి, స్థానిక ఆర్థిక చలనం, నైపుణ్యాభివృద్ధి ఇవన్నీ ఈ రంగం ద్వారా వస్తున్నాయి. ఎంఎస్ఎంఈలే భారత ఆర్థిక స్వరూపానికి పునాది. అందుకే కష్టాల్లో ఉన్న ఎంఎస్ఎంఈ యజమానుల గళం వినాలి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా పాలసీలు రూపొందించాలి. అప్పుడే నిజమైన ఆత్మనిర్భర్ భారత్ అవుతుంది. ప్రభుత్వాలు ఆశిస్తున్న వికసిత భారత్ లక్ష్యం నెరవేరుతుంది.

● **జి. నానిబాబు చౌదరి**
ప్రధాన కార్యదర్శి, మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్

రుషికొండ ప్యాలెస్‌ను మ్యూజియంగా మార్చాలి

'విశాఖతీరం సమీపంలోని రుషికొండ ప్యాలెస్‌ను ఎలా వినియోగించాలి?' అనే అంశంపై ప్రజాభిప్రాయం కోరుతూ గత ఏడాది కూటమి ప్రభుత్వం ఓ ప్రకటన చేసింది. 13,542 చదరపు మీటర్ల విస్తీర్ణంలో (రూ.451.67 కోట్ల ప్రజాధనంతో) నిర్మించిన ఈ ప్యాలెస్ సంబంధిత భవనాలను ఓ మంచి ఆశయం కోసం ఉపయోగించడం సముచితం. అందుకే ఆ ప్యాలెస్‌ను విద్యార్థులకు, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అక్కడ మ్యూజియంను ఏర్పాటు చేయాలి.

రాష్ట్రంలోని విద్యార్థులెవరైనా సైన్సు మ్యూజియం చూడాలి అంటే తిరుపతి లేదా హైదరాబాద్‌కు వెళ్లాల్సిందే. తిరుపతిలోని 'రీజనల్ సైన్స్ సెంటర్' తప్ప రాష్ట్రంలో పెద్దగా విద్యా, వైజ్ఞానిక భవనాలేవీ లేవు. రాజమండ్రిలో స్థాపించేందుకు పాలకులు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. అయితే, అభివృద్ధిలో వెనకబడి ఉన్న ఉత్తరాంధ్రకు అటువంటి ప్రతిపాదనలు ఏవీ లేవు. మరోవైపు 'ఈ ప్యాలెస్‌ను లాభార్జన, వ్యాపారం కోసం కాకుండా శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక మ్యూజియంగా, ఉత్తరాంధ్ర సాంస్కృతిక వారసత్వ కేంద్రంగా తీర్చిదిద్దాలి' అని రాష్ట్రంలోని అనేకమంది మేధావులు, ప్రముఖులు, ప్రజలు కోరుతున్నారు. ఈ ప్యాలెస్‌ను మ్యూజియంగా మార్చడం ద్వారా... మన రాష్ట్ర, ఉత్తరాంధ్ర ఖ్యాతిని, చరిత్రను చాటి చెప్పేందుకు ఈ ప్యాలెస్ వేదికగా నిలుస్తుంది. యువత, చిన్నారులు, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, సైన్సు పట్ల ఆసక్తిని, మన సంస్కృతి, కళలపై అవగాహనను పెంపొందించేందుకు ఉపయోగపడుతుంది. వందల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్యాలెస్ భవనాలు దుర్వినియోగం కాకుండా ఉంటాయి. దీన్ని భవిష్యత్తులో ప్రఖ్యాత మ్యూజియంగా తీర్చిదిద్దడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించవచ్చు. టూరిజం కూడా అభివృద్ధి అవుతుంది. ఈ నేపథ్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిజంగా పారదర్శకంగా జరగాలి. 'రుషికొండ ప్యాలెస్‌ను విద్యార్థులకు ఉపయోగపడేలా మ్యూజియంగా మార్చాలి' అని కోరుతూ... రాష్ట్రంలోని ప్రజలు 'rushikonda@aptdc.in'కు మెయిల్ ద్వారా తమ అభిప్రాయాన్ని పంపించాలి. ప్రభుత్వం కూడా ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి, రుషికొండ ప్యాలెస్‌ను మ్యూజియంగా మార్చేందుకు కృషి చేయాలి.


– **డా. కె. రమాప్రభ,** సామాజిక కార్యకర్త, విశాఖపట్నం

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల కోసం 'Employee Health Scheme' (ఈహెచ్‌ఎస్)ను ప్రవేశపెట్టింది. ఈ వైద్య సదుపాయం సక్రమంగా అందకపోవడంతో పెన్షనర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీనికి సంబంధించిన ఆరోగ్యకార్డుల కోసం వారు నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. దరఖాస్తులు ఆమోదం పొందినప్పటికీ, పలు సాంకేతిక కారణాలతో కార్డు జారీ ఆలస్యం అవుతుండడంతో వృద్ధులకు ఇబ్బందులు తప్పడం లేదు. పెన్షనర్ల పట్ల ఎంపానెల్డ్ ఆసుపత్రులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే అనుమతి రాకపోవడంతో చికిత్స ఆలస్యం అవుతోంది. ఆస్పత్రుల్లో చికిత్స కోసం పెన్షనర్లు చాలాసార్లు ముందే డబ్బు చెల్లించి, తర్వాత గవర్నమెంట్ రీయింబర్స్‌మెంట్ కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోంది!

అన్ని రకాల వ్యాధులు ఈహెచ్‌ఎస్ పరిధిలోకి రావడం లేదు. గుండె జబ్బులు, మూత్రపిండ వ్యాధులు, క్యాన్సర్, న్యూరో వంటి కొన్ని వ్యాధులకు సంబంధించిన చికిత్సలనే ఈ ఆస్పత్రులు అందిస్తున్నాయి. వాటిలోనూ ఆధునిక మందులు, కొత్త తరహా శస్త్రచికిత్సలు అందుబాటులో లేవు! నేటి వైద్యరంగం రోబోటిక్ సర్జరీ, లేజర్ చికిత్సలు, స్టెమ్‌సెల్ థెరపీ, టెలీ మెడిసిన్ వంటి ఆధునిక పద్ధతులతో ముందుకు సాగుతుండగా, ఈహెచ్‌ఎస్ పరిధిలో మాత్రం ఆ తరహా వైద్య సేవలు అందుబాటులో లేవు. ఎంపానెల్డ్ ఆస్పత్రుల్లోనూ ఆయా వైద్య సేవలను అందించాలి. అనుమతి విధానాన్ని సులభతరం చేయాలి. ఆస్పత్రుల్లో క్యాష్‌లెస్ చికిత్స అందించాలి. ప్రస్తుత ఆరోగ్య కార్డు స్థానంలో రూ. 5 లక్షల బీమా హెల్త్‌కార్డు ప్రవేశపెట్టాలి. పెన్షనర్ల కోసం ప్రత్యేక వైద్య కేంద్రాలు, హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలి.

– **టి.ఎం.బి. బుచ్చిరాజు,** ఏపీ పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి





రాజధానికి ఇక హైస్పీడ్



అమరావతి మీదుగా హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్

- హైదరాబాద్–చెన్నై హైస్పీడ్‌కు ప్రతిపాదనలు సిద్ధం
- గంటకు 350 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్న రైళ్లు
- సీఆర్‌డీఏ పరిధిలో మొత్తం 147.45 కిలోమీటర్ల మేర అలైన్‌మెంట్
- 442.35 ఎకరాల భూములు అవసరమని ప్రతిపాదన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని అమరావతి మీదుగా గంటకు 350 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ వెళ్లనుంది. దక్షిణ మధ్య రైల్వే తాజాగా ప్రతిపాదించిన హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్ అమరావతి మీదుగా సాగుతుంది. ఈ కారిడార్‌కు సంబంధించి రైట్స్ సంస్థ తాజాగా దక్షిణ మధ్య రైల్వేకు ప్రతిపాదనలు అందజేసింది. హైదరాబాద్-చెన్నై కారిడార్‌తో పాటు హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ రైల్ కారిడార్‌కు కూడా ప్రతిపాదించింది. ఇందులో హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ మాత్రం అమరావతి మీదుగా వెళ్తుంది. ఈ ప్రాజెక్టుకు రూ.3.04 లక్షల కోట్ల అంచనా వ్యయం అవుతుందని రైట్స్ సంస్థ నిర్దేశించింది. మన రాష్ట్రంలో అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతిలో రెండుచోట్ల చొప్పున మొత్తం 9 స్టేషన్లు ప్రతిపాదించారు. రాష్ట్రంలో ఏడు జిల్లాల మీదుగా ఈ రైలు వెళ్తుంది. రాజధాని అమరావతి పరిధిలో పల్నాడు, గుంటూరు మిగతా 6లో..

కార్తీక సందడి



కార్తీకమాస ఆగమనాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా బుధవారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కృష్ణానదిలో స్నానాలు ఆచరించి శైవక్షేత్రాల్లో శివుడ్ని దర్శించుకున్నారు. దుర్గాఘాట్ భక్తులతో రద్దీగా కనిపించగా, పాతశివాలయంలో అయ్యప్ప భక్తులు భారీగా దీక్షలు స్వీకరించారు.



ముసురు

జిల్లావ్యాప్తంగా వర్షాలు

నగరంలో అష్టకష్టాలు

విజయవాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా బుధవారం 70.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా జి.కొండూరులో 14.3, అత్యల్పంగా పెనుగ్రంచిపోలు, మైలవరంలో ఒక్కో మిల్లీమీటర్ చొప్పున వర్షం కురిసిందని, వత్సవాయి, గంపలగూడెం, తిరువూరు, రెడ్డిగూడెం, విస్సన్నపేట, చందర్లపాడు మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదని జిల్లా అధికార యంత్రాంగం ఒక ప్రకటనలో పేర్కొంది. కంచికచర్లలో 11, విజయవాడ రూరల్‌లో 10.8, విజయవాడ సెంట్రల్‌లో 9.3, నందిగామలో 4.8, ఇబ్రహీంపట్నంలో 4.3, ఎ.కొండూరులో 3.0, విజయవాడ తూర్పులో 3.0, విజయవాడ పశ్చిమలో 2.8, విజయవాడ ఉత్తరంలో 2.5, వీరులపాడులో 1.5, జగ్గయ్యపేటలో 1.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా సగటు వర్షపాతం 3.54 మిల్లీమీటర్లుగా నమోదైంది.

తప్పులతడక

ఓఆర్ఆర్ 3ఏ ప్రతిపాదనల్లో తప్పులు

రెండు జిల్లాలకు వెనక్కి పంపిన ఎన్‌హెచ్ అధికారులు

- అలైన్‌మెంట్‌కు అనుగుణంగా సరిచేయాలని సూచన
- తప్పులు సరిచేసే పనిలో రెవెన్యూ యంత్రాంగాలు
- పీపీపీ అప్రైజల్ కమిటీకి వెళ్లిన ఆర్థిక ప్రతిపాదనలు
- 40 శాతం నిధులు ఇవ్వనున్న కేంద్ర ప్రభుత్వం

అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్)కు సంబంధించి ఎన్టీఆర్, కృష్ణా జిల్లా యంత్రాంగాలు పంపిన భూ ప్రతిపాదనలు తప్పులతడకలయ్యాయి. నిర్దేశించిన అలైన్‌మెంట్ ప్రకారం రెండు జిల్లాల రెవెన్యూ యంత్రాంగాలు తొందరపాటు చర్యలు తీసుకోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురైంది. దీంతో ప్రతిపాదనలు వెనక్కి తిరిగి వచ్చాయి. వీటిని సరిచేసి ఇవ్వాల్సిందిగా ఎన్‌హెచ్ కోరటంతో ఈ ప్రాజెక్టు జాప్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.



ఓఆర్ఆర్ ప్రతిపాదిత మ్యాప్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు వెళ్లే పరిధిలోని ఐదు జిల్లాల్లో ఒక్క పల్నాడు జిల్లా నుంచే పూర్తిస్థాయిలో 3ఏ ప్రతిపాదనలు అందాయి. ఈ ప్రతిపాదనల్లో భాగంగా సేకరించాల్సిన భూములకు సంబంధించిన పూర్తి వివరాలను రెవెన్యూ శాఖ పొందుపరచాలి. భూమి ఉన్న ప్రాంతం, సరిహద్దులు, వైశాల్యం, భూ యజమానులు, కౌలుదారులు, వారి పేర్లు, భూమి ప్రస్తుత వినియోగం.. వంటి వివరాలతో పాటు ప్రాజెక్టుకు అవసరమైన అనేక వివరాలు ఉంటాయి. ఇది ఒకరకంగా చట్టపరంగా భూ సేకరణ ప్రారంభించే ప్రక్రియ. ఈ వివరాల్లో ఎక్కడ తప్పులు చోటుచేసుకున్నా భూసేకరణ విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. రెవెన్యూ శాఖ నుంచి వచ్చే 3ఏ ప్రతిపాదనలను ఆమోదించాక సెక్షన్ 3డీ ప్రకారం పబ్లిక్ నోటీసు జారీచేసి అభ్యంతరాలు, సలహాలు, సూచనలను స్వీకరిస్తారు. ఆ తర్వాత సెక్షన్ 3జీ ప్రకారం నష్టపరిహారం నిర్ణయించే వంటి దశలు ఉంటాయి. అంతిమంగా భూ సేకరణకు సంబంధించిన గజిట్ నోటిఫికేషన్‌ను వెలువరిస్తారు. ఈ దశలన్నింటికీ కీలకమైన 3ఏ ప్రతిపాదనల్లో తప్పులతడకలు ఉండకూడదు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల నుంచి వచ్చిన 3ఏ భూ ప్రతిపాదనల్లో తప్పులు ఉన్న విషయాన్ని గుర్తించిన ఎన్‌హెచ్ అమరావతి డివిజన్ అధికారులు వాటిని వెనక్కి పంపారు.

తప్పులు ఎలా తెలిశాయంటే..

తప్పులను ఎన్‌హెచ్ అధికారులు ఎలా గుర్తించారంటే.. అలైన్‌మెంట్‌ను నిర్దేశించిన క్రమంలోనే డేటాను ఆన్‌లైన్ ఆధారంగా తెలుసుకున్నారు. నిర్దిష్టమైన సర్వే నెంబర్లుగా అలైన్‌మెంట్‌ను పెగ్‌మార్కింగ్ చేశారు. దీనిని బట్టి చూస్తే ఎన్‌హెచ్ డేటాకు, రెవెన్యూ యంత్రాంగాలు పంపిన 3ఏ ప్రతిపాదనలకు సంబంధించి తేడాలు వచ్చాయి. అలైన్‌మెంట్ ప్రాతిపదికన తమ దగ్గర ఉన్న డేటాతో సరిపోలకపోవటంతోనే వాటిని సరిచేయాల్సిందిగా ఎన్‌హెచ్, రెవెన్యూ యంత్రాంగాలకు వెనక్కి పంపారు. ఇలాంటి 3ఏ ప్రతిపాదనలను తక్షణం ఆమోదిస్తే కోర్టు కేసులను ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. దీంతో ప్రస్తుతం రెండు జిల్లాల యంత్రాంగాలు ఈ తప్పులను గుర్తించే పనిలో పడ్డాయి.

ఆర్థిక ప్రతిపాదనలు పీపీపీఏసీకి..

అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డుకు సంబంధించి రూ.24 వేల కోట్ల అంచనాతో కూడిన ఆర్థిక ప్రతిపాదనలు ఎన్‌హెచ్ జాతీయ ఉన్నతాధికారుల నుంచి కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ (మోర్తు)కు మిగతా 6లో..



గాజుల ఉత్సవానికి ఏర్పాట్లు

- నేడు ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు గాజుల అలంకరణ 6

చుట్టూ ఇనుపకంచె ఉన్నా.. మధ్యలో ఉన్న పుంజులు కనిపించకుండాపోతున్నాయి. షెడ్ల కింద తాళ్లతో కట్టేసిన గొర్రెలు తెల్లారేసరికి మాయమవుతున్నాయి. ఈ ఘటనల వెనుక ఉన్న గ్యాంగ్ 'స్టూవర్టుపురం' అని తేలింది.



కోళ్లు కొట్టేస్తున్నారు..!

పందెం పుంజులు, గొర్రెలే టార్గెట్‌గా చోరీలు

- రెండు జిల్లాల శివారుల్లో స్టూవర్టుపురం దొంగల హల్‌చల్
- పగలు కారులో సంచారం.. అర్ధరాత్రి దొంగతనం
- జగ్గయ్యపేట వద్ద చిక్కినట్టే చిక్కి పారిపోయిన గ్యాంగ్
- ఓ నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పందెంకోళ్లు, గొర్రెలను చోరీ చేస్తున్న ముఠా ఉమ్మడి కృష్ణాజిల్లాలో అడుగుపెట్టింది. ఇందులో ఓ నిందితుడు పోలీసులకు చిక్కాడని తెలిసింది. స్టూవర్టుపురం నుంచి ఐదారుగురు సభ్యులతో ఉన్న గ్యాంగ్ ఉమ్మడి జిల్లాలో తిరుగుతోంది. వ్యాన్‌లో తిరుగుతూ అర్ధరాత్రి సమయంలో ఈ పశుసంపదను మాయం చేస్తున్నారు. ఇప్పటికే వందల సంఖ్యలో గొర్రెలు, కోడిపుంజులను ఇక్కడి నుంచి తరలించి సంతల్లో అమ్మేసినట్టు తెలిసింది. ఎన్టీఆర్ మిగతా 6లో..

దర్జా దొంగ

పోలీసుల అదుపులో అల్లవరం కార్లదొంగ

- దేవాలయాలకు కారులో వచ్చి మరీ దొంగతనం
- ఆయుధం లేకుండా టెక్నిక్‌గా డోర్ ఓపెన్
- అందులో ఉన్న ఆభరణాలు, నగదుతో జంప్
- ఏప్రిల్‌లో ఇంద్రకీలాద్రిపై ఓం టర్నింగ్ వద్ద చోరీ
- 241 గ్రాముల బంగారు ఆభరణాలతో ఉడాయింపు
- తునిలో పట్టుకున్న పోలీసులు.. విజయవాడ తరలింపు

ఇంటి దగ్గర నుంచి దర్జాగా కారులో బయల్దేరుతాడు. అంతకుముందే ఒక ఆలయాన్ని ఎంపిక చేసుకుంటాడు. అయితే, దేవుడి దర్శనం కోసం కాదు. ఆలయాల వద్ద నిలిపిన కార్లలో దొంగతనం కోసం.. మొదట అటూ ఇటూ తిరుగుతాడు. ఆయుధం పట్టకుండా చేత్తో కారు తలుపులు తెరుస్తాడు. అందులోని బ్యాగుల్లో ఉన్న ఆభరణాలు, నగదును చిటికెలో మాయం చేస్తాడు. భక్తుల కార్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏప్రిల్‌లో ఇంద్రకీలాద్రిపై ఓంమలుపు వద్ద కారులో చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ చోరీ ఘనత ఈ కార్ల దొంగ పనేనని దర్యాప్తు బృందాలు నిర్ధారణకు వచ్చాయి. నిందితుడు అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : అమలాపురానికి చెందిన ఆచంట దుర్గ కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. అమలాపురంలో జరిగే వివాహానికి హాజరయ్యేందుకు ఏప్రిల్ 15న బయల్దేరిన ఈ కుటుంబం దారిలో దుర్గమ్మ దర్శనం చేసుకోవాలనుకుంది. ఇంద్రకీలాద్రిపై ఓం మలుపు వద్ద కారును నిలుపుదల చేసి, డోర్ లాక్ చేసుకుని దర్శనానికి వెళ్లారు. ఈ కారులో నుంచి 241 గ్రాముల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. తిరిగి వచ్చి చూసేసరికి ఆభరణాలు కనిపించలేదు. అక్కడ సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎలాంటి ఆధారాలు లభించలేదు. బాధితులు ఇచ్చిన మిగతా 6లో..

విజయవాడ టు సింగపూర్



ఇండిగో బుకింగ్స్ ప్రారంభం

- నవంబరు 10 నుంచి విమాన సర్వీసు
- ప్రతి మంగళ, గురు, శనివారాల్లో..

6

విజయవాడ టు సింగపూర్

ఇండిగో బుకింగ్స్ ప్రారంభం

» నవంబరు 10 నుంచి విమాన సర్వీసు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సింగపూర్‌కు ఫ్లైట్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సింగపూర్‌లోని ఛాంగీ విమానాశ్రయానికి నవంబరు 10 నుంచి ఇండిగో సంస్థ సర్వీసును ప్రారంభిస్తోంది. ఈ క్రమంలో వెబ్‌సైట్ ద్వారా బుకింగ్స్‌ను ప్రారంభించింది. ధర రూ.7500గా నిర్ణయించింది. వారంలో 3 రోజులపాటు (మంగళ, గురు, శని) విమాన సర్వీసు విజయవాడ నుంచి ఉదయం 10.05లకు బయలుదేరి మధ్యాహ్నం 2.05 గంటలకు సింగపూర్‌లోని ఛాంగీ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుంది. బుకింగ్స్ ప్రారంభించిన నేపథ్యంలో, ప్రయాణీకుల నుంచి ఆదరణ లభిస్తున్నది. డైనమిక్ ఫేర్ అమల్లో ఉండటం వల్ల చివరి నిమషంలో ప్రయాణించే వారికి టిక్కెట్ ధర రూ.10 వేలు పలికే అవకాశం ఉంది. ముందుగా బుక్ చేసుకునే వారు బేసిక్ ప్రైజ్ రూ.7500లకు ప్రయాణించవచ్చు. సింగపూర్‌కు విమాన సర్వీసు ద్వారా కేవలం రూ. 25 వేలతో ఒక వ్యక్తి పర్యాటకంగా సింగపూర్‌కు వెళ్లి రావచ్చు. రానూ పోనూ టిక్కెట్లు బుక్ చేసుకుంటే రూ. 15 వేలు ఖర్చు అవుతుంది. బడ్జెట్ అకామిడేషన్, ప్రభుత్వ ట్రాన్స్‌పోర్ట్‌ను ఉపయోగించుకోగలిగితే.. రెండు రోజుల పాటు పర్యాటకంగా కూడా సింగపూర్‌లో హాయిగా గడిపిరావటానికి అవకాశం ఉంటుంది.



హంసలదీవి బీచ్ గేట్లు మూసివేసిన సిబ్బంది

హంసలదీవి బీచ్ మూసివేత

కోడూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో హంసలదీవి బీచ్ గేట్లు మూసివేస్తున్నట్టు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నాగమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం సముద్రపు అలలు ఎగసిపడుతున్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేపటి నుంచి రెండు రోజులపాటు పాలకాయితిప్ప వద్ద ఉన్న హంసలదీవి బీచ్ గేట్లు మూసి వేస్తున్నామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్‌బ్యాంకు చైర్మన్ దిలీప్‌కుమార్

అర్బన్ బ్యాంకుకు పూర్వవైభవం తెస్తాం

» నూతన చైర్మన్ ఐ.దిలీప్‌కుమార్

మచిలీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంకుకు పూర్వవైభవం తీసుకువస్తామనిబ్యాంకు నూతన చైర్మన్ ఐ.దిలీప్‌కుమార్ అన్నారు. అర్బన్‌బ్యాంకు నూతన పాలకవర్గం గురువారం ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో బుధవారం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మీడియా సమావేశం నిర్వహించారు. 105 సంవత్సరాల చరిత్ర ఉన్న అర్బన్‌బ్యాంకు ఇటీవల కాలంలో గత వైభవాన్ని కోల్పోయిందన్నారు. చిరువ్యాపారులకు స్వల్పకాలిక రుణాలు అందజేయడంతోపాటు, బ్యాంకును ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పాలకవర్గ సభ్యులు కృషి చేయాలన్నారు. పాలకవర్గం ప్రమాణస్వీకారం రోజున కోటిరూపాయలకు పైగా బ్యాంకులో డిపాజిట్లు సేకరించేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. మాజీమంత్రి నడకుదిటి నరసింహారావు చైర్మన్‌గా పనిచేసినకాలంలో బ్యాంకు చిరువ్యాపారులకు రుణాలు అందించి ఆర్థికంగా పురోభివృద్ధి సాధించిందన్నారు. బ్యాంకుకు గత వైభవం తీసుకువచ్చేందుకు మంత్రి రవీంద్ర ముందుచూపుతో బ్యాంకింగ్, సహకారరంగంలో నిష్ణాతులైన వారిని డైరెక్టర్లుగా ఎంపికచేశారన్నారు. గురువారం ఉదయం 11.34గంటలకు నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. సమావేశంలో అర్బన్‌బ్యాంక్ డైరెక్టర్లుగా నియమితులైన వేము కోటేశ్వరరావు, నూకల రమాదేవి, గెల్లి అరుణకుమారి, వంపుగడవల చౌదరి, పోతాబత్తుల పాండురంగారావు, సూరిశెట్టి హరికృష్ణ, బొర్రా శ్రీనివాస్, గున్నం నాగరాజున్ తదితరులు పాల్గొన్నారు.



హసీంబేగ్‌ను సత్కరిస్తున్న మైనారిటీ నేతలు

పేద మైనారిటీ వర్గాల అభివృద్ధికి కృషి

మచిలీపట్నం టౌన్ : పేద మైనారిటీ వర్గాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్ అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో పెద్ద ఎత్తున మైనారిటీ నాయకులు సమావేశమై ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హసీంబేగ్ మాట్లాడుతూ, ఇంకా వెనుకబాటులో ఉన్న ముస్లిం మైనారిటీ వర్గాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మచిలీపట్నంలో మైనారిటీ గురుకుల పాఠశాల భవన నిర్మాణాలు చేపట్టేందుకు యోచిస్తున్నామని, దీనిని మంత్రి రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

లకిరెడ్డి కళాశాలలో జాబ్‌మేళా రేపు

మైలవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 24న జరిగే జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఇళ్లరవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జెకెసి), జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్డీఏ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నారన్నారు. సుమారు 28 కంపెనీలు హాజరవుతున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. శివుణిక్ టెక్, విక్టర్ ఇండియన్ టెక్నికల్ సపోర్ట్, కాంసెంట్రిక్, హెట్రో లాబ్స్, టాటా ఎలక్ట్రానిక్స్ వంటి ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని ఆయన తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 18 నుంచి 35 ఏళ్ల వయస్సులోపు వారు అర్హులని, ఎంపికైన వారికి నెలకు సుమారు రూ.12 నుంచి రూ.35వేల వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన అవకాశాలు ఉంటాయని, అభ్యర్థులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.

http-s:\\tinyurl.com\jobmela.naipunyam రిజిస్ట్రేషన్ లింకులో పూర్తి వివరాలతో అభర్థుల పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. జాబ్ మేళాకు బయోడేటా, ఆధార్, సర్టిఫికెట్ల నకళ్లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9966090377, 9959108829 నెంబర్లలో సంప్రదించాలన్నారు.



మల్లేశ్వర ఆలయంలో సహస్రలింగార్చన



సహస్రదీపార్చన, ఊంజల్ సేవలో ఈవో, చైర్మన్ దంపతులు



దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై కార్తీక శోభ

» దుర్గగుడిలో ఘనంగా సహస్రలింగార్చన

» నేడు దుర్గమ్మకు గాజుల అలంకరణోత్సవం



ఆలయంలో గాజుల మాలలు అలంకరిస్తున్న సిబ్బంది



ఇంద్రకీలాద్రి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం వచ్చేసింది. నెల రోజుల పాటు ఆధ్యాత్మిక సంపద తులతూగుతుంది. శివా అంటేనే పరవశించే లయకారుడు పరమేశ్వరుడు పరమానంద భరితుడై భక్తుడికి విశేష ఫలితాలను ఇస్తారని నమ్మిక. కార్తీక మాసం చలి వేళలో చన్నీటి స్నానం చేసి వేకువజామునే శివుడిని ఆరాధిస్తే వచ్చే ఆనందానుభూతి మరెక్కడా ఉండదని చెబుతారు. కార్తీక మాసం ప్రారంభం కావడంతో శివాలయాలు శివ నామస్మరణ మారుమోగుతాయి. నమక, చమక పారాయణలు హోరెత్తుతున్నాయి. శివాలయాలలో సహస్రలింగార్చనలు ప్రారంభమయ్యాయి. దుర్గామల్లేశ్వర దేవస్థానంలో బుధవారం సహస్రలింగార్చన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శివారాధనలో రంగావజ్ఝుల శ్రీనివాసశాస్త్రి తదితర అర్చకులు శాస్త్ర సమ్మతంగా సహస్రలింగార్చన చేశారు. సహస్రలింగార్చన, సహస్రదీపార్చన, ఊంజల్ సేవలలో ఈవో శీనానాయక్ దంపతులు, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు పాల్గొని పూజలు చేశారు. ప్రదోష కాలములో 'మహా నివేదన', పంచ హారతులు, చతుర్వేద స్వస్తి జరిగాయి. గురువారం రోజున అమ్మవారి ఆలయంలో "గాజుల ఉత్సవం" భగినీ హస్త భోజనం (యమ ద్వితీయ) నిర్వహిస్తారు. భక్తులు కూర్చిన గాజుల మాలలను అలంకరణ చేస్తారు. సిద్ధమైన గాజుల మాలలను చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు తిలకించి నమస్కారం చేసుకున్నారు.

కార్తిక మాసం సందర్భంగా వైదిక కార్యక్రమాలను శుభసంకల్పంతో దీక్షాపూర్వకంగా బుధవారం ప్రారంభించారు. మల్లేశ్వరస్వామి ఆలయములో వచ్చేనెల 20న గురువారం వరకు నెల రోజులు పాటు విశేష అర్చన, అభిషేకాది కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ క్రమంలో బుధవారం ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణతో పాటు ఈవో శీనానాయక్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వైదిక కమిటీ, స్థానాచార్యుడు వి.శివప్రసాద్‌శర్మ పూజలు నిర్వహించారు.

దర్జా దొంగ

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదుపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇలా చిక్కాడు

తుని రూరల్ మండలం తలుపులమ్మ లోవలో భక్తుల కార్లను టార్గెట్ చేసుకుని చోరీలు చేస్తున్న వ్యక్తిని తుని రూరల్ పోలీసులు కొద్దిరోజుల క్రితం అరెస్టు చేశారు. ఆ సమయంలో కొంత బంగారాన్ని అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈక్రమంలో విచారణ చేస్తుండగానే ఇంద్రకీలాద్రిపై కారులో చేసిన చోరీ బయటకు వచ్చింది. నిందితుడి స్వస్థలం అంబేడ్కర్ కొనసీమ జిల్లా అల్లవరం. అక్కడి నుంచి కారులో బయల్దేరి చోరీలు చేసుకున్నాక తిరిగి వెళ్లిపోతాడు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ఉన్నత విద్యాభ్యాసం చేస్తుండగా, కుమారుడు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. దొంగిలించిన వస్తువులను అదే గ్రామానికి చెందిన ఓ బంగారం వ్యాపారికి విక్రయించాడు. మహారాష్ట్రకు చెందిన ఆ వ్యాపారి వద్ద నుంచి పలు చోరీలకు సంబంధించిన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కారుతో పాటు విజయవాడ తీసుకొస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. నిందితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న సమాచారం తెలియడంతో బంగారం వ్యాపారి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతడి కోసం ప్రత్యేక బృందం గాలిస్తోంది. నిందితుడి వయస్సు 45 సంవత్సరాలు ఉంటుంది. రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాల వద్ద పలు చోరీలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. ఇంద్రకీలాద్రిపై ఎన్ని చోరీలు చేశాడు, ఉమ్మడి జిల్లాల్లో ఏయే ఆలయాల వద్ద ఈ తరహా దొంగతనాలు జరిగాయి.. అనే వివరాలు విచారణలో బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

నిర్లక్ష్యంతోనే కృష్ణాజలాలు సముద్రం పాలు

» ఏబీ వెంకటేశ్వరరావు



గాంధీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం, అలసత్వంతో ఈ ఏడాది వెయ్యి టీఎంసీల కృష్ణానదీ జలాలు వృథాగా సముద్రంలో కలిశాయని ఆలోచనపరుల వేదిక సభ్యుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు విమర్శించారు. ప్రజలు, వ్యవసాయం, రాష్ట్రాభివృద్ధికి అవసరమయ్యే ప్రాజెక్టులపై కాకుండా అసంబద్ధమైన పోలవరం-బనకచర్ల వంటి ప్రాజెక్టులపై ప్రభుత్వాలు దృష్టి సారిస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రముఖ విశ్రాంత ఇంజనీర్ సుబ్బరాయుడు సంస్మరణ సభ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, జాగ్రఫీని మార్చడం, ప్రకృతిని అంచనా వేయడం ఎవరివల్ల కాదన్నారు. నదుల నుంచి వచ్చే నీటిని సరైన ఆలోచనతో ఒడిసిపట్టుకోవచ్చన్నారు. తద్వారా వ్యవసాయ స్థిరీకరణ సాధ్యమవుతుందన్నారు. సుబ్బరాయుడు రాష్ట్రం పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి అని కొనియాడారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, సుబ్బరాయుడు పదవీ విరమణ చేసిన 20 ఏళ్ల తర్వాత కూడా రాయలసీమ కరవు కాటకాలకు శాశ్వత పరిష్కారానికి అంకితభావంతో కృషి చేశారన్నారు.

ఘర్షణలో మరణిస్తే ప్రజల సొమ్ము దానం చేస్తారా?

ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవలో మరణించిన వ్యక్తికి ప్రజల సొమ్మును దానం చేసే అధికారం ప్రభుత్వానికి ఎవరిచ్చారని వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. కులాల గొడవలతో కొట్టుకు చస్తే ఎకరాలకు ఎకరాల భూమి, లక్షలకు లక్షలు ఇచ్చేస్తారా అని ధ్వజమెత్తారు. ఇవ్వాలనుకుంటే వారి సొంత ఆస్తులు ఇవ్వాలని సూచించారు. కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తప్పులతడక

(5వ పేజీ తరువాయి)

చేరాయి. మోర్తు ఆమోదం కూడా లభించింది. ప్రస్తుతం ఆ ప్రతిపాదనలు ప్రైవేట్ అండ్ పబ్లిక్ పార్టనర్‌షిప్ అప్రైజల్ కమిటీ (పీపీపీఏసీ)కి వెళ్లాయి. అక్కడి నుంచి ఆమోదం వచ్చాక కేంద్ర క్యాబినెట్‌కు వెళ్తాయి. అక్కడ కూడా ఆమోదముద్ర వేశాక అధికారిక గజిట్ నోటిఫికేషన్ వెలువడుతుంది. ఈ ప్రక్రియ పూర్తి కావటానికి ఐదారు నెలలకు పైగా పట్టే అవకాశం ఉంది.

40 శాతం నిధులు ఇవ్వనున్న కేంద్రం

అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డును హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో తలపెడుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఇస్తుంది. ప్రాజెక్టు పూర్తిచేయాల్సిన మూడేళ్లలో కాంట్రాక్టు సంస్థకు ఆ నిధులు అందిస్తుంది. రూ.24 వేల కోట్ల అంచనా వ్యయంలో రూ.5 వేల కోట్లు భూ సేకరణకు అవసరం. భూ సేకరణ వ్యయంలో రూ.1,000 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. మిగిలిన రూ.4 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వమే ఇస్తుంది. మిగిలిన రూ.19 వేల కోట్లలో 40 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం మూడేళ్లలో దశలవారీగా కాంట్రాక్టు సంస్థకు చెల్లిస్తుంది. మిగిలిన 60 శాతం నిధులను ఆ తర్వాత 15 ఏళ్లలో చెల్లిస్తుంది. టోల్‌గేట్ల నిర్వహణ వంటివి కాంట్రాక్టు సంస్థతో సంబంధం లేకుండా ఎన్‌హెచ్ అధికారులే స్వయంగా చేపడతారు.

రాజధానికి ఇక హైస్పీడ్

(5వ పేజీ తరువాయి)

జిల్లాల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ వెళ్తుంది. రాష్ట్రంలో ఈ ప్రాజెక్టు 504 కిలోమీటర్ల పరిధి ఉండగా, అమరావతిలో మొత్తం 147.45 కిలోమీటర్ల పరిధిలో హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ సాగుతుంది. పల్నాడు జిల్లా మీదుగా 81 కిలోమీటర్లు, గుంటూరు జిల్లా మీదుగా 66.45 కిలోమీటర్లు సాగుతుంది. ఈ ప్రాజెక్టుకు మొత్తం 1,873.7 హెక్టార్ల భూములను రైట్స్ సంస్థ ప్రతిపాదించగా, రాజధానిలో 442.35 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది.



శివరామకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

సమస్యలు సత్వరం పరిష్కరించాలి

» ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న చిన్నచిన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు నియోజకవర్గంలో బుధవారం సుడిగాలి పర్యటన చేసి అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకులను పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనారోయంతో బాధపడుతున్న వీరపనేనిగూడెం గ్రామానికి చెందిన టీడీపీ నేత ఉయ్యూరి శ్రీరామిరెడ్డిని పరామర్శించారు. బాపులపాడు మల్లవల్లిలో యనమదల వెంకయ్యారావును పరామర్శించారు. కొత్తపల్లి గ్రామం ఇటీవల మరణించిన షేక్ బషీర్ కుటుంబాన్ని పరామర్శించారు. అంపాపురంలో అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ నేత గోగినేని శివరామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

ఉంగుటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆధార్ అప్‌డేట్ చేయని పిల్లలకోసం గురువారం నుంచి 30వరకు ప్రభుత్వపాఠశాలలు, కళాశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక బయోమెట్రిక్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఇ.సత్యకుమార్ తెలిపారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ పాఠశాల అడ్మిషన్లు, జేఈఈ, నీట్ వంటి ప్రవేశపరీక్షలు, స్కాలర్‌షిప్, ప్రత్యేక ప్రయోజన బదిలీ పథకాలకు ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలన్నారు.

ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

» ది విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట్ కో-ఆపరేటివ్ హౌస్ సొసైటీ

విజయవాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని 'ది విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ' ప్రతినిధులు కోరారు. నగరంలోని బాలోత్సవ్ భవన్‌లో బుధవారం సొసైటీ అత్యవసర సమావేశం జరిగింది. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం 2019లో జారీచేసిన 377 జీవో ప్రకారం.. విజయవాడ రూరల్ మండలంలోని నున్న గ్రామంలో సొసైటీకి కేటాయించిన స్థలంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ పర్యవేక్షణలో గృహ నిర్మాణ శాఖ ద్వారా పాత్రికేయులకు ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ సమావేశంలో తీర్మానం చేశారు. రాష్ట్ర ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తున్న కూటమి ప్రభుత్వం జర్నలిస్టులు సుదీర్ఘకాలంగా పోరాడుతున్న ఇళ్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇదే విషయమై పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించిన గన్నవరం ఎమ్మెల్యే, విప్ యార్లగడ్డ వెంకట్రావుకు, పాత్రికేయుల ఇళ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్‌లకు జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో గృహ నిర్మాణాలపై త్వరలో జరగనున్న మంత్రి వర్గ సమావేశంలో తమ సమస్యలపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలనాలని సీఎం చంద్రబాబును కోరారు. సతీష్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సొసైటీ సీఈవో వెంకట్రావు, డైరెక్టర్లు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలు పరిష్కరించండి : కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్, అందరికీ ఇళ్లు అనే అంశాలపై భూ పరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ ఇలక్కియాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ అర్జీల్లో అపరిష్కృతంగా ఉన్న వాటి వివరాలు శాఖల వారీగా, మండలాల వారీగా తెలియజేయాలన్నారు. అర్జీల పరిష్కార విషయంలో అలసత్వం చూపరాదని, త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కీలక ప్రగతి సూచికల్లో (కేపీఐ) ఐసీడీఎస్, పోలీసు శాఖల అంశాలలో పురోగతి ఉండాలన్నారు. ఈ క్రాప్ నమోదు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. డీఆర్వో ఎం లక్ష్మీ నరసింహం, కేఆర్ఆర్‌సీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎ.పోసిబాబు, జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమారి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జీ జ్యోతి, డీఎస్ఎల్‌వో వై మోహన్‌రావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

» ఇంజనీరింగ్ అధికారులకు ఈవో ఆదేశం

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను త్వరిగతిన పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని దేవస్థానం ఈవో వీకే శీనానాయక్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భవానీదీక్ష విరమణల సమయానికి ఏమేరకు ప్రధాన అభివృద్ధి పనులు అందుబాటులో ఉంటాయో తెలియజేయాలని ఈవో అధికారులను కోరారు. బుధవారం ఈవో తన చాంబర్‌లో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణతో కలిసి అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం



అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష చేస్తున్న ఈవో శీనానాయక్

నిర్మాణం జరుగుతున్న నూతన అన్నప్రసాద భవనం, లడ్డూ పోటు భవనం, ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ పనులు ఏమేరకు జరుగుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులు ఎప్పటిలోగా పూర్తి అవుతాయో సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి లిఖితపూర్వకంగా తెలియపరచాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు దేవదాయశాఖ కమిషనర్ నివేదిక పంపాలని ఆదేశించారని వివరించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు రాక పెరుగుతున్న నేపథ్యంలో భక్తులకు కావాల్సిన కనీస మౌలిక వసతులు, సదుపాయాలు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. త్వరలో దేవదాయ శాఖ మంత్రి, కమిషనర్ సమీక్ష నిర్వహించనున్నారని, ఆ సమయానికి అన్ని అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు, ఏసీ రంగరావు, ఏఈ రంగారావు, ఏఈఓలు బి.వెంకటరెడ్డి, ఎన్.రమేష్‌బాబు, చంద్రశేఖర్, సుధారాణి, శ్రీనివాస్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యూలో భక్తుడికి పాముకాటు

» జీజీహెచ్‌కి తరలించిన సిబ్బంది

» ప్రమాదం లేదని చెప్పిన వైద్యులు

» ఊపిరిపీల్చుకున్న కుటుంబసభ్యులు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి విచ్చేసి ఉచిత క్యూలో నిలబడి ఉన్న బాపట్ల జిల్లాకు చెందిన యువకుడిని (25)ని పాము కాటు వేసిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఆలయ సిబ్బంది భక్తుడిని హుటాహుటిన దేవస్థానం అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. వివరాల మేరకు.. బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన శ్రీనివాసరావు కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చాడు. ఎనిమిది మందితో కొండపైన డోనర్ సెల్ సమీపంలో ఉచిత క్యూలో నిలబడి ఉండగా.. శ్రీనివాసరావును పాము కాటు వేయటంతో భయభ్రాంతులకు గురయ్యారు. అదే సమయంలో దిగువ నుంచి కొండపైకి వచ్చిన దేవస్థానం అంబులెన్స్‌లో ఆలయ సిబ్బంది, ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు శ్రీనివాసరావును హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయాన్ని దేవస్థానం ఉన్నతాధికారులకు తెలియజేశారు. వైద్యులు శ్రీనివాసరావును పరీక్షించి ఎటువంటి ప్రమాదం లేదని చెప్పటంతో కుటుంబసభ్యులు, దేవస్థానం సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. కరిచిన పాము విషసర్పం కాదని వైద్యులు చెప్పారు. శ్రీనివాసరావుకు చికిత్సచేసి కుటంబ సభ్యులకు అప్పగించారు. కాగా, క్యూలోకి రెండుమూడు పాములు వచ్చినట్టు పలువురు భక్తులు తెలిపారు.

కోళ్లు కొట్టేస్తున్నారు..!

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో తెలంగాణకు సరిహద్దులుగా ఉన్న గ్రామాల్లో చాలామంది పశుసంపదపై ఆధారపడి జీవిస్తుంటారు. గొర్రెలు, మేకలు పెంచుతూ జీవిస్తారు. కృష్ణాజిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో కోడిపుంజులను పెంచుతుంటారు. జనవరిలో సంక్రాంతి సంబరాల్లో మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కోడిపందేలు వేస్తారు. ఇక్కడ జరిగే కోడిపందేలను వీక్షించడానికి తెలంగాణ నుంచి వస్తారు. ఈ పందేల్లో కాలు దువ్వే పుంజులను ఇప్పటి నుంచే బలీయంగా తయారు చేస్తుంటారు. ఇందుకోసం గ్రామ శివారుల్లో, తోటల్లో మినీ ఫౌల్ట్రీలు నిర్వహిస్తుంటారు. ఈ పుంజులు ఎక్కడికీ పారిపోకుండా చుట్టూ ఇనుపకంచెను ఏర్పాటు చేసి మధ్యలో వాటిని ఉంచుతారు. అక్కడే పౌష్టికాహారం ఇస్తుంటారు. ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న గొర్రెలు, మేకలను, కృష్ణాజిల్లాలో కోడిపుంజులను ఈ స్టూవర్టుపురం దొంగలు మాయం చేస్తున్నారు. కోడిపుంజుల చుట్టూ ఉన్న ఇనుపకంచెను కట్టర్లతో కట్‌చేసి వాటిని ఎత్తుకుపోతున్నారు.

పోలీసుల అదుపులో ఓ నిందితుడు

కొద్దిరోజుల క్రితం జగ్గయ్యపేట పోలీసులు అర్ధరాత్రి వాహన తనిఖీలు చేస్తుండగా, ఐదారుగురు స్టూవర్టుపురం దొంగలు వ్యాన్‌లో గొర్రెలతో వెళ్తున్నారు. దీన్ని గమనించిన పోలీసులు వాహనాన్ని ఆపి అందులో ఉన్న యువకులను ప్రశ్నించారు. పోలీసులు వివరాలు తీసుకుంటుండగా వారు పరారయ్యారు. పారిపోతున్న మరో యువకుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి దొంగిలించిన గొర్రెలు, మేకలు, కోడిపుంజులను గుంటూరు జిల్లాకు తీసుకెళ్లి తెల్లవారుజామున జరిగే సంతలో విక్రయిస్తున్నారు. ఒక గొర్రె రూ.లక్ష విలువ చేస్తే దాన్ని సగంధరకు విక్రయిస్తున్నారు. కోడిపుంజులను వేలాది రూపాయలకు అమ్మేస్తున్నారు. అర్ధరాత్రి దొంగిలించిన పశుసంపదను వెంటనే సరిహద్దులు దాటించి సంతలో అమ్మేస్తున్నారు. తర్వాత మళ్లీ వేటకు వస్తున్నారు. పోలీసులకు చిక్కిన యువకుడ్ని ప్రశ్నించడం ద్వారా ప్రధాన నిందితులను పట్టుకునేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే అసలు నిందితులు ఎవరన్నది పోలీసులు గుర్తించారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137,146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు జిల్లా నుంచి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు

ఆటోనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్‌లో నవంబరు 14, 15తేదీల్లో జరిగే పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు జిల్లా నుంచి వంద మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హాజరవుతారని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎం. మధు చెప్పారు. బుధవారం జవహర్ ఆటోనగర్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు తరలివస్తారని తెలిపారు. జిల్లా నుంచి వెళ్లే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎంవోయూలను తెలుసుకోవడం, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అంశాలపై అవగాహన పెంచుకుంటారని పేర్కొన్నారు.



త్రిశక్తిపీఠంలో శివుడికి అభిషేకాలు నిర్వహించిన పండితులు

త్రిశక్తిపీఠంలో కార్తీకమాస పూజలు ప్రారంభం

కృష్ణలంక, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): త్రిశక్తిపీఠంలోని కాళీమాత ఆలయంలో కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా బుధవారం నుంచి నవంబరు 20 వరకు కార్తీకమాస పూజలు ప్రారంభమయ్యాయి. తొలిరోజైన బుధవారం ఆలయ కమిటీ సభ్యులు కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయకిరణ్‌లు పండితులచే పూజలు నిర్వహించి శివునికి అభిషేకాలు చేశారు. కార్తీకమాసం సందర్భంగా 365 లింగాలతో తయారు చేయబడిన మహా లింగార్చన నెలరోజుల పాటు మాసదీక్షగా చేస్తారని వారు తెలిపారు. నవంబరు 2న ఆలయ ఆవరణలో సత్యనారాయణ స్వామి వ్రతాలు ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు.

పాతశివాలయంలో కార్తీకమాస నక్త దీక్ష మహోత్సవాలు

వన్‌టౌన్: స్థానిక భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానం (పాతశివాలయం)లో బుధవారం నుంచి కార్తీకమాస నక్త దీక్ష మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. 30 రోజులపాటు వివిధ అలంకారాల్లో మూల విరాట్ భ్రమరాంబ దేవి దర్శనం ఇవ్వనున్నారు. కార్తీకమాస రోజుల్లో శివుడికి ప్రత్యేక అభి షేకాలు, అర్చనాదులు జరుగుతాయి. భ్రమరాంబాదేవికి ప్రత్యేక అలంకరణలు చేయటం పాత శివాలయంలో ఆనవాయితీగా వస్తుంది. తొలి రోజు బుధవారం అమ్మవారు రజత కవచా లాంకృత దేవిగా దర్శనం ఇచ్చారు. మల్లేశ్వర స్వామికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, తదితరాలను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు. ఉపాలయంగా ఉన్న అయ్యప్పస్వామికి ప్రత్యేక అర్చనలు చేస్తున్నారు.

రోడ్లు జలమయం



ఆర్‌ఆర్ గార్డెన్ నుంచి ఆటోనగర్ వెళ్లే రోడ్డులో నిలిచిన వర్షపునీరు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: నగరంలో బుధవారం కురిసిన వర్షానికి పల్లంగా ఉన్న పలు ప్రధాన రోడ్లు, కాలనీలోని అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. తూర్పు పరిధిలోని వరలక్ష్మీనగర్ కాలనీ సమీపంలోని ఐదవ నెంబర్ రోడ్డు, గురునానక్ రోడ్డు, ఆర్‌ఆర్ గార్డెన్‌నుంచి ఆటోనగర్ వెళ్లే రోడ్డు, సుబ్బారావు కాలనీ అంతర్గత రోడ్లు, ఎల్‌ఐసీ కాలనీ అంతర్గత రోడ్లు, పీఅండ్‌టీ కాలనీలోని పలు అంతర్గత రోడ్లు వర్షానికి జలమయమయ్యాయి. దీంతో ఆ సమయంలో వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ రోడ్ల వెంబడి సైడ్ కాలువ లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసిన ప్రవహించే దారి లేక రోడ్లమీద వరద నీరు నిలిచిపోతున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



గురునానక్ రోడ్డులో, వరలక్ష్మీ నగర్ కాలనీ సమీపంలో నిలిచిన వర్షపునీరు

యువత శాస్త్రవేత్తలుగా ఎదగాలి

బిట్స్ పిలానీ విభాగాధిపతి, ప్రొఫెసర్ చింతలూరి మోహన్‌రావు



ప్రొఫెసర్ చింతలూరి మోహన్‌రావును సత్కరిస్తున్న పీబీ సిద్ధార్థ యాజమాన్యం, సిబ్బంది

మొగల్రాజపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధస్సును, నూతన సాంకేతిక పరిజ్ఞానాలను ఆహ్వానించలేని వారు నిరక్షరాస్యులుగా మిగిలిపోతారని జాతీయ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ అనుబంధ అకడమిక్ ప్లానింగ్ కమిటీ చైర్మన్, సెంటర్‌ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ పూర్వ సంచాలకులు, బిట్స్ పిలానీ విభాగాధిపతి ప్రొఫెసర్ చింతలూరి మోహన్‌రావు తెలిపారు. సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవ సంవత్సర కార్యక్రమంగా పీబీ సిద్ధార్థ కళాశాలలో బుధవారం ఆధునిక జీవశాస్త్రంలో పురోగతి అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ యువత శాస్త్రవేత్తలుగా మారి సమాజానికి అవిశ్రాంత సేవలు అందించాలని చెప్పారు. కోవిడ్ సమయంలో మాలిక్యులర్ బయాలజీ ల్యాబరేటరీలు చేసిన పరిశోధన కృషి మరువలేనిదని చెప్పారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్, డాక్టర్ పిన్నమనేని వైద్యకళాశాల డైరెక్టర్ ప్రొఫసర్ సీవీ రావు, వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పువ్వాడ శ్రీనివాసరావు, అధ్యాపకురాలు డి. శ్రావణి, జీవసాంకేతిక శాస్త్ర అధ్యాపకులు, జంతుశాస్త్ర అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

అయ్యప్పల అన్నసమారాధన



ఐలా మాజీ చైర్మన్ దుర్గాప్రసాద్‌తో కలిసి అయ్యప్పలకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గద్దె

ఆటోనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జవహర్ ఆటోనగర్ రెండో రోడ్డు రెండో క్రాస్‌లో శ్రీవిజయ కనకదుర్గ భక్త బృందం, అయ్యప్పస్వామి అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్పల కార్తీక మాస అన్నసమారాధన కార్యక్రమాన్ని బుధవారం తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అయ్యప్ప స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్‌తో కలిసి అయ్యప్ప భక్తులకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ నేత బొప్పన భవకుమార్, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ కలాం, అన్నసమారాధన నిర్వాహకులు తిరుమాని బ్రదర్స్, గురుస్వామి కింగున నారాయణ, జి. వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డీసీ క్యాంప్‌కు నలంద విద్యార్థులు ఎంపిక

లబ్బీపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే ఎన్‌సీసీ పరేడ్‌లో పాల్గొనే విధంగా క్యాడెట్లు కృషి చేయాలని 17(ఎ)బియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జి.సి.పాండే తెలిపారు. ఆర్‌డీసీ క్యాంప్‌లో పాల్గొని తదుపరి శిక్షణకు ఎంపికైన నలంద కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లను ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, ఎన్‌సీసీ అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ తాడేపల్లిగూడెంలో నిర్వహించిన ఆర్‌డీసీ ఇంటర్ గ్రూప్ ఐజీసీ-1 సెలక్షన్స్‌లో తమ కళాశాలకు చెందిన ముగ్గురు క్యాడెట్‌లు ఎల్.రోహిత్, డి.నాని, వై.వినోద్ కుమార్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల ను ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కె.సుధాకర్, అధ్యాపకులు అభినందించారు.



న్యూ ఆర్‌టీసీ కాలనీ 3 వ లైన్‌లో, వీవీ రామారావు వీధిలో, న్యూ ఆర్‌టీసీ కాలనీ రోడ్డులో వేలాడుతున్న హైటెన్షన్ విద్యుత్ తీగలు

చేతికందే ఎత్తులో హైటెన్షన్ విద్యుత్ తీగలు


పొంచి ఉన్న ప్రమాదం..ఆందోళనలో స్థానికులు

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: స్థానిక 13 వ డివిజన్ జేడీ నగర్ వాటర్ ట్యాంక్ రోడ్డు, ఎలక్ట్రిసిటీ కాలనీ, వి.వి రామారావు వీధి, న్యూ ఆర్‌టీసీ కాలనీ, పలు వీధులలో నివాసాలను ఆనుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, హైటెన్షన్ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా చేతికందేలా వేలాడుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదమరచి వాటిని ముట్టుకుంటే కరెంట్ షాక్ తగిలి ప్రజలకు ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం పొంచి ఉందని బెంబేలెత్తుతున్నారు. సంబంధిత శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఇది కేవలం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమేనని మండి పడుతున్నారు.

ఇప్పటికైనా తక్షణమే సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వెలగని వీధిలైటు

కమిటీ హాల్ రోడ్డు చీకటిమయం



భారతీనగర్, ఆంధ్రజ్యోతి: మెయిన్ రోడ్డు, అంతర్గత రోడ్లలో సరిగా వెలగని వీధిలైట్లతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 11వ డివిజన్ పరిధిలోని వివేకానంద కాలనీలోని కనకమేడల రవీంద్ర కుమార్ కమిటీహాల్ సమీపంలోని వీధిలైట్లు సుమారు వారం రోజుల నుంచి వెలగడం లేదు. దీంతో రోడ్డు అంతా చీకటిగా మారుతుంది. దీంతో ఆ సమయంలో బయటకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బస్టేషన్‌లో కొమరం భీమ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్టీసీ జైభీమ్ అసోసియేషన్ నాయకులు

కొమరం భీమ్ జయంతి వేడుకలు

బస్టేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్ ప్రాంగణంలో బుధవారం ఏపీఎస్ఆర్టీసీ జైభీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొమరం భీమ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పి.కిరణ్‌బుజ్జి, కోశాధికారి ఎస్.ఎల్.రావు కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.వి.మూర్తి, విజయవాడ డిపో సెక్రటరీ ఎం.ఎస్.కుమార్, బి.నాగరాజు, ఆర్.బాలరాజు, ఎస్.రాంబాబు, టి.భాను, సి.హెచ్.సామ్యేల్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత ప్రచార యాత్ర 31 నుంచి

మై భారత్ రాష్ట్ర సంచాలకుడు ప్రసాద్‌దాస్



మాట్లాడుతున్న మై భారత్ రాష్ట్ర సంచాలకుడు ప్రసాద్‌దాస్

విజయవాడ సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జాతీయ సమైక్యత దినోత్సవాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు కేంద్ర క్రీడలు, యువజన సంక్షేమం, మై భారత్ రాష్ట్ర సంచాలకుడు ఏ.ప్రసాద్‌దాస్ తెలిపారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశపు మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 31నుంచి నవంబరు 25 వరకు అతిపెద్ద ప్రచార యాత్రను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువతలో ఐక్యత, దేశభక్తి భావాన్ని పెంచేందుకు అన్ని జిల్లాల్లోనూ యూనిటీ మార్చ్‌ను నిర్వహించి, పటేల్ త్యాగాలను ప్రజలకు వివరిస్తామన్నారు. యువతకు సోషల్ మీడియా రీల్స్, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఉప సంచాలకులు ఎస్‌వీడీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్‌లో భాగంగా స్థానిక సంస్కృతి, వైవిధ్యాలను ప్రతిబింబించేలా పట్టణాలు, గ్రామాల్లో పాదయాత్రలు జరుగుతాయన్నారు. యోగా, ఆరోగ్య శిబిరాలు, అవగాహన సదస్సులు, మత్తు రహిత భారత ప్రతిజ్ఞలు నిర్వహిస్తామన్నారు. ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి డాక్టర్ ఎం.సుధాకర్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో 8 కిలోమీటర్లు నుంచి 10 కిలోమీటర్ల వరకు ప్రచార యాత్ర నిర్వహిస్తామన్నారు. దీని కోసం మై భారత్ పోర్టల్‌లో విద్యార్థులు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మై భారత్ జిల్లా అధికారి సుంకర రాము, జిల్లా యువజన సంక్షేమ శాఖ సీఈవో యు.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎయిర్ పిస్టల్ షూటింగ్‌కు సిద్ధార్థ వర్సిటీ విద్యార్థులు



ఎయిర్ పిస్టల్ షూటింగ్ టోర్నమెంట్‌కు వెళ్లే విద్యార్థులతో సిద్ధార్థ వర్సిటీ యాజమాన్యం

కానూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లోని గురు కాశీవిశ్వవిద్యాలయంలో ఈనెల 24నుంచి 29వ తేదీ వరకు జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఎయిర్ పిస్టల్ షూటింగ్ టోర్నమెంట్‌కు కానూరు సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనున్నారు. బీటెక్ రెండో సంవత్సరం చదివే విద్యార్థి పి. త్రినాథ్ చౌదరి పురుషుల విభాగం, కె. పూజిత మహిళల విభాగంలో ఎయిర్ పిస్టల్ షూటింగ్ పోటీలకు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

● ఇరుకు రోడ్లతో అవస్థలు

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: 14వ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లోని ఎన్‌ఎస్‌ఎం స్కూల్ పక్క రోడ్డును ఆయా ప్రాంతాల్లోని కార్లు, వ్యాన్ల యజమానులు ఆక్రమించేశారు. ఈ రోడ్డులోనే అంబేడ్కర్‌నగర్, సత్యనారాయణనగర్, లంబాడీపేట ప్రాంతాల ప్రజలు పటమట, బందరు రోడ్డు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు.

దాదాపు 40 అడుగుల వెడల్పుతో సుమారు 200 మీటర్ల దూరం ఉండే ఈ రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు ఇరువైపులా, కార్లు, ఇతర వాహనాలు నిలుపుదల చేస్తున్నారు. ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ప్రైవేట్, ప్రభుత్వ కార్యాలయాలకు విధుల నిమిత్తం వెళ్లే ఉద్యోగులు ఈ ప్రాంతానికి రాగానే తీవ్ర అసహనం చెందుతున్నారు. కొన్ని సందర్భాల్లో నడిచేందుకు సైతం వీలుండటం లేదని ప్రయాణికులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎన్‌ఎస్‌ఎం స్కూల్ పక్క రోడ్డులో పార్క్ చేసిన వాహనాలు



దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కృష్ణానదిలో భక్తుల పుణ్యస్నానాలు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా తొలిరోజు బుధవారం దుర్గాఘాట్ కృష్ణానదిలో భక్తులు భక్తిశ్రద్ధలతోనే పుణ్యస్నానాలాచరించారు. అనంతరం దేవస్థానం ప్రాంగణంలోని మల్లేశ్వరస్వామిని, వన్‌టౌన్ శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం(పాత శివాలయం)లో స్వామిని దర్శించుకున్నారు. దుర్గగుడి అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘాట్‌లో భద్రతా చర్యలు తీసుకున్నారు. కృష్ణానదిలో వరద నీరు ఎక్కువగా ఉండటంతో భక్తులను నదిలోకి వెళ్లనీయకుండా ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను నియమించారు. దీంతో భక్తులు జల్లుస్నానాలు ఆచరించారు.

ఎన్ఐటీటీటీఆర్ సెంటర్
నిర్మాణానికి వేగంగా అడుగులు

● పాలిటెక్నిక్ కాలేజీ ఆవరణలో నిర్మాణానికి సన్నాహాలు

విజయవాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐటీటీటీఆర్) ఏపీ ఎక్స్‌టెన్షన్ సెంటర్ నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ప్రతిష్ఠాత్మకమైన ఈ కేంద్రాన్ని రాష్ట్రంలో నెలకొల్పేందుకు చెన్నైలోని ఎన్ఐటీటీటీఆర్ డైరెక్టరేట్ రెండేళ్ల క్రితమే అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో ఈ సెంటర్ నిర్మాణానికి అనువైన స్థలం కోసం కొన్నాళ్ల పాటు అన్వేషణ జరిగింది. విజయవాడ నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఆవరణలో ఈ సెంటర్ ఏర్పాటు చేయాలని, దానికి అనుగుణంగా నూతన శాశ్వత భవనాన్ని నిర్మాణం చేయాలని ప్రభుత్వం భావించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ ఎన్ఐటీటీటీఆర్ సెంటర్ నూతన భవన నిర్మాణానికి 6వేల చదరపు అడుగుల కావాల్సి ఉంటుందని అంచనా వేశారు. దీనికి స్థలం సమకూర్చే పనిని విజయవాడ తూర్పు మండల తహసీల్దార్‌కు అప్పగించారు. పాలిటెక్నిక్ కాలేజీలోని 5/6 సర్వే నెంబర్‌లో ఆరు సెంట్లు, 6/3 సర్వే నెంబర్‌లో ఏడున్నర సెంట్ల ప్రభుత్వ భూమి ఉందని తహసీల్దార్ కార్యాలయ అధికారులు గుర్తించారు. ఈ స్థలాలను పూర్తిగా సర్వే చేసి ఈ రిపోర్టును కలెక్టర్‌కు అందజేశారు. ఈ స్థలంపై ప్రజాభిప్రాయ సేకరణ, ఫిర్యాదుల కోసం గతంలోనే నోటీసులు జారీ చేశారు. నోటీసుల గడువు పూర్తయ్యాక ప్రస్తుత తరుణంలో కౌన్సిల్ ఆమోదం కోసం పంపారు. ఈ సెంటర్ ఏర్పాటు జరిగితే అందుబాటులోనే టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ తీసుకునే అవకాశం యువతకు దక్కుతుంది.



కర్ణాటకలో పర్యటిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రతినిధుల బృందం

ఏపీని డంప్ ఫ్రీ స్టేట్‌గా మారుస్తాం

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

● కర్ణాటకలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ బృందం పర్యటన

విజయవాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని డంప్ ఫ్రీ స్టేట్‌గా మార్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. ఆయన నేతృత్వంలో కర్ణాటకలోని మంగుళూరు, దక్షిణ కన్నడ జిల్లాల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ బృందం పర్యటించింది. అక్కడ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ పనితీరును ఈ బృందం స్వయంగా పరిశీలించింది. మంగుళూరు, దక్షిణ కన్నడ జిల్లాల్లోని ఎడపడవు, ఉజురే గ్రామ పంచాయతీల్లోని మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్‌లను, ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ పనితీరును అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని ఏపీలో పూర్తిగా నిరోధించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో 175 నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్‌ల స్థాపనకు ప్రణాళికలు చేస్తామన్నారు.

క్రీడా అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

లబ్బీపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, క్రీడల విభాగం 2025 సంవత్సరానికి సంబంధించి అర్జున అవార్డు, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహక్ పురస్కార్ నిమిత్తం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు శాప్ కార్యాలయం తెలిపింది. దరఖాస్తులు పూర్తిగా ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలని, అవార్డు మార్గదర్శకాల ప్రకారం అర్హత ఉన్న వ్యక్తులు స్వయంగా ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలని కార్యాలయం తెలిపింది. దరఖాస్తుల సమర్పణకు అక్టోబరు 28 చివరితేది అని తెలిపింది.

పాస్టర్‌పై పోక్సో కేసు నమోదు

కంచికచర్ల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బాలికల పట్ల తరచూ వేధింపులు, అత్యాచారాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. తాజాగా మండల కేంద్రమైన కంచికచర్లలో ఓ బాలిక పట్ల ఏకంగా ఒక పాస్టర్ అసభ్యకరంగా ప్రవర్తించడం వెలుగు చూసింది. దీంతో పాస్టర్‌పై కంచికచర్ల పోలీస్ స్టేషన్లో పోక్సో కేసు నమోదైంది. కంచికచర్ల ఎస్ఐ విశ్వనాథ్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం స్థానిక న్యూ అంబేడ్కర్ కాలనీకి చెందిన 14ఏళ్ల బాలిక అదే కాలనీలో ఉంటున్న భట్టు సుధీర్‌కుమార్ అనే పాస్టర్ 6 నెలల క్రితం చర్చికి ప్రార్థనకు వచ్చిన సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించినట్టు తెలిపారు. అప్పటి నుంచి బాలిక కనిపించినప్పుడల్లా బెదిరిస్తూ వేధిస్తున్నాడు. ఈ మేరకు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పాస్టర్ సుధీర్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వీబీసీ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు విమల కన్నుమూత



గొల్లపూడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు సంక్షేమ శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్, వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు సూరపనేని విమల (87) సోమవారం ఉదయం హైదరాబాద్‌లో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె భౌతిక కాయాన్ని విజయవాడ సమీపంలోని గొల్లపూడిలోని వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయానికి తరలించగా, పలువురు నివాళులర్పించారు. అనంతరం విమల ఆకాంక్షకు అనుగుణంగా ఆమె భౌతిక కాయాన్ని కృష్ణాజిల్లా గన్నవరం సమీపంలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు అప్పగించారు. ఆమె తన విశ్రాంత జీవితమంతా సేవా కార్యక్రమాలకే అంకితం చేశారు. 2000లో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ లైబ్రరీ భవన నిర్మాణానికి తన సోదరుడితో కలిపి భూరి విరాళం అందజేశారు. రామవరప్పాడులో హోమియో ఆసుపత్రిని ప్రారంభించి ఉచిత వైద్య సేవలందించారు. వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్టు స్థాపించి, దివ్యాంగ విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించి, బోర్డ్ ఎగ్జామ్స్ రాయించారు. మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రం నిర్వహించారు. బాలికలకు కరాటే శిక్షణ ఇప్పించారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు మనోహర్ నాయుడు, కే లక్ష్మయ్య, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు జీ ప్రభుదాస్, వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ విమల భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు





ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సమక్షంలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సాదం శ్రీనాథ్, మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా

విద్యాధరపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం 64వ డివిజన్ పరిధి కుందావారి కండ్రికలో ది విజయ కుందావారి కండ్రిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ కార్యాలయం వద్ద ఆ సంఘం నూతన చైర్మన్‌గా సాదం శ్రీనాథ్, డైరెక్టర్లుగా పొన్నం శేషగిరిరావు, దేవిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథిగా బొండా ఉమామహేశ్వరరావు హాజరై చైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు భద్రత, భరోసా కల్పిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం 16 నెలల్లో రైతుల సంక్షేమానికి పలు అభివృద్ధి పనులు, పథకాలు అమలు చేస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులు పండించి అమ్ముకున్న ధాన్యానికి డబ్బులు సకాలంలో ప్రభుత్వం చెల్లించక పోవటంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు రూ.1,250 కోట్ల ధాన్యం బకాయిలను రైతుల ఖాతాలలో జమచేసిందన్నారు. రైతన్న నేస్తం పథకం కింద ఎకరానికి రూ.20లు అందిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా తొలి విడతగా రూ.7వేలను ప్రభుత్వం రైతుల ఖాతాలలో జమచేసిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత ఉన్నప్పటికీ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సెంట్రల్ పరిధిలోని రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేసి రైతులకు అండగా నిలిచామన్నారు. పాడి రైతులు, మహిళా రైతులు బ్రహ్మాండగా రాణిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్, డైరెక్టర్‌కు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. టీడీపీ 64వ డివిజన్ అధ్యక్షుడు కాకొల్లు రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే బాబు, చైర్మన్, డైరెక్టర్ల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, స్థానిక టీడీపీ నేతలు, వ్యవసాయ సహకార పరపతి సంఘం అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్.. పదిమందిపై కేసు



స్టేషన్ వద్ద ఉన్న సీజ్ చేసిన ట్రాక్టర్లు

తిరువూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు సాగిస్తున్న అక్రమ ఇసుక దందాను పోలీసులు అడ్డుకున్నారు. ఇసుకలోడుతో తెలంగాణకు వెళుతున్న ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని ట్రాక్టర్ యాజమానులతో పాటు, ఇసుక అక్రమ రవాణా చేస్తున్న పదిమందిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఎస్సై కేవీజీవీ సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఇసుక అక్రమ రవాణ కేసులో అరెస్టు అయిన వారిని వదిలేయాలని, సీఐ కార్యాలయం వద్ద వైసీపీ నేతలు హల్‌చల్ చేశారు. వైసీపీకి చెందిన జిల్లాస్థాయి నేతతో పోలీసులపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు.

ఈ ఘటనకు సబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏ కొండూరు మండలానికి చెందిన ఒక వైసీపీ నేత ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో తెలంగాణ ప్రాంతానికి కొన్ని నెలలుగా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నాడనే ఆరోపణలున్నాయి. మంగళవారం రాత్రి అక్కపాలెం మీదుగా తెలంగాణకు ఇసుక ట్రాక్టర్లు వెళుతుండగా, గ్రామస్థులు ట్రాక్టర్లను నిలిపేశారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునేలోగా, ట్రాక్టర్లను కల్లూరు పోలీసులు తమ స్టేషన్‌కు తరలించారు. అక్కడ నుంచి తిరువూరు పోలీసులు ట్రాక్టర్లను తిరువూరు స్టేషన్‌కు తరలించారు. దీనిపై సీఐ గిరిబాబు దర్యాప్తు చేపట్టారు. ట్రాక్టర్ యాజమానుల సెల్‌ఫోన్ కాల్‌డేటా ఆధారంగా, వీరు ఎవరికి ఫోన్లు చేశారు. ఎక్కడెక్కడ ఇసుక తోలకాలు చేశారు. వీరి వెనుక ఉన్న పెద్దలెవరనే విషయాలతో పాటుగా అధికార పార్టీకి చెందినవారు వారెవరైనా ఉన్నారా అన్నదానిపై దర్యాప్తు చేపట్టినట్టు సమాచారం.

పదిమంది అరెస్టు

ఇసుక అక్రమ రవాణా కేసులో అయిదు ట్రాక్టర్లు సీజ్‌తో పాటు ట్రాక్టర్ల డ్రైవర్లు, ఓనర్లు చిట్టిపోతు శ్రీను, పొదిలి గోపాలరావు, చిమట రామకృష్ణ, రాజబోయిన వెంకటేశ్వరరావు, కాలసాని వెంకటేశ్వరరావు, కఠారి దుర్గారావు, వలదాసి కిషోర్, తొట జయరామ్, చిట్టిపోతుల శివ, కాలసాని చెన్నారావుపై కేసు నమోదు చేశారు. కాగా ఇసుక అక్రమ రవాణ చేస్తున్న వైసీపీ నేతలు ఈ కేసు నుంచి బయటపడేందుకు, తమ పార్టీపెద్దల్ని రంగంలోని దింపే యత్నాలు చేశారు.

శంకరన్ ఆశయాలు శ్లాఘనీయం

● జయంతి సభలో వక్తలు



శంకరన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

గవర్నర్‌పేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో నెలకొన్న సామాజిక అసమానతలను రూపుమాపేందుకు ఉన్నతాధికారి హోదాలో ఎస్ఆర్ శంకరన్ తీసుకున్న నిర్ణయాలు నిర్మాణాత్మకమైన మార్పులకు కారణమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఎన్నో చట్టాలను, పథకాలను రూపొందించిన ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ 91వ జయంతి బుధవారం లెనిన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఐక్యతా భవన్‌లో జరిగింది. శంకరన్ కాంస్య విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి విశేషమైన కృషి చేసిన అధికారిని స్మరించుకోవడం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు, తిరువూరు ఎమ్మెల్యే కొలకపూడి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కాకి సునీత తదితరులు మాట్లాడుతూ ఉన్నతాధికారిగా శంకరన్ పేద ప్రజలకు అందించిన ఫలాలను, ఆయన ఆశయాలను గుర్తు చేసుకోవడం ప్రసంశనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్షుడు వీ విద్యాసాగర్, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు, ప్రజా సంఘాలు, వ్యవసాయ, కార్మిక సంఘాల నేతలు బుట్టి రాయప్ప, చంద్రా నాయక్, పిచ్చియ్య, పేరయ్య, ఆవుల శేఖర్, ఆంధ్ర మాల్యాద్రి, విజయకుమార్, యలమందరావు పాల్గొన్నారు.

వీఆర్వోలు.. ఏపీ జేఏసీ అమరావతి సభ్యులే

● గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర నేతలు ఆంజనేయకుమార్, అనుపమ

గాంధీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వీఆర్వోలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంది కేవలం రెవెన్యూ కాన్ఫెడరేషన్ మాత్రమేనని, ఇది ఏపీ జేఏసీ అమరావతి అనుబంధంగా ఉందని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోన ఆంజనేయకుమార్, జి.అనుపమ పేర్కొన్నారు. తమ గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. తమ సంఘంలోని వీఆర్వోలతో బలవంతంగా ఇతర సంఘాలు సభ్యత్వం వసూలు చేస్తున్నాయనీ, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బలవంతపు సభ్యతాల వసూలు మానుకోవాలని హెచ్చరించారు. వీఆర్వోలకు అనేక సమస్యలు పరిష్కరించిన తాము ఎప్పుడూ వారి నుంచి సభ్యత్వం వసూలు చేయలేదన్నారు. వీఆర్వోలు ఏపీ జేఏసీ అమరావతిలో సభ్యులని, జేఏసీకి మాత్రమే సభ్యత్వం చెల్లించాలన్నారు. ఇతర సంఘాలకు సభ్యత్వం చెల్లించవద్దని వీఆర్వోలకు వారు సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు శంకర్, బి.శ్రీనివాస్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంతో మునిసిపల్ వర్కర్స్ చర్చలు విఫలం

● 3 నుంచి సమ్మెకు దిగుతామని యూనియన్ ప్రకటన




సంపత్‌కుమార్‌తో చర్చిస్తున్న యూనియన్ నేతలు

విజయవాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పలు డిమాండ్ల పరిష్కారం కోరుతూ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ బుధవారం ప్రభుత్వ అధికారులతో చేపట్టిన చర్చలు విఫలమయ్యాయి. వర్కర్‌ల డిమాండ్‌లను పరిష్కరించేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయని సందర్భంలో సమ్మెకు దిగుతామని యూనియన్ ప్రకటించింది. పురపాలక శాఖ కార్యాలయంలో డైరక్టర్ సంపత్‌కుమార్‌తో ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆసుల రంగనాయకులు, పోరుమామిళ్ల సుబ్బరాయుడు, యూనియన్ నేతలు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. మరణించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి స్థానంలో అతని కుటుంబ సభ్యులకు పోస్టింగ్ ఇవ్వాలని, రెగ్యులర్ ఉద్యోగ కార్మికులకు పెండింగ్ బకాయిలు సక్రమంగా విడుదల చేయాలని, 12వ పీఆర్సీలో 30 శాతం ఐఆర్ పైన సానుకూల నిర్ణయం తీసుకోవాలని, స్కూల్ స్వీపర్‌లకు రూ.16 వేలు జీతం చెల్లించాలని, కరోనా సమయంలో తొలగించిన డైలీ వేజ్ కార్మికులను విధుల్లో కొనసాగించాలని, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, సఫాయి కర్మచారి కమిషన్ రాష్ట్రంలో అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు కేటగిరిల వారీగా వేతనాలు ఇవ్వాలని, కార్మికుల శ్రమదోపిడీని నియంత్రించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. వీటిలో కేవలం రెండు మూడు అంశాలకు మాత్రమే డైరక్టర్ సానుకూలంగా స్పందించారని, మిగిలిన సమస్యలపై ప్రతికూలంగా వ్యవహరించడంతో నవంబర్ మూడో తేదీ నుంచి సమ్మెకు దిగుతామని వెల్లడించారు. ఈ చర్చల్లో ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోటిదాసు, కోశాధికారి మాల్యాద్రి జేమ్స్, కార్యదర్శులు దొరసామి భజంత్రి, శ్రీనివాస్, దుర్గారావు పాల్గొన్నారు.

వాయు కాలుష్యాన్ని
తగ్గించేందుకు కృషి

సీఎన్‌జీ, ఎల్‌పీజీ వినియోగించాలి: పీసీబీ చైర్మన్ కృష్ణయ్య

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వాయు కాలుష్యం తగ్గించడంలో ప్రతి ఒక్కరూ తమదైన పాత్ర పోషించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య కోరారు. బుధవారం విజయవాడలోని పీసీబీ ప్రధాన కార్యాలయంలో సీఎన్‌జీ, ఎల్‌పీజీ ఇంధనాల సరఫరా సంస్థల ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ శిలాజ ఇంధనాలైన డీజిల్, పెట్రోల్, బొగ్గుకు బదులు కాంప్రెస్డ్ నేచ్యురల్ గ్యాస్(సీఎన్‌జీ), లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ) వంటి ఇంధనాలు వాడితే కాలుష్యం తగ్గించి, స్వచ్ఛమైన గాలిని భావితరాలకు అందించిన వాళ్లమవుతామన్నారు. పరిశ్రమలు, రవాణా రంగంలో సీఎన్‌జీ, ఎల్‌పీజీ వాడకాన్ని పెంచితే మంచిదన్నారు. డీజిల్, పెట్రోల్ ధరతో పోల్చితే ఇవి 30-40% చౌక అని తెలిపారు. ఎల్‌పీజీని గృహ అవసరాలకే కాకుండా హోటళ్లు, బేకరీలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో వాడాలని సూచించారు. తద్వారా హరితాంధ్రగా ఏపీ తయారవుతుందని చెప్పారు. దీనిపై విధానపరమైన నిర్ణయం కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.



యువతలో 'అల్జీమర్స్'

● ఒత్తిడి, దురలవాట్లే కారణమంటున్న వైద్యులు

ఆంధ్రజ్యోతి - విజయవాడ: మతిమరుపు మనిషికి దేవుడిచ్చిన వరమని కొన్ని సందర్భాల్లో చెప్పుకుంటాం. బాధ, దుఃఖానికి సంబంధించిన కొన్ని సంఘటనలు మరిచిపోతే ఉపశమనం కలుగుతుంది. పని ఒత్తిడి, చదువు, ఆర్థిక సమస్యలతో కలిగే ఒత్తిళ్ల కారణంగా కొన్ని విషయాలు మరిచిపోవచ్చు. ఇది పెద్ద సమస్యేమీ కాదు. కానీ అల్జీమర్స్ వ్యాధి బారినపడిన వ్యక్తి తను నిత్యం చేసుకునే సాధారణ పనులు కూడా మరిచిపోతారని వైద్యులు వెల్లడించారు. అల్జీమర్స్ మెదడుకు సంబంధించిన తీవ్రమైన వ్యాధుల్లో ఒకటి. గతంలో ఈ సమస్యను ఎక్కువగా 60 ఏళ్లు పైబడినవారిలో మాత్రమే కనిపించేది. ఇటీవల 45 ఏళ్లు దాటినవారిలోనూ కనిపిస్తుండడం ఆందోళన కలిగిసోందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

ఇటీవల జరిగిన సంఘటనలు మరిచిపోవడం, వ్యాధి ముదిరే కొద్దీ మాటల్లో తడబాటు, రోజువారీ కార్యక్రమాలు.. నిత్యం చేసే దేవుని పూజ, మందులు వేసుకోవడం, ఇంటి ఆర్థిక వ్యవహారాల వంటి పనులు మరిచిపోవడం జరుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. రోజు తిరగాడే దారులు మరిచిపోవడం, ఒక్కోసారి వారున్న స్థలాలను గుర్తించలేని స్థితిలో ఉంటారు. వ్యాధి ప్రారంభంలో గుర్తిస్తే చికిత్స ద్వారా తీవ్రతను తగ్గించవచ్చు. కొందరిలో ఆందోళన, భయభ్రాంతులకు గురవడం వంటి మానసిక మార్పులు కనిపిస్తాయి. అల్జీమర్స్ వచ్చిన తర్వాత రోగి కనీసం తొమ్మిదేళ్లలో మరణించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

అల్జీమర్స్ వ్యాధి రెండు రకాలు. ఒకటి తగ్గించడానికి అవకాశం లేనిది. వయస్సు రీత్యా వచ్చే మతిమరుపు వ్యాధిని నివారించలేమని వైద్యులు చెబుతున్నారు. ఇది 65 ఏళ్లు పైబడిన వారికి ఎక్కువగా వస్తుంది. ఇక రెండోది బీపీ, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, మద్యపానం, ధూమపానం, తలకి దెబ్బతగలడం, ఒబెసిటీ, కనీసం శరీర వ్యాయామం లేకపోవడం, గాలి కాలుష్యం, బీ12 విటమిన్ లోపం, బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడినవారు, థైరాయిడ్, స్లీప్ ఎప్నియా వంటి లక్షణాలతో అల్జీమర్స్ బారినపడే వారికి చికిత్స ద్వారా నియంత్రించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

పెరుగుతున్న అల్జీమర్స్ రోగులు
డాక్టర్ జీ బ్లెస్సీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ న్యూరాలజీ, జీజీహెచ్



కొంతకాలంగా ఆసుపత్రికి వచ్చే అల్జీమర్స్ రోగులు పెరుగుతున్నారు. ఒత్తిడి, దురాలవాట్లు, మెదడులో ఎంఐ లాయిడ్ బీటా, టావ్ అనే వ్యర్థాలు పేరుకుపోవడం వల్లే అల్జీమర్స్‌కు కారణం. అధికశాతం జన్యుపరంగా, ఒత్తిడి కారణంగా అల్జీమర్స్‌కు గురవుతున్నారు. ఇలాంటి అల్జీమర్స్‌ను నయం చేయలేం. వివిధ చెడు అలవాట్లు, వ్యాధుల కారణంగా వచ్చిన అల్జీమర్‌ను నియంత్రించవచ్చు. ఈ విషయాల్లో జాగ్రత్తలు పాటిస్తే ప్రపంచంలో సగం కేసులు నియంత్రించవచ్చు. ప్రతి ఏడాది అల్జీమర్స్ రోగులు పెరుగుతున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 8 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లుగా 35 మంది చికిత్స పొందుతున్నారు.

రైల్వే డివిజన్‌లో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్

రైల్వేస్టేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో బుధవారం "అవినీతికి నో చెప్పండి, దేశానికి కట్టుబడి ఉండండి" థీమ్‌తో వరుస కార్యకలాపాలను నిర్వహించారు. పారదర్శకత, జవాబుదారీతనం నైతిక పాలన పట్ల రైల్వే తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. విజయవాడలోని డీఆర్ఎం కార్యాలయంలో సమగ్రతా ప్రతిజ్ఞతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అధికారులు, సిబ్బంది అన్ని రంగాల్లో నిజాయితీ, న్యాయంగా ఉంటూ మంచి కార్పొరేట్ పాలనను నిలబెట్టడానికి సమష్టిగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జాక్ అండ్ జిల్ స్కూల్ మీదుగా ప్లాట్‌ఫామ్ నంబర్-1లోని గాంధీ వెయిటింగ్ హాల్ వరకు విజిలెన్స్ అవేర్‌నెస్ వాకథాన్‌ను నిర్వహించారు. గాంధీ వెయిటింగ్ హాల్‌లో, భారత్ స్కౌట్స్, గైడ్స్ 'విజిలెన్స్ ఆర్గనైజేషన్' అంశంపై ఒక ఆకర్షణీయమైన వీధి నాటకాన్ని ప్రదర్శించారు. డీఆర్ఎం మోహిత్ సోనాకియా మాట్లాడుతూ సమగ్రత కేవలం ఒక సూత్రం కాదు - ఇది ప్రజల విశ్వాసానికి పునాది అని, విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ వంటి కార్యక్రమాల ద్వారా, మన సంస్థ, దేశ పురోగతికి పారదర్శకత, నైతిక ప్రవర్తన అవసరమని గుర్తుచేసుకుంటున్నామన్నారు. ఏడీఆర్ఎంలు పీఈ ఎడ్విన్, శ్రీనివాసరావు కొండా, బ్రాంచ్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.



ఉద్యోగులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఎం మోహిత్ సోనాకియా

డివిజన్‌లో 263 ప్రత్యేక రైళ్లు

దసరా, దీపావళి, ఛట్ పూజ పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, అదనపు ప్రయాణీకుల రద్దీని నిర్వహించడానికి, రైలు వినియోగదారులకు సజావుగా, సురక్షితంగా సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడానికి దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా 12,011కి పైగా ప్రత్యేక రైళ్లను నడపాలని ప్రణాళిక వేసింది. వాటిలో 973 రైళ్లు దక్షిణ మధ్య రైల్వేకు చెందినవి కాగా, 263 రైళ్లు విజయవాడ డివిజన్‌కు చెందినవి. సెప్టెంబర్ 21న ప్రారంభమైన ప్రత్యేక రైళ్ల పరంపర - నవంబర్ 30, మధ్య, మొత్తం 1,010 ప్రత్యేక రైళ్లు డివిజన్ ద్వారా నడుస్తాయి. ఇది గత ఏడాదితో పోలిస్తే 5.8% పెరుగుదల. ఈనెల 20 వరకు, దక్షిణ మధ్య రైల్వే 1,010 ప్రత్యేక రైలు సర్వీసులను నిర్వహించింది. వాటిలో విజయవాడ డివిజన్ నడిపిన 104 రైళ్లున్నాయి. డివిజన్ అంతటా ప్రయాణీకుల రద్దీ 1.35 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో 1.21 కోట్ల మంది ప్రయాణికులు ప్రయాణించారు. అదనపు డిమాండ్‌ను తీర్చడానికి, సాధారణ రైళ్లకు 68 అదనపు కోచ్‌లను జత చేశారు. ప్రయాణికుల భద్రత సౌకర్యాన్ని నిర్ధారించడానికి, డివిజన్ విజయవాడ, రాజమండ్రి, నెల్లూరు, గూడూరు వంటి ప్రధాన స్టేషన్లలో సమగ్ర ఏర్పాట్లను అమలు చేసింది. యూటీఎస్ మొబైల్ యాప్, రైల్ వన్ యాప్ ద్వారా డిజిటల్ టికెటింగ్ ప్రమోషన్‌ను చురుకుగా ప్రోత్సహిస్తున్నారు. డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా మాట్లాడుతూ పండుగ సీజన్‌లో ప్రయాణికుల రాకపోకలు పెరుగుతున్నాయని, తమ బృందాలు సజావుగా సురక్షితమైన ప్రయాణ అనుభవాన్ని నిర్ధారించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాయన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి: ఎంపీ



కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్ఐఆర్‌డి) భాగస్వామ్యంతో, జిల్లా యంత్రాంగం సహకారంతో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని విజయవాడ ఎంపీ, కేశినేని ఫౌండేషన్ చైర్మన్ కేశినేని శివనాథ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్ఐఆర్‌డీ, కేశినేని ఫౌండేషన్ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) అమలుపై కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ చిన్ని పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనకు ఉపాధి కల్పన అత్యంత కీలకమన్నారు. ఎన్ఐఆర్‌డీతో కలిసి స్వయం సహాయక సంఘాలకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉన్న ఏ కొండూరు, జక్కంపూడిలో కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం సహకరించాలని కోరారు. ఎన్ఐఆర్‌డీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జీ నరేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా రూరల్ ప్రాస్పరిటీ, రూరల్ రెస్లియన్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. వన్ ఫ్యామిలీ - వన్ ఎంట్రప్రెన్యూర్ అనే ఆలోచనను సాకారం చేయడానికి కేశినేని ఫౌండేషన్‌తో కలిసి ఎస్‌హెచ్‌జీలకు శిక్షణ ఇస్తామన్నారు. పెద్ద కంపెనీల నుంచి ఎస్‌హెచ్‌జీలకు ఆర్డర్లు ఇప్పించి ఆర్థికంగా ఎదిగేందుకు కృషిచేస్తామన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఏ కొండూరు, జక్కంపూడిలో కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఏ కొండూరు అభివృద్ధికి డీపీఆర్ రూపొందిస్తామన్నారు. ఆకాంక్షిత బ్లాకులకు ఉన్న 40 సూచీల్లో 25 సూచీల్లో సంతృప్త స్థాయికి చేరుకొన్నామన్నారు. ఏ కొండూరు కూడా ఆకాంక్షిత బ్లాకుల తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్ఐఆర్డీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మహ్మద్ ఖాన్, డీఆర్‌వో లక్ష్మీ నరసింహం, డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని పాల్గొన్నారు.



జపాన్ రాజకీయాల్లో ఒక కొత్త యుగం ప్రారంభమయింది. జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనే తకైచి ఎంపికయ్యారు. 'ఐరన్ లేడీ' అని జపాన్ మీడియా ముద్దుగా పిలుచుకొనే తకైచికి ఆధునిక సంగీతమంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు ఒక మ్యూజిక్ బ్యాండ్‌లో భాగస్వామి కూడా..

జపాన్‌లో ఐరన్ లేడీ

"ఎలిమెంటరీ స్కూల్లో ఉన్నప్పుడు 'బ్లాక్ సాబాత్' మ్యూజిక్ బ్యాండ్ పాటలు వింటూ ఉండేదాన్ని. హైస్కూల్‌కు వచ్చిన తర్వాత బమ్, స్మోక్ ఆన్ ది వాటర్ లాంటి పాటలు వినటం మొదలుపెట్టా. ఈ సమయంలోనే బాస్ గిటార్, కీబోర్డ్, డ్రమ్స్ వాయించటం నేర్చుకున్నా. ఒక బ్యాండ్‌లో భాగస్వామి నయ్యా! 'రోలింగ్ స్టోన్స్' ఆల్బమ్‌లోని 'జంపింగ్ జాక్ ఫ్లాష్' లాంటి పాటలు పాడే దాన్ని. ఆ తర్వాత హైస్కూల్లో ఉన్న ఆడపిల్లలందరం కలిసి ఒక బ్యాండ్ పెట్టాం..." అంటారు తకైచి. ఇప్పటికీ ఆమె డ్రమ్స్ వాయిస్తూనే ఉంటారు. తనకు సంతోషం వచ్చినా.. దుఃఖం వచ్చినా డ్రమ్స్ వాయిస్తానంటారు. "కొన్ని సార్లు నాకు, నా భర్తకు మధ్య దెబ్బలాటలు అవుతూ ఉంటాయి. ఆయన మాట్లాడే మాటలు కానీ, ఆయన ప్రవర్తన కానీ నాకు నచ్చదు. అలాంటి సమయంలో ఆయన పడుకున్న తర్వాత ఎలక్ట్రానిక్ డ్రమ్స్ వాయిస్తా. దీని వల్ల నాలో ఉన్న కోపం అంతా పోతుంది" అంటారు తకైచి.

చిన్నతనంలో...

తకైచి పుట్టింది.. పెరిగింది జపాన్‌లోని నారా అనే ప్రాంతంలో. హైస్కూల్ పూర్తయిన తర్వాత ఆమె కోబే విశ్వవిద్యాలయంలో చేరి పట్టభద్రురాలయ్యారు. చిన్నప్పటి నుంచి రాజకీయాలంటే ప్రత్యేక ఆసక్తి ఉండటంతో 1990లలో లిబరల్ డెమోక్రటిక్ పార్టీలో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. షిన్‌జో అబీ, ఫ్యూమో కిషిదాలు ప్రధానులుగా ఉన్న సమయంలో తకైచికి ప్రభుత్వంలో మంచి ప్రాధాన్యత లభించింది. వారి కేబినెట్‌లలో ఆమె మంత్రిగా పనిచేశారు. ఒకప్పటి బ్రిటిష్ ప్రధాని మార్గరెట్ థాచర్‌ను తన రోల్ మోడల్‌గా భావించే తకైచిని జపాన్ మీడియా - 'ఐరన్ లేడీ' అని ముద్దుగా పిలుచుకుంటుంది. ప్రస్తుతం జపాన్ సమాజంలో వృద్ధుల సంఖ్య ఎక్కువగా ఉంది. యువతీ, యువకుల సంఖ్య తక్కువగా ఉంది. అంతే కాకుండా పాశ్చాత్య సంస్కృతి జపాన్‌లోకి చాపకింద నీరులా ప్రవేశించిందనే విమర్శలు వినిపిస్తూ ఉంటాయి. వీటన్నింటిపైనా తకైచి దృష్టి పెట్టాల్సి ఉంది. అందుకే తకైచి తన ప్రసంగాల్లో దీన్నే ప్రధానమైన విషయంగా ప్రస్తావించారు. "నేను నా హామీలను నిలబెట్టుకుంటాను. ప్రతి తరాన్ని కలుపుకొని ముందుకు వెళ్లినప్పుడే అభివృద్ధి సాధించగలుగుతాం. మనం కొద్ది మందే ఉన్నాం. అందువల్ల అందరం గుర్రాల్లా పనిచేద్దాం. నేను కూడా వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ అనే సూత్రాన్ని పక్కన పెట్టి పనిచేస్తాను. నేను పనిచేస్తూనే ఉంటాను..." అని ఆమె చేసిన వ్యాఖ్యలకు జపాన్‌లో సంచలనం చెలరేగింది. తన ముందు ఉన్నది పూలబాట కాదనే విషయం తకైచికి తెలుసు. ఈ విషయాన్ని కూడా ఆమె తన ప్రసంగంలో ప్రస్తావించారు. "నేను ఇప్పుడు ఆనందంగా లేను. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో నాకు అర్థమవుతోంది. మనందరం కలిసి చాలా పనులు చేయాల్సి ఉంది. మనం అందరం కలిసి ఎల్‌డీఎఫ్‌ను నిలబెడదాం. ప్రజల ఆందోళలను ఆశలుగా మార్చే పార్టీగా తీర్చిదిద్దుదాం" అని ఆమె పేర్కొన్నారు.

"పంటల సాగులో పురుగుల మందులను, రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తే ప్రాణాలకే ముప్పు. ఇది నేను అనుభవంతో చెబుతున్న మాట" అంటున్నారు **యర్రు స్వాతి**. గుంటూరు జిల్లాకు చెందిన ఆమె బ్రెయిన్ ట్యూమర్ బారిన పడ్డారు. కలుషితమైన పదార్థాలే దీనికి కారణమని గుర్తించి, సేంద్రియ సేద్యాన్ని చేపట్టారు. నాణ్యమైన ఉత్పత్తులతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడమే కాదు... ఇటీవల ప్రధాని మోదీ ప్రశంసలనూ అందుకున్న స్వాతి స్ఫూర్తిమంతమైన ప్రయాణం ఇది.



సేంద్రియమే ఆరోగ్యరక్ష

"ఇంట్లో వండేవి, తినేవీ అన్నీ సహజసిద్ధమైనవే అయి ఉండాలి... ఇది పదేళ్ల క్రితం నేను తీసుకున్న నిర్ణయం. నాకు బ్రెయిన్ ట్యూమర్ ఉందని వైద్యులు నిర్ధారించిన తరువాత... దానికి కారణం ఏమిటో తెలుసుకొనే ప్రయత్నం చేశాను. దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు ఎన్నో తెలిశాయి. మనకు వచ్చే అనారోగ్యాలలో చాలావాటికి మనం తీసుకునే ఆహారమే కారణం. వ్యవసాయంలో పురుగు మందులను మితిమీరి వాడడం, విచ్చలవిడిగా రసాయనిక ఎరువుల వినియోగంతో దాదాపు ప్రతీ పదార్థమూ కలుషితమవుతోంది. ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తోంది. నాకు వచ్చిన బెయిన్ ట్యూమర్‌కు కూడా ఇదే కారణమని గుర్తించాను. ప్రకృతి సాగుతో భూసార పరిరక్షణ జరుగుతుంది. అది భవిష్యత్ తరాలు అనారోగ్యాల బారిన పడకుండా కాపాడుతుంది. అందుకే సేంద్రియ పద్ధతితో వ్యవసాయం చేపట్టి, సహజసిద్ధమైన పంటలు పండించాలని నిర్ణయించుకున్నాను. నా భర్త యర్రు సత్యనారాయణ నా ఆలోచనను ప్రోత్సహించారు.

ఖర్చు తక్కువ... నాణ్యత ఎక్కువ

వ్యవసాయం చేయడం సవాళ్లతో కూడుకున్న పని. ఎన్నో వ్యయ ప్రయాసను భరించి సాగు



చేసినా... ప్రకృతి కరుణిస్తే తప్ప రైతు గట్టెక్కే పరిస్థితి లేదు. పంటలను మార్కెట్ యార్డుకు తరలించినా గిట్టుబాటు ధరకు హామీ లేదు. కనీసం పెట్టుబడి అయినా దక్కితే చాలనే దుస్థితి ఉంది. దీంతో పెద్ద పెద్ద రైతులే సాగు చేయలేక చేతులు ఎత్తేస్తున్నారు. ఈ నేపథ్యంలో... అరకొర చదువు, అంతంత మాత్రం ఆర్థిక స్తోమత ఉన్న నా నాలాంటి ఒక మహిళకు ఇది సాహసం అనే చెప్పాలి. అయినా ధైర్యం చేశాను. మాది గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తోట గ్రామం. మాకున్న రెండు ఎకరాల మాగాణితో పాటు... కౌలుకు తీసుకున్న పది ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేపట్టాను. జిల్లా రైతు సాధికార సంస్థ సహకారాన్ని తీసుకున్నాను. నవారా, బ్లాక్‌రైస్, మైసూర్ మల్లిక, కాలాబట్టి తదితర దేశీయ వంగడాలను సాగు చేయడం ప్రారంభించాను. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులకు బదులు జీవామృతం, కషాయాలు వినియోగించాను. వాటిని నేనే స్వయంగా తయారు చేస్తాను. ఇలా తక్కువ ఖర్చుతోనే నాణ్యమైన పంటలు పండిస్తున్నాను. నా సాగు పద్ధతులు జాతీయ స్థాయిలో వ్యవసాయ నిపుణులు, రైతుల దృష్టిని ఆకర్షించాయి. మా ప్రాంతంలో పర్యటించిన బ్రెజిల్ బృందం... నన్ను ప్రత్యేకంగా అభినందించింది.



మరపురాని జ్ఞాపకం

మా జిల్లాలో సేంద్రియ సాగు చేపట్టిన మొదటి మహిళా రైతును నేనే. మా కుటుంబం మొత్తం ఇప్పుడు సేంద్రియ వ్యవసాయంలో ఉంది. మాకు కావలసిన కాయగూరలు, ఆకుకూరలు మా పొలం గట్ల మీద, ఇంటి పెరట్లో పండిస్తున్నాం. ప్రకృతి సేద్యం ద్వారా... ఆరోగ్యకరమైన ఆహారంతో బ్రెయిన్ ట్యూమర్‌ను నేను జయించాను. నా కృషికి గుర్తింపుగా... ఇటీవల ఢిల్లీలో... 'ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సంస్థ' ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా 'పీజీఎస్ నేచురల్ ఫామ్ సర్టిఫికెట్'ను అందుకున్నాను. ప్రధానితో ముఖాముఖిగా మాట్లాడడం, ప్రశంసలు పొందడం నా జీవితంలో మరపురాని జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

కౌన్సెలింగ్

దగ్గు మందుతో ముప్పు ఉంటుందా?

Q A

డాక్టర్! మా నాలుగేళ్ల బాబుకు దగ్గు మొదలైన ప్రతిసారీ... మందుల షాపులో దొరికే దగ్గు మందు కొని, వాడుతూ ఉంటాం! పదే పదే దగ్గు మందు తాగించటం వల్ల పిల్లల ఆరోగ్యం దెబ్బ తింటుందా? అసలు దగ్గుకు ఎలాంటి చికిత్స ఇప్పించాలి?



పిల్లల దగ్గుకు కారణాన్ని కనిపెట్టి చికిత్స చేసినప్పుడే దగ్గు తగ్గుతుంది. పిల్లల్లో దగ్గుకు ఎన్నో కారణాలుంటాయి. ఆస్తమా, అలర్జీ, సాధారణ దగ్గు... ఇలా ఏ కారణం వల్లైనా దగ్గు మొదలవ్వొచ్చు. అయితే ఎలాంటి దగ్గు కనిపించినా... వెంటనే దగ్గు మందులు కొనేసి వాడుకోవడం సరి కాదు. దగ్గు కారణం, రకాన్ని తెలుసుకుని, దాని మూల కారణానికి చికిత్స చేయాలి. దగ్గుతో పాటు, ముక్కు నుంచి నీరు కారుతూ, పిల్లి కూతలు వినిపిస్తుంటే దాన్ని అలర్జీగా భావించి యాంటీ హిస్టమిన్లు, యాంటీ అలర్జిక్ మందులు వాడాల్సి ఉంటుంది. వాటితోపాటు అలర్జీ కారకాలను గుర్తించి వాటికి దూరంగా ఉంచాలి. దగ్గుతోపాటు ఆయాసం ఉంటే, ఆస్తమాగా భావించి అందుకు తగిన ఇన్‌హేలర్లు వాడాల్సి ఉంటుంది. సాధారణ దగ్గు, జలుబు అయితే 3 నుంచి 5 రోజుల్లో తగ్గుతుంది. ఆ సమయంలో హైడ్రేషన్, ఆవిరి పట్టడం సరిపోతాయి. ఆస్తమా దగ్గును నెబ్యులైజేషన్‌తో తగ్గించవచ్చు. ఒక్కో రకం దగ్గుకు ఒక్కో రకం చికిత్స ఇవ్వాల్సి ఉంటుంది. అయితే మెడికల్ షాపుల్లో దొరికే దగ్గు మందుల్లో కాంబినేషన్ డ్రగ్స్ ఉంటాయి. కొన్నిట్లో అలర్జీ నివారిణులైన యాంటీ హిస్టమిన్లు ఉంటాయి. మరికొన్నిట్లో కోడీన్, హైడ్రాక్సీ కోడీన్ మందులుంటాయి. వీటి వాడకాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిషేధించింది. సిరప్స్‌లో ఉన్న ఔషధాల గురించి అవగాహన లేకుండా వాటిని కొని వాడేస్తూ ఉంటాం. కానీ అలా ఇష్టారాజ్యంగా వాడటం వల్ల పిల్లల్లో ఇన్‌ఫెక్షన్ల రెసిస్టెన్స్‌ను పెంచినవాళ్లమవుతాం! ఇది ప్రమాదకరం. కాబట్టి దగ్గును అణచివేసే సిరప్స్ వాడేయకుండా, వైద్యులను సంప్రతించి, దగ్గు మూల కారణానికి తగిన చికిత్స ఇప్పించాలి.

డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల
పీడియాట్రీషియన్ అండ్ నియో నాటాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్,
హైదరాబాద్.

మూడేళ్లలోపు పిల్లలు రాత్రిపూట పక్క తడపడం సహజం. కానీ వయసు పెరుగుతున్నా కూడా ఇదే పరిస్థితి కొనసాగితే మాత్రం తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. వాటి గురించి తెలుసుకుందాం...

పిల్లలు పక్క తడుపుతున్నారా...



- నిద్రపోవడానికి రెండు గంటల ముందే పిల్లలకు భోజనం పెట్టాలి. పడుకునే ముందు పిల్లలతో మంచినీళ్లు తాగించవద్దు.
- రాత్రిపూట నిద్రకు ఉపక్రమించే ముందు పిల్లలతో మూత్ర విసర్జన చేయించాలి. మధ్య రాత్రి వేళ ఒకసారి పిల్లలను నిద్ర లేపి బాత్‌రూమ్‌కు తీసుకెళ్లాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే క్రమంగా సమస్య తీరుతుంది.
- పిల్లలకు ఓట్స్, కార్న్‌ఫ్లేక్స్, గోధుమలతో తయారుచేసిన పదార్థాలు; వాల్‌నట్స్, కిస్‌మిస్‌లు, అరటిపండ్లు తినిపిస్తూ ఉంటే మంచి ప్రయోజనం కనిపిస్తుంది. బెల్లం, దాల్చిన చెక్కలను ఆహారంలో చేర్చడం మంచిది. పిల్లలతో రోజూ అరగ్లాసు క్రాన్‌బెర్రీ జ్యూస్ లేదంటే ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో అరచెంచా సోంపు గింజలు కలిపి తాగించినా ఫలితం ఉంటుంది.
- పీడకలలు వచ్చినా కూడా భయంతో పిల్లలు పక్క తడిపేస్తూ ఉంటారు. కాబట్టి పడుకునేముందు పిల్లలను కోప్పడకూడదు. రాత్రిపూట పనిష్మెంట్‌లు ఇవ్వకూడదు. భయంకరమైన కథలు చెప్పకూడదు. హారర్ సినిమాలు చూడనివ్వకూడదు.
- మూత్రం వస్తుందనిపించగానే లేపమని పిల్లలకు రోజూ పడుకునేముందు చెబుతూ ఉండాలి. మంచి నిద్రలో ఉన్నప్పుడు పిల్లలు లేపితే వాళ్ల మీద చిరాకు పడకుండా ఓపికగా బాత్‌రూమ్‌కు తీసుకెళ్లాలి.

సవాళ్లకు ఎదురు నిలిచి...

"ఎప్పటికప్పుడు కొత్త సవాళ్లను స్వాగతించడం, కొత్తదారుల్లో పయనించడం... వీటి వల్ల జీవితం ఉత్సాహభరితంగా సాగుతుంది" అని చెబుతారు **సోనాలీ ఘోష్**. పాతికేళ్ల క్రితం... మహిళలు చాలా అరుదుగా కనిపించే ఫారెస్ట్ సర్వీస్‌లో అడుగుపెట్టిన ఆమె... కజిరంగా నేషనల్ పార్క్‌కు తొలి మహిళా ఫీల్డ్ డైరెక్టర్‌గా చరిత్రకెక్కారు. అంతేకాదు... ఇటీవల మన దేశం తరపున ప్రతిష్ఠాత్మకమైన 'కెంటన్ మిల్లర్' పురస్కారాన్ని అందుకున్న తొలి వ్యక్తిగా ఘనత సాధించారు. ప్రకృతి అన్నా, సాహసాలన్నా తనకు ఎంతో ఇష్టమంటున్న సోనాలీ ప్రయాణం ఇది.





"మాది మధ్యతరగతి బెంగాలీ కుటుంబం. నేను పుణేలో పుట్టాను. మా నాన్న ఉద్యోగం కారణంగా ఎక్కువ కాలం అటవీ ప్రాంతాల్లోనే నా బాల్యం గడిచింది. చెట్లు, నదులు, అడవులు, జంతువులు నా జీవితంలో భాగమైపోయాయి. కొత్త భాషలు, సంస్కృతులతో పరిచయం కలిగింది. ప్రశాంతమైన ప్రకృతి మధ్య గడపడం ఎంతో సంతోషంగా అనిపించేది. నా ఉద్యోగం కూడా దానికి సంబంధించినదే కావాలని కోరుకున్నాను. అటవీ, వన్యప్రాణుల శాస్త్రంలో పీజీ, 'ఎన్విరాన్‌మెంటల్ లా'లో పీజీ డిప్లమా చేశాను.ఆ తరువాత డెహ్రాడూన్‌లోని 'వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా' (డబ్ల్యూఐఐ)లో వైల్డ్ లైఫ్ మేనేజిమెంట్ కోర్స్ చేశాను. 'మానస్ నేషనల్ పార్కు'లో పులుల సంరక్షణ - రిమోట్ సెన్సింగ్ సాంకేతికత వినియోగంపై నేను చేసిన పరిశోధనలకు డాక్టరేట్ లభించింది. 2000 సంవత్సరంలో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో చేరాను. అసోంలోని కజిరంగా నేషనల్ పార్క్‌లో సహాయ కన్జర్వేటర్‌గా వృత్తి జీవితంలో అడుగుపెట్టాను.

వారిలో ఉత్సాహం నింపుతూ...

వృత్తి జీవితంలో తొలిరోజుల్లోనే ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చింది. వర్షాకాలంలో ముంచెత్తే వరదలు, వనరుల కొరత, వన్యప్రాణుల అక్రమ రవాణా, మానవుల స్వార్థం కారణంగా దెబ్బతింటున్న పర్యావరణ సమతుల్యం... కొందరు సిబ్బంది అలసత్వం వీటికి తోడవడంతో పరిస్థితులన్నీ అస్తవ్యస్తంగా ఉండేవి. దాదాపు 430 కిలోమీటర్ల మేర వ్యాపించిన కజిరంగా నేషనల్ పార్క్... ప్రపంచంలోనే ఎక్కువ సంఖ్యలో ఒంటికొమ్ము ఖడ్గమృగాలకు ఆశ్రయం ఇస్తున్న ప్రాంతం. అక్రమ రవాణాదారుల వల్ల వన్యప్రాణులతో పాటు పార్క్‌కు నలుదిక్కుల్లో కాపలాగా ఉండే సిబ్బంది ప్రాణాలు కూడా ప్రమాదంలో ఉన్నాయి. సిబ్బందిలో ఆత్మవిశ్వాసం నింపడం కోసం మారుమూల గస్తీ శిబిరాలను తరచుగా సందర్శించేదాన్ని. ఇది వారిలో ఉత్సాహాన్ని నింపింది. ఆ తరువాత ఢిల్లీ జూలాజికల్ పార్క్ డైరెక్టర్‌గా, సెంట్రల్ జూ అథారిటీ డీఐజీగా, 'స్వచ్ఛభారత్ మిషన్'కు డైరెక్టర్‌గా, గువాహటి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్‌గా... ఇలా పలు హోదాల్లో పని చేశాను. రెండేళ్ల క్రితం కజిరంగా నేషనల్ పార్క్‌కు ఫీల్డ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాను. సుమారు 120 ఏళ్ల చరిత్ర ఉన్న ఆ పార్క్‌కు ఫీల్డ్ డైరెక్టర్ అయిన తొలి మహిళను నేనే.

> "ఈ వృత్తిని నేను ఎంచుకున్నప్పుడు ఎంతోమంది నిరుత్సాహపరిచేలా మాట్లాడారు. మహిళను కావడం వల్ల దీనిలో రాణించడం కష్టమన్నారు. అది కొంతవరకూ నిజమే. ఇంటి పనులను, ఉద్యోగ బాధ్యతలను సమన్వయం చేసుకోవడం ఇబ్బందే. గృహిణిగా, తల్లిగా నేను ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాను. అయితే కుటుంబం సహకారంతో వాటిని అధిగమించగలిగాను. అంతేకాదు... అటవీ ప్రాంతాల్లో మహిళలకు సరైన సౌకర్యాలు ఉండవు. ఇప్పుడిప్పుడే కొన్ని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గతంతో పోలిస్తే ఐఎఫ్ఎస్ చేస్తున్న మహిళల సంఖ్య బాగా పెరుగుతోంది. ఇది శుభపరిణామం."

అది గర్వకారణం...

కజిరంగా నేషనల్ పార్క్.. బ్రహ్మపుత్ర నదీతీరాన, వరదలు ముంచెత్తే ప్రాంతంలో ఉంది. అది ఒంటి కొమ్ము ఖడ్గమృగాలతో పాటు ఏనుగులు, పులులు, లేళ్ళ, అయిదు వందలకు పైగా పక్షి జాతులకు నిలయం. వృక్ష వైవిధ్యమూ ఎక్కువ. సందర్శకులు కూడా పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తూ ఉంటారు. ఫీల్డ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత... పార్కులో పరిరక్షణతో పాటు సందర్శకులను ఆకర్షించడం మీద ఎక్కువగా దృష్టి పెట్టాను. ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి. దాదాపు పాతికేళ్ల నుంచి నేను అందిస్తున్న సేవలకు గుర్తింపుగా... ఈ ఏడాది 'కెంటన్ మిల్లర్' పురస్కారం నాకు లభించింది. ప్రపంచ ప్రసిద్ధ పర్యావరణవేత్త డాక్టర్ కెంటన్ ఆర్.మిల్లర్ పేరిట 'ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్' (ఐయుసిఎన్) ఆ అవార్డును అందజేస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో... పర్యావరణ రంగంలో అత్యున్నత పురస్కారాల్లో ఒకటిగా దీన్ని పరిగణిస్తారు. అబుదాబీలో ఈనెల పదోతేదీన జరిగిన కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన ప్రముఖులతో పాటు నేను కూడా ఆ పురస్కారాన్ని అందుకున్నాను. దీన్ని మన దేశం నుంచి అందుకున్న తొలి వ్యక్తిని నేను కావడం గర్వంగా ఉంది. మరింత నిబద్ధతతో నా వృత్తి జీవితాన్ని కొనసాగించడానికి నాకు మరింత స్ఫూర్తిగా నిలుస్తుంది."





ఇలా దువ్వుకోవాలి...

ఎక్కువగా దువ్వితే శిరోజాలు రాలిపోతాయని చాలామంది భావిస్తుంటారు. కానీ సరైన విధానంలో దువ్వడం వల్ల శిరోజాలు రాలడం తగ్గి, ఒత్తుగా పెరుగుతాయని నిపుణులు సూచిస్తున్నారు. శిరోజాలను ఎలా దువ్వుకోవాలో తెలుసుకుందాం...



- తల దువ్వుకోవడానికి వెడల్పాటి పళ్లు ఉన్న చెక్క దువ్వెనను ఎంపిక చేసుకోవాలి. దీనితో కుదుళ్ల నుంచి చివర్ల వరకూ శిరోజాలను మెల్లగా దువ్వాలి. ఇలా దువ్వేటప్పుడు కనీసం వంద వరకు వెంట్రుకలు రాలడం సహజం. నిదానంగా ఎక్కువసార్లు దువ్వడం వల్ల తలలో రక్త ప్రసరణ మెరుగై కుదుళ్లు గట్టిపడతాయి. జుట్టు రాలడం తగ్గి ఒత్తుగా పెరుగుతుంది.
- శిరోజాలను దువ్వుతున్నప్పుడు కుదుళ్ల వద్ద సహజసిద్ధమైన నూనె విడుదలవుతుంది. ఇది తల మీద చర్మం, కుదుళ్ల తేమ కోల్పోకుండా కాపాడుతుంది.
- గాలికి జుట్టు చెదిరి చిక్కులు పడుతూ ఉంటుంది. అలాంటప్పుడు జుట్టును పాయలుగా విడగొట్టి మెల్లగా దువ్వుతూ చిక్కులు తొలగించాలి. దీని వల్ల జుట్టుపై చేరే దుమ్ము, ధూళి కూడా తొలగిపోతాయి. చిక్కులు మరీ ఎక్కువగా ఉంటే వేళ్లతో జుట్టును సరి చేస్తూ దువ్వాలి. చెక్కతో చేసిన ప్యాడిల్ బ్రష్‌ను ఉపయోగిస్తే కుదుళ్లు బలహీనమవకుండా ఉంటాయి.
- ముందుగా శిరోజాల చివర్లను దువ్వాలి. తరువాత మధ్య నుంచి కింది వరకూ దువ్వాలి. ఆపైన కుదుళ్ల నుంచి చివరి వరకూ దువ్వితే చిక్కులు త్వరగా తొలగిపోతాయి.
- తడి జుట్టును గట్టిగా దువ్వకూడదు. అలాగని జుట్టు పూర్తిగా ఆరిన తరువాత చిక్కులు తీయడం కష్టంగా ఉంటుంది. అలాంటప్పుడు తలస్నానం చేసిన వెంటనే శిరోజాలకు కొద్దిగా కండిషనర్ రాయాలి. పెద్ద పళ్లున్న దువ్వెనతో కుదుళ్ల నుంచి మెల్లగా దువ్వాలి. మధ్యలో చిక్కులు వుంటే వాటిని చేత్తో తీయాలి.
- దువ్వెనలో ఎక్కువగా మురికి చేరుతూ ఉంటుంది. కాబట్టి వారానికి ఒక సారైనా శుభ్రం చేసుకుంటూ ఉండాలి. అప్పుడే శిరోజాలు ఆరోగ్యంగా ఒత్తుగా పెరుగుతాయి.


హర్మన్‌ప్రీత్

కఠిన సవాల్

న్యూజిలాండ్‌తో భారత పోరు నేడు

మ.3 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..

మహిళల వన్డే ప్రపంచ కప్

నవీ ముంబై: ప్రపంచ కప్‌లో ఇప్పటికే హ్యాట్రిక్ పరాజయాలతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న భారత మహిళల జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. గురువారం జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో హర్మన్‌ప్రీత్ సేన అమీతుమీ తేల్చుకోనుంది. .ఈ మ్యాచ్ గెలిస్తే మన మహిళలకు సెమీఫైనల్ అవకాశాలు సులువు అవుతాయి. ఒక వేళ ఓడితే సమీకరణాలపై ఆధారపడాల్సివుంటుంది. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ టాప్-3లో నిలిచి ఇప్పటికే సెమీస్ బెర్త్‌లను ఖరారు చేసుకోగా.. మిగిలిన ఏకైక స్థానం కోసం భారత్, న్యూజిలాండ్ పోటీపడుతున్నాయి. ఇప్పుడు ఇరుజట్లకు చెరి రెండు మ్యాచ్‌లు మిగిలున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒకదాంట్లో ఇద్దరూ ముఖాముఖికి సిద్ధమవడంతో తాజా పోరుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే, భారత్ తన తర్వాతి, ఆఖరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించినా సెమీస్ చేరుతుంది. మరోవైపు సోఫీ డివైన్ సారథ్యంలోని కివీస్ జట్టు తమ చివరి పోరులో ఇంగ్లండ్‌ను ఓడించాల్సి ఉంటుంది. సోఫీతో పాటు సుజీ బేట్స్‌లాంటి స్టార్ బ్యాటర్లున్న ఆ జట్టు ఇప్పుడు భారత్ పోరుతో తమ అవకాశాలను మెరుగుపరుచుకోవాలనుకుంటోంది.


సోఫీ డివైన్

సమష్టిగా సత్తా చాటితేనే..

గత మూడు మ్యాచుల్లోనూ హర్మన్ సేన గెలుపు ముంగిట బోల్తా పడడం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఆఖర్లో తీవ్ర ఒత్తిడిని తట్టుకోలేక చేజేతులా ఓటమిపాలైంది. అయితే స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ ఫామ్‌లోకి రావడం శుభపరిణామం. రిచా ఘోష్, దీప్తి శర్మ, అమన్‌జోత్ మెరుగ్గానే రాణిస్తున్నారు. కానీ.. ప్రతీకా రావల్, హర్లీన్ రాణించాలి. బౌలర్లలో క్రాంతి గౌడ, శ్రీచరణి, దీప్తి, స్నేహ్ రాణా ఫర్వాలేదనిపిస్తున్నారు. అయితే, గత మ్యాచ్‌లో అదనపు బౌలర్ కోసమని బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్‌పై వేటు వేసి రేణుకా సింగ్‌ను జట్టులోకి తీసుకున్నారు. కానీ, రేణుక అంతగా ప్రభావం చూపలేక పోయింది. మరి, కివీస్‌తో పోరుకు ఇదే కాంబినేషన్‌ను కొనసాగిస్తారా? లేదంటే ఎక్స్‌ట్రా బ్యాటర్‌గా జెమీమాకు అవకాశమిస్తారో.. చూడాలి.

పిచ్, వాతావరణం

నవీ ముంబై పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశాలు ఎక్కువ. కాగా మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది.

జట్లు (అంచనా)

భారత్: స్మృతి మంధాన, ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), అమన్‌జోత్, స్నేహ్ రాణా, దీప్తి శర్మ, రేణుకా సింగ్/జెమీమా రోడ్రిగ్స్ క్రాంతి గౌడ, శ్రీచరణి.

న్యూజిలాండ్: సుజీ బేట్స్, జార్జియా ప్లిమ్మర్, అమేలియా కెర్, సోఫీ డివైన్ (కెప్టెన్), బ్రూక్ హాలిడే, మ్యాడీ గ్రీన్, ఇసబెల్లా గేజ్ (వికెట్ కీపర్), జెస్ కెర్, రోజ్‌మేరీ మెయిర్, ఈడెన్ కార్సన్, లియా తహుహు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
ఆస్ట్రేలియా	6	5	0	1	11	1.704
దక్షిణాఫ్రికా	6	5	1	0	10	0.276
ఇంగ్లండ్	6	4	1	1	9	1.024
భారత్	5	2	3	0	4	0.526
న్యూజిలాండ్	5	1	2	2	4	-0.245
శ్రీలంక	6	1	3	2	4	-1.035
బంగ్లాదేశ్	6	1	5	0	2	-0.578
పాకిస్థాన్	6	0	4	2	2	-2.651

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు; ఫ.తే: ఫలితం తేలనవి; ర.రే: రన్‌రేట్

ఉన్నతి ముందంజ

ఫ్రెంచ్ ఓపెన్ నుంచి సాత్విక్ జోడీ అవుట్

న్యూఢిల్లీ: భారత వర్ధమాన షట్లర్ ఉన్నతి హుడా ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ముందంజ వేసింది. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి 11-21, 21-13, 21-16తో లెషన్నా కరుపతెవాన్ (మలేసియా)పై నెగ్గి ప్రీక్వార్టర్స్‌కు చేరింది. కాగా, పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి 18-21, 20-22తో ఇండోనేసియా ద్వయం మహ్మద్ రియాన్ అర్డియాంటో/రహ్మత్ హిదాయత్ చేతిలో ఓటమిపాలై ఆరంభ రౌండ్లోనే వెనుదిరిగింది.

12 ఏళ్లలో తొలిసారి..

స్వదేశంలో జింబాబ్వేకు టెస్టు విజయం

చిత్తుగా ఓడిన అఫ్ఘానిస్థాన్

హరారే: సొంతగడ్డపై జింబాబ్వే అదరగొట్టింది. అఫ్ఘానిస్థాన్‌తో ఏకైక టెస్టులో ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో గెలిచింది. మ్యాచ్‌ను మూడ్రోజుల్లోనే ముగించిన జింబాబ్వే.. 12 ఏళ్లలో తొలిసారిగా స్వదేశంలో టెస్టు విజయాన్ని అందుకుంది. అంతేకాదు.. 2001 తర్వాత మొదటిసారిగా ఇన్నింగ్స్ గెలుపును నమోదు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 34/1 స్కోరుతో మూడోరోజైన బుధవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన అఫ్ఘాన్ 159 రన్స్‌కే కుప్పకూలింది. గరవ 5 వికెట్లు సాధించాడు. తొలిఇన్నింగ్స్‌లో అఫ్ఘాన్ 127, జింబాబ్వే 359 పరుగులు చేశాయి.

సౌత్‌జోన్ జట్టులో తెలుగమ్మాయిలు


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బీసీసీఐ సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ టీ20 ట్రోఫీలో ఆడే సౌత్‌జోన్ జట్టును బుధవారం ప్రకటించారు. 15 మంది బృందంలో నలుగురు తెలుగమ్మాయిలకు చోటు దక్కడం విశేషం. నిక్కీ ప్రసాద్ (కర్ణాటక) కెప్టెన్‌గా, మేఘన (ఆంధ్ర)ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. కేరళకు ఆడుతున్న తెలంగాణ అమ్మాయి ప్రణవి చంద్ర, మమత (హైదరాబాద్), షబ్నం షకీల్ (ఆంధ్ర)కు జట్టులో చోటు లభించింది. స్టాండ్ బైలుగా త్రిష, వంకా పూజ (హైదరాబాద్)కు స్థానం దక్కింది. వచ్చే నెల 4వ తేదీ నుంచి 14 వరకు ఈ టోర్నీ జరగనుంది.

ఆఖరి లీగ్ మ్యాచ్‌లో టైటాన్స్ ఓటమి

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఈ సీజన్ ఆఖరి లీగ్ దశ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు పరాజయం పాలైంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 45-34తో టైటాన్స్‌పై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఓడినా టైటాన్స్ 20పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఇప్పటికే తెలుగు టైటాన్స్, హరియాణా ప్లే ఆఫ్స్ బెర్త్‌లను ఖాయం చేసుకున్నాయి.

విశ్వజిత్‌కు కాంస్యం


అండర్-23 ప్రపంచ రెజ్లింగ్



నోవి సాద్ (సెర్బియా): అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ విశ్వజిత్ మోరె పతకం సాధించాడు. గ్రీకో రోమన్ విభాగం 55 కిలోల విభాగం కాంస్యం పోరులో విశ్వజిత్ 5-4తో కజకిస్థాన్ రెజ్లర్ యెరాసిల్ మెర్‌బెకోవ్‌ను చిత్తుచేశాడు. విశ్వజిత్‌కు ఇది వరుసగా రెండో పతకం కావడం విశేషం. గతేడాది ఇదే టోర్నీలో అతను కాంస్యం గెలిచాడు.

గెలిచి.. నిలుస్తారా?

ఉదయం 9 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..


మార్ష్


గిల్

● కళ్లన్నీ రో-కో పైనే
● ఒత్తిడిలో గిల్ సేన

భారత్-ఆస్ట్రేలియా రెండో వన్డే నేడు

అడిలైడ్: తొలి వన్డేలో చిత్తుగా ఓడిన భారత్.. ఆస్ట్రేలియాతో సిరీస్‌ను సజీవంగా ఉంచే ప్రయత్నాల్లో కఠోరంగా శ్రమిస్తోంది. ఈ నేపథ్యంలో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 0-1తో వెనుకబడిన శుభ్‌మన్ గిల్ సేన.. గురువారం జరిగే రెండో వన్డేలో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, కోహ్లీల భవితవ్యం నిర్ణయించే సిరీస్‌గా భావిస్తుండడంతో మరోసారి అందరి దృష్టీ వీరిపైనే నెలకొంది. పెర్త్‌లో జరిగిన మ్యాచ్‌లో వీరిద్దరూ ఘోరంగా విఫలం కావడం అభిమానులను తీవ్రంగా నిరాశపర్చింది. ఆల్‌రౌండర్ల బలంపైనే ఎక్కువగా ఆధారపడ్డ టీమిండియాలో రో-కో చెలరేగితేనే సొంతగడ్డపై ఆసీస్‌కు దీటుగా బదులివ్వగలదు. రోహిత్ కోసం యువ ఆటగాడు జైస్వాల్‌ను బెంచ్‌కే పరిమితం చేయడంపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. వీటికి హిట్‌మ్యాన్ తన బ్యాటుతోనే సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతో ఉంది. మొదటి వన్డేలో వర్షం పలుమార్లు ఆటంకం కలిగించడంతో భారత ఇన్నింగ్స్ సాఫీగా సాగలేదు. సిరాజ్ నేతృత్వంలోని పేస్ విభాగం కూడా ఏమాత్రం ప్రభావం చూపలేక పోవడంతో.. 137 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ అలవోకగా ఛేదించింది. పేస్ ఆల్‌రౌండర్‌గా నితీశ్ కుమార్‌కు మరిన్ని అవకాశాలివ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. కుల్దీప్‌కు తుది జట్టులో చోటివ్వాలన్న ఒత్తిడి పెరుగుతున్నా.. పరిస్థితుల దృష్ట్యా అతడు మరోసారి బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశాలున్నాయి. మరోవైపు ఫుల్ జోష్‌లో ఉన్న ఆసీస్ సిరీస్‌పై గురిపెట్టింది. ముఖ్యంగా స్టార్క్, హాజెల్‌వుడ్ తమదైన బౌన్స్‌తో మరోసారి భారత బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టాలనుకొంటున్నారు. కెప్టెన్ మార్ష్, హెడ్, ఫిలిప్, రెన్ షాతో బ్యాటింగ్ విభాగం బలంగానే కనిపిస్తోంది. వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలం కాగా.. వాతావరణం సాధారణంగా ఉండనుంది.

జట్లు (అంచనా)

భారత్: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, రాహుల్ (వికెట్ కీపర్), అక్షర్ పటేల్, సుందర్/కుల్దీప్, నితీశ్, హర్షిత్ రాణా/ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్.

ఆస్ట్రేలియా: మిచెల్ మార్ష్ (కెప్టెన్), హెడ్, మాథ్యూ షార్ట్, అలెక్స్ క్యారీ (వికెట్ కీపర్), రెన్‌షా, కూపర్, మిచెల్ ఓవెన్, స్టార్క్, నాథన్ ఎల్లీస్, హాజెల్‌వుడ్, జంపా.

రో-కో దేశవాళీలు ఆడాలి : మాజీ సెలెక్టర్ జగ్దాలే

మ్యాచ్ ఫిట్‌నెస్ కోసం రోహిత్, కోహ్లీ దేశవాళీ క్రికెట్ ఆడాలని మాజీ సెలెక్టర్ సంజయ్ జగ్దాలే సలహా ఇచ్చారు. టెస్టులు, టీ20లకు గుడ్ బై చెప్పిన రో-కో.. వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. 'వీరిద్దరూ గొప్ప వైట్ బాల్ క్రికెటర్లు. 2027 వరల్డ్ కప్ ఆడాలనుకొంటున్నారు. కానీ, తరచూ ఆడకపోతే ఫిట్‌గా ఎలా ఉండగలరు? అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాక మునుపటిలా ఉండడం కష్టమే. వన్డే క్రికెట్ మ్యాచ్‌లు తక్కువగా జరుగుతున్నందున.. దేశవాళీలు ఆడితే మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించగలర'ని జగ్దాలే చెప్పారు.

ఆష్లే, అనబెల్ ఆల్‌రౌండ్ షో

ఇంగ్లండ్‌పై ఆసీస్ విజయం



ఇండోర్: ఆష్లే గార్డ్‌నర్ (104 నాటౌట్, 2/39), అనబెల్ సదర్లాండ్ (98 నాటౌట్, 3/60) ఆల్‌రౌండ్ షోతో.. వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. తొలుత ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 244 పరుగులు చేసింది. బ్యూమాంట్ (78) రాణించింది. ఛేదనలో ఆసీస్ 40.3 ఓవర్లలో 248/4 స్కోరు చేసి గెలిచింది. స్మిత్ 2 వికెట్లు దక్కించుకొంది. టాపార్డర్ బ్యాటర్లు లిచ్‌ఫీల్డ్ (1), వోల్ (6), ఎలీస్ పెర్రీ (13), బెత్ మూనీ (20) విఫలమవడంతో ఆసీస్ 68/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో సదర్లాండ్, గార్డ్‌నర్ ఆదుకొన్నారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 180 పరుగుల అబేధ్య భాగస్వామ్యం నెలకొల్పడంతో.. ఆసీస్ 57 బంతులు మిగిలుండగానే గెలిచింది. సదర్లాండ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఆరు మ్యాచ్‌ల నుంచి 11 పాయింట్లు సాధించిన ఆసీస్ మళ్లీ టాప్‌నకు చేరుకొంది.


దక్షిణాఫ్రికాకు ఆధిక్యం

పాక్ రెండో ఇన్నింగ్స్ 94/4

రావల్పిండి: టెయిలెండర్ కగిసో రబాడ (71), సెనురన్ ముత్తుసామి (89 నాటౌట్) కెరీర్ బెస్ట్ అర్ధ శతకాలతో అదరగొట్టడంతో.. రెండో, ఆఖరి టెస్ట్‌లో పాకిస్థాన్‌పై దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం అందుకుంది. ఆటకు మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 185/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన దక్షిణాఫ్రికా 404 పరుగులకు ఆలౌటైంది. దీంతో పాక్ మొదటి ఇన్నింగ్స్ స్కోరు 333కు 71 రన్స్ ఆధిక్యాన్ని నమోదు చేసింది. అనంతరం పాక్ రెండో ఇన్నింగ్స్‌లో 94/4 స్కోరు చేసింది. బుధవారం ఆట ఆఖరుకు బాబర్ (49), రిజ్వాన్ (16) క్రీజులో ఉన్నారు.

ఆర్‌బీఐ వద్ద 880 టన్నుల పసిడి

విలువ రూ.8.36 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కూడా పసిడి నిల్వలు పెంచుకుంటోంది. ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరు నాటికి ఆర్‌బీఐ వద్ద ఉన్న బంగారం నిల్వలు 880.18 టన్నులకు చేరాయి. ఈ ఏడాది మార్చి చివరి నాటికి ఉన్న నిల్వలతో పోలిస్తే ఇది 600 కిలోలు ఎక్కువ. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ఇది 9,500 కోట్ల డాలర్లకు (సుమారు రూ.8.36 లక్షల కోట్లు) సమానం. గత ఆర్థిక సంవత్సరంలోనే ఆర్‌బీఐ 54.13 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో ఫారెక్స్ నిల్వల నిర్వహణలో భాగంగా ఇతర కేంద్ర బ్యాంకుల్లానే ఆర్‌బీఐ కూడా పసిడి నిల్వలు పెంచుకుంటోంది. గత ఏడాది కాలంలో ఆర్‌బీఐతో పాటు వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు 166 టన్నుల పసిడి కొనుగోలు చేశాయి.

ఇన్ఫీ బైబ్యాక్‌కు ప్రమోటర్లు దూరం



న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ ప్రకటించిన కంపెనీ చరిత్రలోనే అతి పెద్దదైన బైబ్యాక్ ప్రక్రియలో పాలుపంచుకోకూడదని ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ నిర్ణయం తీసుకున్నారు. గత నెల 14-19 తేదీల మధ్యలో విడివిడిగా రాసిన లేఖల ద్వారా కంపెనీకి వారు సమాచారం అందించారని ఇన్ఫోసిస్ బుధవారం వెల్లడించింది. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్లు 13.05% వాటా కలిగి ఉన్నారు. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి, ఆయన భార్య సుధా మూర్తి, కూతురు అక్షతా మూర్తి, కుమారుడు రోహన్ మూర్తి, మరో సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, ఆయన భార్య రోహిణి నీలేకని, పిల్లలు నిహార్, జాన్హవి నీలేకనితో పాటు ఇతర సహ వ్యవస్థాపకులు, వారి కుటుంబ సభ్యులు ప్రమోటర్ల జాబితాలో ఉన్నారు. కంపెనీలో 2.41% వాటాకు సమానమైన 10 కోట్ల షేర్లను ఒక్కోటీ రూ.1,800 చొప్పున ఓపెన్ మార్కెట్ నుంచి తిరిగి కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు గత నెల 11న ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఇందుకోసం కంపెనీ మొత్తం రూ.18,000 కోట్లు వెచ్చించనుంది.

సత్య నాదెళ్ల వేతనం రూ.850 కోట్లు

2025 ఆర్థిక సంవత్సరంలో 22% పెంపు



న్యూఢిల్లీ: అమెరికన్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈఓ, తెలుగు వ్యక్తి సత్య నాదెళ్ల 2025 ఆర్థిక సంవత్సరానికి (2024 జులై 1- 2025 జూన్ 30) రికార్డు స్థాయిలో 9.65 కోట్ల డాలర్ల పారితోషికం అందుకున్నారు. మన కరెన్సీలో దాదాపు రూ.850 కోట్లు. 2024 ఆర్థిక సంవత్సరంలో లభించిన 7.91 కోట్ల డాలర్లతో పోలిస్తే ఆయన వేతన ప్యాకేజీ 22% పెరిగింది. కృత్రిమ మేధలో (ఏఐ) మైక్రోసాఫ్ట్‌ను అగ్రగామిగా నిలబెట్టడంతోపాటు గడిచిన ఏడాది కాలంలో కంపెనీ అద్భుత పనితీరు కనబరచడంతో నాదెళ్ల ప్యాకేజీ కూడా గణనీయంగా పెరిగింది. 2025 ఆర్థిక సంవత్సరంలో మైక్రోసాఫ్ట్ ఆదాయం 15% పెరిగి 28,170 కోట్ల డాలర్లకు చేరగా.. నికర రాబడి 16% వృద్ధితో 10,180 కోట్ల డాలర్లకు చేరింది. అంతేకాదు, ఈ ఏడాదిలో మైక్రోసాఫ్ట్ షేరు ధర 23% పెరిగింది. గత ఏడాది కంపెనీ మార్కెట్ విలువ 3 లక్షల కోట్ల డాలర్ల మైలురాయికి చేరింది. యాపిల్ తర్వాత ఈ స్థాయి మార్కెట్ విలువను కలిగిన కంపెనీ ఇదే.

95 శాతానికి పైగా స్టాక్ కేటాయింపులే..

కంపెనీ ఫైలింగ్ ప్రకారం.. నాదెళ్ల వార్షిక పారితోషికంలో 95 శాతానికి పైగా (దాదాపు 8.42 కోట్ల డాలర్లు) పనితీరు ఆధారిత స్టాక్ కేటాయింపులే. అంటే, వ్యాపారాన్ని అనుకున్న లక్ష్యాలకు చేర్చినందుకుగాను కంపెనీ ఆయనకు కేటాయించిన షేర్ల విలువ అది. ఆయన కనీస వేతనం 25 లక్షల డాలర్లుగా ఉంది. మరో 0.95 కోట్ల డాలర్లు నగదు బోనస్, 1.96 లక్షల డాలర్లు ఇతర ప్రయోజనాల రూపంలో లభించాయి.

2014లో సారథ్య బాధ్యతలు

మైక్రోసాఫ్ట్ సీఈఓగా 2014లో నాదెళ్ల కంపెనీ పగ్గాలు చేపట్టారు. గడిచిన దశాబ్దానికి పైగా కాలంలో కంపెనీ పనితీరు, వ్యాపారంతో పాటు ఆయన పారితోషికం కూడా గణనీయంగా పెరుగుతూ వచ్చింది. 2015లో ఆయన వేతన ప్యాకేజీ కేవలం 1.8 కోట్ల డాలర్లు. 2022లో 5.5 కోట్ల డాలర్లకు పెరిగింది. 2025లో దాదాపు 10 కోట్ల డాలర్లకు చేరువైంది.

బిజినెస్

జేఎల్ఆర్‌పై సైబర్ దాడి నష్టం రూ.22,238 కోట్లు

లండన్: టాటా మోటార్స్ అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్‌రోవర్‌పై (జేఎల్ఆర్) జరిగిన సైబర్ దాడి భారీ నష్టాన్నే మిగిల్చింది. ఈ నష్టం ఎంత లేదన్నా 190 కోట్ల పౌండ్ల (సుమారు రూ.22,238 కోట్లు) వరకు ఉంటుందని బ్రిటన్‌లో సైబర్ నేరాలను పరిశీలించే ది సైబర్ మానిటరింగ్ సెంటర్ (సీఎంసీ) తెలిపింది. బ్రిటన్ చరిత్రలో అతి పెద్ద సైబర్ దాడిగా పరిగణించే ఈ దాడితో దాదాపు 5,000 వ్యాపార సంస్థలూ దెబ్బతిన్నాయి. ఈ ఏడాది ఆగస్టులో జరిగిన ఈ దాడితో జేఎల్ఆర్ ఉత్పత్తి, మార్కెటింగ్, డిస్ట్రిబ్యూషన్ కార్యకలాపాలు నిలిచి పోయాయి.

ఐదు నెలల్లో మరో 150 కొత్త శాఖలు : యూకో బ్యాంక్

న్యూఢిల్లీ: వచ్చే ఐదు నెలల్లో దేశవ్యాప్తంగా మరో 150 కొత్త శాఖలను తెరవనున్నట్లు యూకో బ్యాంక్.. తెలిపింది. దీంతో వచ్చే మార్చి నాటికి బ్యాంకు శాఖల సంఖ్య 3,472కు పెరగనుంది. ఈ విస్తరణ ప్రణాళికకు బోర్డు ఆమోదం లభించిందని, వచ్చే మార్చి నాటికి వీటిని ప్రారంభిస్తామని, త్వరలోనే ఉద్యోగాల నియామకాలు కూడా చేపట్టనున్నట్లు యూకో బ్యాంకు ఎండీ, సీఈఓ అశ్వనీ కుమార్ తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	553
చిత్తూరు	583	విశాఖపట్నం	545

దజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	126
వరంగల్	112	గుంటూరు	121
కరీంనగర్	112	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	100
కర్నూలు	112	నెల్లూరు	105
విశాఖపట్నం	124	అనంతపురం	105
గోదావరి	126		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,27,200 ▼	1,16,500 ▼	1,80,000 ▼
విజయవాడ	1,25,000 ▼	1,18,000 ▼	1,55,500 ▼
విశాఖపట్నం	1,25,390 ▼	1,19,700 ▼	1,75,000 ▼
రాజమండ్రి	1,27,200 ▼	1,16,600 ▼	1,63,000 ▼
ప్రొద్దుటూరు	1,29,000 ▼	1,18,680 ▼	1,61,000 ▼
ముంబై	1,23,910 ▼	1,13,500 ▼	1,52,500 ▼

ఉద్యోగాల్లో ఏఐకే పెద్దపీట

ఇండీడ్ నివేదిక



న్యూఢిల్లీ: దేశంలో ఉద్యోగ నియామకాల ముఖచిత్రం మారిపోతోంది. ఏ రంగానికి చెందిన కంపెనీ అయినా నూతన నియామకాల విషయంలో అభ్యర్థికి కృత్రిమ మేధ (ఏఐ) నైపుణ్యాల్లో పట్టు ఉందా, లేదా అని చూస్తున్నట్టు ప్రపంచ వ్యాప్తంగా కంపెనీలకు నియామకాల సేవలందించే 'ఇండీడ్' తాజా నివేదికలో తెలిపింది. ఈ సంస్థ నివేదిక ప్రకారం గత నెల దేశీయ కంపెనీలు ప్రకటించిన ఉద్యోగాల్లో 11.7% ఉద్యోగాలకు ఏఐ నైపుణ్యాలు కావాలని కోరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 3.5% ఎక్కువ. ఈ ఏడాది జూన్‌తో పోల్చినా ఇది 1.1% ఎక్కువ. సింగపూర్ తర్వాత భారతీయ కంపెనీలే కొత్త ఉద్యోగుల్లో ఏఐ నైపుణ్యాలను ఎక్కువగా చూస్తున్నట్టు ఇండీడ్ సంస్థ ఆసియా-పసిఫిక్ ప్రాంత సీనియర్ ఆర్థికవేత్త కాలమ్ పికరింగ్ చెప్పారు.

టెక్‌లోనే ఎక్కువ: ఉద్యోగుల్లో ఏఐ నైపుణ్యాలు కోరుతున్న కంపెనీల్లో టెక్ కంపెనీలు అగ్రస్థానంలో ఉన్నాయి. డేటా అండ్ అనలిటిక్స్ ఉద్యోగుల కోసం చూస్తున్న కంపెనీల్లో 39% కంపెనీలు ఏఐ నైపుణ్యాలు అడుగుతున్నాయి. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి (23%), బీమా (18%), శాస్త్రీయ పరిశోధన (17%) కంపెనీలు తర్వాతి స్థానాల్లో ఉన్నట్టు ఆ నివేదిక తెలిపింది.

ఉద్యోగాలకు ముప్పే: మస్క్

టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్ ఉద్యోగాల్లో ఏఐ ప్రభావంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏఐ, రోబోలు భవిష్యత్‌లో మనుషులు చేసే అన్ని ఉద్యోగాలను చేస్తాయన్నారు. అపుడు పనీ పాట లేని వ్యక్తులు కూరగాయలు పెంచుకుంటూ కాలక్షేపం చేయవచ్చంటూ సోషల్ మీడియా యాప్ 'ఎక్స్' పోస్టులో వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. టీసీఎస్, యాక్సెంచర్ వంటి ఐటీ దిగ్గజాలు వేల మంది ఉద్యోగులకు తీసివేస్తున్న సమయంలో మస్క్ పెట్టిన ఈ పోస్టు ఐటీ ఉద్యోగులను మరింత భయపెడుతోంది.

అమెజాన్‌లో ఆరు లక్షల ఉద్యోగాలు ఔట్

ఏఐ ప్రభావం ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ పైనా కనిపిస్తోంది. 2030 నాటికి అమెజాన్ అమెరికాలో ఆరు లక్షల మంది ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో రోబోలను ఏర్పాటు చేయనున్నట్టు న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఒక కథనం ప్రచురించింది. ఇందులో 1.6 లక్షల ఉద్యోగాలను 2027 కల్లా తొలగించనుంది. దీంతో 2025-27 మధ్య అమెజాన్‌కు 1260 కోట్ల డాలర్ల వరకు ఆదా అవుతాయని అంచనా.

గూగుల్ క్రోమ్‌కు పోటీగా చాట్‌జీపీటీ అట్లాస్

- ప్రకటించిన ఓపెన్ ఏఐ
- గూగుల్ మార్కెట్ విలువలో రూ.13.20 లక్షల కోట్ల పతనం

న్యూఢిల్లీ: జనరేటివ్ ఏఐ అప్లికేషన్ చాట్‌జీపీటీ సృష్టికర్త ఓపెన్‌ఏఐ.. ఇక వెబ్ బ్రౌజింగ్ సేవలనూ అందించబోతోంది. గూగుల్ క్రోమ్‌కు పోటీగా చాట్‌జీపీటీ అట్లాస్ పేరుతో ఏఐ ఆధారిత వెబ్ బ్రౌజర్‌ను ప్రవేశపెడుతున్నట్లు ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్ ప్రకటించారు. దాంతో గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ షేరు ఒకదశలో 5% వరకు క్షీణించి 246.15 డాలర్లకు పడిపోయింది. కంపెనీ మార్కెట్ విలువ ఏకంగా 15,000 కోట్ల డాలర్ల మేర (సుమారు రూ.13.20 లక్షల కోట్లు) పతనమైంది. అయితే, షేరు మళ్లీ కాస్త కుదురుకుని 2.4 శాతం నష్టంతో 250.6 డాలర్ల వద్ద ముగిసింది. అంతర్జాలంలో సమాచార శోధనకు ఉపయోగించే వెబ్ బ్రౌజర్లలో ప్రస్తుతం గూగుల్ క్రోమ్‌దే గుత్తాధిపత్యం. క్రోమ్‌కు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 300 కోట్ల మంది యూజర్లున్నారు. గూగుల్ తన జనరేటివ్ ఏఐ అప్లికేషన్ జెమినీ సేవలను సైతం ఇప్పటికే క్రోమ్‌తో అనుసంధానించింది. అయితే, జనరేటివ్ ఏఐ సేవల్లో చాట్‌జీపీటీదే అగ్రస్థానం.

ఈ యాప్‌ను 80 కోట్ల మందికి పైగా వినియోగిస్తున్నారు. చాట్‌జీపీటీ అట్లాస్ లాంచ్ ద్వారా ఓపెన్ ఏఐ మరింత మంది ఇంటర్నెట్ వినియోగదారులకు చేరువ కావాలనుకుంటోంది.

భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో 3% వృద్ధి

న్యూఢిల్లీ: భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్.. జూలై- సెప్టెంబర్ త్రైమాసికంలో 3% వార్షిక వృద్ధితో 4.84 కోట్ల యూనిట్లను సరఫరా చేసింది. పండుగ సీజన్ ముందస్తు డిమాండ్, కొత్త మోడళ్ల ఆవిష్కరణ, రిటైల్ ప్రోత్సాహక వ్యూహాలు మార్కెట్‌కు ఊతమిచ్చాయని టెక్ రీసెర్చ్ సంస్థ ఒమిడియా తాజా నివేదికలో వెల్లడించింది. అయితే ఈ వృద్ధి దీర్ఘకాలికంగా కొనసాగుతుందనే సంకేతాలు కనిపించడంలేదని పేర్కొంది. వినియోగదారుల సహజ డిమాండ్ తక్కువగానే ఉందని, రిటైలర్లకు ఇచ్చిన నగదు బోనస్, బహుమతులు, డీలర్ల మధ్య పోటీకి ఇచ్చిన ప్రోత్సాహలతోనే ఈ వృద్ధి నమోదైనట్లు ఒమిడియా ప్రధాన విశ్లేషకుడు సన్యం చౌరాసియా తెలిపారు. ఏడాది చివరి వరకు ఈ సానుకూల ధోరణి కొసాగడం కష్టసాధ్యమేనని ఆయన అన్నారు.



భారతికి ఫోన్ చేసిందెవరు.. ఏం చెప్పారు?

తదుపరి దర్యాప్తునకు ఆదేశించండి..

వివేకాహత్య కేసులో సీబీఐ కోర్టులో సునీతారెడ్డి పిటిషన్

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ బాబాయి, తన తండ్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మరింత లోతైన దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని.. తదుపరి దర్యాప్తు చేపట్టే విధంగా సీబీఐకి ఆదేశాలు జారీచేయాలంటూ నర్రెడ్డి సునీతారెడ్డి హైదరాబాద్ నాంపల్లి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. తదుపరి దర్యాప్తు కావాలనుకుంటే సంబంధిత ట్రయల్ కోర్టులోనే పిటిషన్ దాఖలు చేసుకోవాలని ఇటీవల సుప్రీంకోర్టు సునీతారెడ్డికి సూచించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆమె తాజాగా సీబీఐ కోర్టును ఆశ్రయించారు. తన తండ్రి హత్య కేసులో లోతైన దర్యాప్తు జరగకపోతే అసలు వ్యక్తులు తప్పించుకునే ప్రమాదం ఉందని.. ఇప్పటికే తండ్రిని కోల్పోయిన తనకు మరింత అన్యాయం జరుగుతుందని తన పిటిషన్‌లో ఆమె అభ్యర్థించారు. సప్లమెంటరీ చార్జిషీటు దాఖలుచేయాలని సీబీఐని ఆదేశించాలని కోరారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు జరిగితేనే ఇప్పటికీ వెలుగుచూడని అసలు వాస్తవాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు.

పిటిషన్‌లో ఏమున్నదంటే..

- వివేకా హత్యకేసులో 5వ నిందితుడు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్య రెడ్డి కడప జైల్లో 4వ నిందితుడు దస్తగిరిని (అప్రూవర్) కలిసి ప్రభావితం చేయడానికి ప్రయత్నించారు. మెడికల్ క్యాంప్ పేరుతో జైల్లో ప్రవేశించి దస్తగిరిని ప్రలోభాలకు, బెదిరింపులకు గురిచేశారు. ఈ అంశంపై దర్యాప్తు జరిగితేనే కొత్త వాస్తవాలు తెలుస్తాయి.
- సాక్షులను భయభ్రాంతులకు గురిచేయడానికి, వారిని ప్రభావితం చేయడానికి చాలా ప్రయత్నాలు జరిగాయని స్వయంగా సీబీఐ తెలిపింది. ఇదేవిషయం ఏపీ పోలీసులు సుప్రీంకోర్టు ఎదుట వివరంగా పేర్కొన్నారు. వివేకా హత్యపై మొదట ఫిర్యాదు చేసిన పీఏ ఎంవీ కృష్ణారెడ్డి నాపైనా, నా భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అప్పటి సీబీఐ దర్యాప్తు అధికారి రాంసింగ్‌పైనా కేసు పెట్టారు. ఇది తప్పుడు కేసు అని ఏపీ పోలీసులు తమ తుది నివేదికలో తేల్చారు. కృష్ణారెడ్డి పెట్టిన కేసులో గత ప్రభుత్వంలో దర్యాప్తు ఘోరంగా జరిగింది. కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డికి చెందిన సిబ్బంది, సన్నిహితులు దర్యాప్తులో జోక్యం చేసుకోవడమే కాకుండా బయటనుంచి దర్యాప్తు అధికారిని మానిటర్ చేశారు. అంతేకాకుండా దర్యాప్తు కూడా పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో కాకుండా ప్రైవేటువ్యక్తుల ఇంట్లో జరిపారు. వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఇతర నిందితులను రక్షించడానికి కట్టుకథలతో సీబీఐ కేసుకు తప్పుడు విధానంలో కౌంటర్ కేసును తయారు చేయడానికి కుట్ర చేశారు. రికార్డులను తారుమారు చేయడానికి ప్రయత్నించారు. ఈ కౌంటర్ కేసుపై తదుపరి విచారణ జరగాల్సిందే.
- ఏపీ చీఫ్ సెక్రటరీగా పనిచేసి రిటైర్ అయిన ఐఏఎస్ అజేయ కల్లం వివేకా హత్య కేసుకు సంబంధించి సీబీఐ ఎదుట సీఆర్పీసీ 161 కింద స్టేట్‌మెంట్ ఇచ్చారు. 2019 ఎన్నికల్లో వైసీపీ పార్టీ మేనిఫెస్టో రూపకల్పనలో తాను సహాయం చేశానని, దీనికి సంబంధించిన సమావేశాలు హైదరాబాద్‌లోని జగన్ నివాసంలో తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో జరుగుతుండేవని పేర్కొన్నారు. వివేకా చనిపోయినరోజు (2019 మార్చి 15) తెల్లవారుజామున 5.30 గంటలకు తాను జగన్‌తో సమావేశంలో ఉండగా, అటెండర్ వచ్చి అమ్మ (వైఎస్ భారతి) పిలుస్తున్నారని తెలపగా, జగన్ వెళ్లారని ఆయన పేర్కొన్నారు. పది నిమిషాల తర్వాత తిరిగొచ్చిన జగన్.. చిన్నాన్న (వైఎస్ వివేకా) ఇక లేరని చెప్పారని.. దీంతో తామంతా షాక్‌కు గురయ్యామని తన స్టేట్‌మెంట్‌లో ఆయన పేర్కొన్నారు. అయితే వివేకా చనిపోయినట్టు ఫోన్ కాల్ ఎవరు చేశారు? ఫోన్‌కాల్ సారాంశం ఏంటి? అనే విషయాలు బయటకురావాల్సిన అవసరం ఉంది.
- వివేకా చనిపోయినరోజు ఉదయం 6.15 గంటలకు ప్రజలకు, కుటుంబ సభ్యులకు ఆ విషయం ఆయన పీఏ ఎంవీ కృష్ణారెడ్డి చెప్పడానికి ముందే కొంతమంది వ్యక్తులకు మరణ వార్త తెలుసు. ఏ-6 గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డితోపాటు మరికొంతమందికి ఆ విషయం తెలుసునని సీబీఐ తన చార్జిషీట్‌లో పేర్కొంది. ఉదయ్‌కుమార్‌రెడ్డి కాకుండా ఇంకా ఎవరెవరికి తెలుసుననే విషయాలపై తదుపరి దర్యాప్తు జరగాల్సి ఉంది.
- ఆధారాల చెరిపివేతలో వైఎస్ మనోహర్‌రెడ్డి, ఎంవీ కృష్ణారెడ్డి తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించినప్పటికీ ఆధారాలు లేవని వారిని నిందితులుగా చేర్చలేదని సీబీఐ పేర్కొంది. వారిద్దరి పాత్రనూ తేల్చాలి.
- దస్తగిరి సన్నిహితుడు సయ్యద్ మున్నా లాకర్‌లోని డబ్బు, బంగారానికి లెక్కలు లేవనే కారణంతోపాటు వాటికి హత్య కేసుతో సంబంధం ఉందంటూ సీబీఐ సీజ్ చేసింది. మున్నా ఇచ్చిన వివరణను బలపరిచే ఎలాంటి డాక్యుమెంట్లూ లేవు. కాబట్టి ఈ అంశంపై సీబీఐ మరింత దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. ఏ-2 సునీల్‌యాదవ్ సోదరుడు కిరణ్‌యాదవ్, వైఎస్ ప్రకాశ్‌రెడ్డి మనవడు అర్జున్‌రెడ్డి మధ్య నడిచిన మెసేజ్‌లకు సంబంధించి సైతం సీబీఐ ఎలాంటి దర్యాప్తు చేయలేదు. అలాగే హత్య జరగడానికి కొద్దిరోజుల ముందు లోవరాజు అనే వ్యక్తి మా ఇంట్లో డ్రైవర్‌గా చేరారు. హత్య జరగడానికి మూడు రోజుల ముందు సెలవు మీద వెళ్లి.. ఆ తర్వాత చెప్పాపెట్టకుండా ఉద్యోగం మానేయడమేకాకుండా ఫోన్ స్విచాఫ్ చేశారు.ఆయన విషయం లో కూడా సీబీఐ ఎలాంటి దర్యాప్తు చేయలేదు.
- ఏ-7, ఏ-8గా ఉన్న వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డిలను రక్షించేందుకు శివశంకర్‌రెడ్డి... గంగాధర్‌రెడ్డి అనే వ్యక్తిని కలిశారు. హత్య తానే చేశానని ఒప్పుకొంటే రూ. 10 కోట్లు ఇస్తామని ఆయనకు శివశంకర్‌రెడ్డి ఆఫర్ ఇచ్చారు. గంగాధర్‌రెడ్డి అంశంపై సీబీఐ దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. అవినాశ్‌రెడ్డిని అరెస్ట్ చేసి కస్టోడియల్ ఇంటరాగేషన్ జరపాలి.

ఐఫోన్ ఆర్డర్ చేస్తే.. ఐక్యూ ఫోన్ డెలివరీ..!

అమెజాన్ కంపెనీ ఎండీకి అరెస్టు వారెంట్లు

నోటీసులకు స్పందించకపోవడంతో వినియోగదారుల కమిషన్ ఆగ్రహం

కర్నూలు లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐఫోన్ ఆర్డర్ చేసిన కస్టమర్‌కు ఐక్యూ ఫోన్ డెలివరీ చేసిన కేసులో.. జిల్లా వినియోగదారుల కమిషన్ జారీచేసిన ఆదేశాలను ఖాతరు చేయని అమెజాన్ కంపెనీ ఎండీతో పాటు మరో ఇద్దరికి అరెస్టు వారెంట్లు జారీ అయ్యాయి. ఈ మేరకు కర్నూలు జిల్లా వినియోగదారుల కమిషన్ కరణం కిశోర్ కుమార్ బుధవారం ఆదేశాలు జారీచేశారు. కర్నూలు జిల్లా సి.బెళగల్ గ్రామానికి చెందిన ఫిర్యాది కురువ వీరేశ్.. 2024 సెప్టెంబరు 29న అమెజాన్‌లో యాపిల్ ఐఫోన్ 15ప్లస్ సెల్‌ఫోన్‌ను బుక్ చేశారు. దీని కోసం ఆయన రూ.79,900 ఆన్‌లైన్ ద్వారా చెల్లించారు. అయితే అమెజాన్ సంస్థ.. 'ఐఫోన్ 15ప్లస్'కు బదులుగా.. 'ఐక్యూ నియో9ప్రో' ఫోన్‌ను అందజేసింది. తాను పెట్టిన ఆర్డర్‌కు బదులుగా వేరే మోడల్ ఫోన్‌ను డెలివరీ చేయడంతో వీరేశ్.. జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు కమిషన్ అమెజాన్ ఎండీతో పాటు మరో ఇద్దరికి నోటీసులు జారీచేసినా వారు కమిషన్ ముందు హాజరు కాలేదు. దీంతో ఐఫోన్ 15ప్లస్ ఖరీదు కోసం చెల్లించిన రూ.79,900లకు 12 శాతం వడ్డీ జోడించి, అతని మానసిక ఆవేదన, కోర్టు ఖర్చుల కింద మరో రూ.35వేలు ఫిర్యాదికి 45 రోజుల్లోపు అందజేయాలని గతంలో ఆదేశాలు జారీచేసింది. అయినప్పటికీ అమెజాన్ కంపెనీతో పాటు ప్రతివాదులు జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశాలను ఖాతరు చేయలేదు. దీంతో ఆగ్రహించిన కమిషన్ అమెజాన్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌కు అరెస్టు వారెంట్లు జారీ చేసింది. ఈ కేసు విచారణను ఈ ఏడాది నవంబరు 21వ తేదీకి వాయిదా వేస్తూ కమిషన్ చైర్మన్ కరణం కిశోర్ కుమార్, సభ్యులు నారాయణ రెడ్డి, నజీమా కౌసర్ ఆదేశాలు జారీచేశారు.

తాతయ్యనని చెప్పి.. తోటలోకి తీసుకెళ్లి..!

మైనర్ బాలికపై వృద్ధుడి అత్యాచారం

నిందితుడిపై పోక్సో కేసు నమోదు



నారాయణరావు

తుని రూరల్/కాకినాడ/అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తాతయ్య వరసైన దగ్గర బంధువు మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కాకినాడ జిల్లా తునిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తుని పట్టణానికి చెందిన బాలిక స్థానిక గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆమె సమీప బంధువు తాటిక నారాయణరావు(62) అప్పుడప్పుడూ గురుకుల పాఠశాలకు వచ్చి బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లాలనే నెపంతో బయటకు తీసుకువెళ్తున్నాడు. మంగళవారం కూడా బాలికను నిందితుడు పాఠశాల నుంచి తీసుకువెళ్లాడు. అక్కడి నుంచి తొండంగి మండలం పైడికొండ గ్రామ శివార్లలోని సపోటా తోటలోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక కేకలు విన్న తోటమాలి వచ్చి నిందితుడిని నిలదీశాడు. తాను బాలిక బంధువునని, తోటలోకి బహిర్భూమికి తీసుకొచ్చానని చెప్పాడు. నారాయణరావు తనకు తాతయ్య అవుతారని ఆ బాలిక కూడా చెప్పింది. తర్వాత వారిద్దరూ స్కూటీపై వెళ్లిపోయారు. బాలికను హాస్టల్‌లో దించి నిందితుడు ఇంటికి వెళ్లిపోయాడు. అయితే తోటలో వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మంగళవారం రాత్రి బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు నారాయణరావుకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నారాయణరావుపై పోక్సో కేసుతో పాటు కిడ్నాప్, అత్యాచారం కింద వివిధ సెక్షన్లు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు వివరించారు. పార్టీల మధ్య గొడవలు సృష్టించేందుకు అసత్య ప్రచారాలు చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, బాలికపై అత్యాచారం ఘటనపై మంత్రి లోకేశ్ స్పందించారు. బాధితురాలు ధైర్యంగా ఉండాలని, సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనను సుమోటోగా స్వీకరిస్తున్నట్లు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీని ఆమె ఆదేశించారు.

గురుకుల విద్యార్థినులకు పటిష్ఠ భద్రత

తునిలో అత్యాచారయత్నం ఘటన షాక్‌కు గురిచేసింది: లోకేశ్

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థినులకు పటిష్ఠ భద్రత కల్పించాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. తునిలో జరిగిన అత్యాచారయత్నం ఘటనపై స్పందించిన ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'తుని రూరల్ గురుకుల పాఠశాల విద్యార్థినిపై తాటిక నారాయణరావు అనే కామాంధుడు అత్యాచారానికి యత్నించినట్టు తెలుసుకుని షాక్ అయ్యాను. అతనిపై పోలీసులు పోక్సో కేసు నమోదుచేసి, అరెస్టు చేశారు. ఇలాంటి ఘటనలకు పాల్పడేవారిని ఉక్కుపాదంతో అణచివేస్తాం. బాధితురాలికి కౌన్సెలింగ్ ఇచ్చి, అన్ని రకాలుగా సహాయసహకారాలు అందిస్తాం' అని పేర్కొన్నారు.

మున్సిపాలిటీలు, ఉడాలకు కామన్ జోనింగ్ రెగ్యులేషన్స్

తుది నోటిఫికేషన్ జారీ చేసిన మున్సిపల్ శాఖ

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థలు, పట్టణాభివృద్ధి అథారిటీలకు వర్తించే కామన్ జోనింగ్ రెగ్యులేషన్స్ -2025ను ప్రకటిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఏకీకృత, పారదర్శకత, సాంకేతిక ఆధారిత నగర ప్రణాళిక ప్రమాణాలను ఏర్పాటు చేయడానికి ఈ విధానం తీసుకొచ్చారు. ఈ సంస్కరణలు ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సూచీలో మరింత ముందంజ వేయడానికి దోహదం చేస్తాయి.

ఏం చర్యలు తీసుకున్నారో చెప్పండి!

దర్యాప్తునకు అనుమతి ఇచ్చారా? లేదా?

ఏసీబీ డీజీ లేఖపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

వైసీపీ హయాంలో భూసేకరణ అవకతవకలపై పిల్

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో చేపట్టిన భూసేకరణలో అవకతవకలపై విచారణ జరిపేందుకు అనుమతించాలని కోరుతూ ఏసీబీ డీజీ రాసిన లేఖపై ఏం చర్యలు తీసుకున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. లేఖ ఆధారంగా విచారణకు అనుమతులు మంజూరు చేశారా? లేదా? తదితర వివరాలు తదుపరి విచారణలో తమ ముందుంచాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్ నివేదికను అందజేయాలని స్పష్టం చేసింది. విచారణను వచ్చే ఫిబ్రవరి 4వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద తాళ్లరేవు మండలంలో ఇళ్ల పట్టాల పంపిణీ కోసం చేసిన భూసేకరణలో జరిగిన అవకతవకలపై ఏసీబీ లేదా సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ గడిమోగా గ్రామానికి చెందిన పీవీ భద్రరావు 2024లో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.

స్ట్రెచర్ పైకి 'వైద్యసేవ'

తక్షణమే 2,700 కోట్లు విడుదల చేయాలి: షర్మిల నిరసన

విజయవాడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని స్ట్రెచర్ పైకి ఎక్కిస్తోందని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చేందుకు సర్కారు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకానికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. 'ఆరోగ్యశ్రీ పేరును ఎలా మార్చినా దాన్ని కొనసాగించాలి. ఈ పథకానికి తక్షణం రూ.2,700 కోట్లు విడుదల చేయాలి. బిల్లుల కోసం 14 రోజులుగా ప్రైవేట్ ఆసుపత్రులు వైద్య సేవలను ఆపేశాయి' అని షర్మిల అన్నారు.

కస్టడీకి అద్దేపల్లి సోదరులు

రేపట్నుంచి 30 వరకు విచారణకు ఎక్సైజ్ పోలీసులకు కోర్టు అనుమతి

విజయవాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న అద్దేపల్లి జనార్దనరావు, అద్దేపల్లి జగన్మోహనరావును కోర్టు ఈ నెల 24 నుంచి 30 వరకు ఏడు రోజుల పాటు ఎక్సైజ్ పోలీసుల కస్టడీకి ఇచ్చింది. బుధవారం విజయవాడ ఆరో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి లెనిన్‌బాబు ఈ మేరకు తీర్పును వెలువరించారు. కాగా ప్రధాన నిందితుడు జనార్దనరావు తనకు బెయిల్ మంజూరు చేయాలని బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఏ13గా ఉన్న తిరుమలశెట్టి శ్రీనివాస్‌ను కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. విచారణను కోర్టు గురువారానికి వాయిదా వేసింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

వింటేజ్ లుక్‌లో



'బాహుబలి'తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన ప్రభాస్ చేస్తున్న ప్రతీ చిత్రంపైన అంచనాలు భారీస్థాయిలో ఉంటున్నాయి. ఆయన కథానాయకుడిగా మారుతి తెరకెక్కిస్తున్న హారర్ కామెడీ థ్రిల్లర్ 'రాజాసాబ్' ట్రైలర్ ఇటీవలె విడుదలై అందరినీ అలరించింది. ఇందులో వింటేజ్ లుక్‌లో ప్రభాస్ కనిపించడంతో అభిమానులు ఫుల్ ఖుషీ అయ్యారు. వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 9న చిత్రం విడుదలవుతోంది. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి మరిన్ని అప్‌డేట్స్ వస్తాయని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. పీపుల్ మీడియాఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రంలో మాళవికా మోహన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్ కథానాయికలు. మరోవైపు, 'బాహుబలి' సిరీస్‌లోని రెండు భాగాలను కలిపి చేస్తున్న 'బాహుబలి: ద ఎపిక్' ఈ నెల 31న విడుదలవుతోంది.

పాండవుల పక్షాన నిలిచిన కర్ణుడు

ప్రభాస్ కథానాయకుడిగా దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా చిత్రంపై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలిసిందే. తాజాగా ఈ సినిమా గురించి కీలక అప్డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. గురువారం ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటిస్తామని ప్రకటించి, ప్రీ లుక్‌ను విడుదల చేశారు. 'పద్మవ్యూహాన్ని చేధించిన అర్జునుడు.. పాండవుల పక్షాన నిలిచిన కర్ణుడు.. ఒక్కడిగానే పోరాడే బెటాలియన్.. 1932 నుంచి మోస్ట్ వాంటెడ్' అని విడుదల చేసిన పలు ప్రచార చిత్రాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ సినిమాలో ప్రభాస్ సరసన సోషల్‌మీడియా స్టార్ ఇమాన్వీ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. టీ సిరీస్ గుల్షన్‌కుమార్, భూషణ్ కుమార్ సమర్పిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ మొదలైనప్పటి నుంచి చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. 1930 దశకంలో సాగే ఈ కథలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భానుచందర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.



మిరాయ్ ఫ్రాంచైజీలో మరిన్ని చిత్రాలు

- టీజీ విశ్వప్రసాద్

'మిరాయ్' సినిమాకు అద్భుతమైన విజయాన్నిచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇకపై ఈ ఫ్రాంచైజీలో అంతర్జాతీయ స్థాయి హంగులతో సినిమాలు నిర్మించబోతున్నాం. ఇండియాలో అత్యధికంగా ప్రేక్షకులు వీక్షించిన చిత్రాల జాబితాలో 'మిరాయ్' నిలుస్తుంది. మున్ముందు ఈ ఫ్రాంచైజీలో మరిన్ని అద్భుతమైన చిత్రాలు రాబోతున్నాయి' అని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ అన్నారు. తేజ సజ్జ కథానాయకుడిగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన చిత్రమిది. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. సెప్టెంబర్‌లో విడుదలైన ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ఘనవిజయం అందుకొంది. ఈ సందర్భంగా చిత్రబృందం బుధవారం సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించింది. తేజ సజ్జ మాట్లాడుతూ "మిరాయ్' విడుదలై 45 రోజులు అవుతోంది, మరో పక్క ఓటీటీలోనూ స్ట్రీమింగ్ అవుతోంది. ఇప్పటికీ థియేటర్లలోనూ చక్కటి ఆదరణ దక్కుతోంది. ఇంత మంచి విజయాన్ని ఇచ్చిన విశ్వప్రసాద్, కార్తీక్ గార్లకు రుణపడి ఉంటాను' అని అన్నారు. చిత్రబృందం సమష్టి కృషితోనే ఇంత గొప్ప విజయం సాధ్యమైంది అని కార్తీక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకర్స్ యూనిట్ సభ్యులను మెమెంటోలతో సత్కరించారు.

హిట్ బీజీఎమ్ టైటిల్‌తో



శివాజీ కథానాయకుడిగా నటిస్తూ సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమాకు 'సాంప్రదాయని సుప్పిని సుద్దపూసని' టైటిల్‌ను ఖరారు చేసి మోషన్ పోస్టర్ విడుదల చేశారు. లయ కథానాయిక. 90స్ వెబ్ సిరీస్ బాలనటుడు రోహన్, అలీ, ధనరాజ్, రఘుబాబు, పృథ్వీరాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్తూరు నేపథ్యంలో జరిగే ఈ సినిమాలో క్రైమ్ ఎలిమెంట్ కూడా ఉంటుందని హింట్ ఇచ్చారు మేకర్స్. 90స్ వెబ్‌సిరీస్‌లోని సాంప్రదాయని సుప్పిని సుద్దపూసని బీజీఎమ్‌నే ఈ చిత్రం టైటిల్‌గా పెట్టి సినిమాపై అంచనాలు పెంచేశారు.

ప్రేమ, కుటుంబ విలువలతో



అనీష్ హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'లవ్ ఓటీపీ'. విజయ్ ఎం రెడ్డి నిర్మించారు. జాన్విక కథానాయిక. రాజీవ్ కనకాల కీలక పాత్ర పోషించారు. నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా రాజీవ్ కనకాల మాట్లాడుతూ 'తెలుగు కన్నడ భాషల్లో 'లవ్ ఓటీపీ' చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రేమ, కుటుంబ విలువలతో హృద్యంగా ఉంటుంది. కొడుకును కూతురులా చూసుకునే తండ్రి పాత్రను పోషించాను. నా పాత్ర కొత్త తరహాలో సాగుతుంది. అనీష్ ఈ చిత్రాన్ని కష్టపడి, ఇష్టపడి చేశాడు. తప్పకుండా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అని చెప్పారు. అనీష్ మాట్లాడుతూ 'కంటెంట్‌ను నమ్మి ఈ సినిమా చేశాం. ఆనంద్ గారి సంగీతం ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణ. థియేటర్లలో ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. 'లవ్ ఓటీపీ'లో ప్రేమకథ, కుటుంబ అనుబంధాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి అని విజయ్ ఎం. రెడ్డి తెలిపారు.

దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకోవాలనుంది




సెవెన్‌హిల్స్ సతీశ్

'దర్శకుడవ్వాలనే లక్ష్యంతోనే పరిశ్రమకు వచ్చాను. తొలుత సహాయ దర్శకుడిగా కెరీర్ మొదలుపెట్టాను. ఆ తర్వాత నిర్మాతగా మారాను. మంచి విజయాలను అందుకున్నాను. ఆ అనుభవం నేర్పిన పాఠాలతో పాటు, నా గురువు వి. వి వినాయక్ గారి సూచన మేరకు త్వరలో దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను' అని నిర్మాత సెవెన్‌హిల్స్ సతీశ్ అన్నారు.

సెవెన్‌హిల్స్ ప్రొడక్షన్స్ పతాకంపై 'బట్టల రామస్వామి బయోపిక్' లాంటి పలు విజయవంతమైన చిత్రాలను ఆయన నిర్మించారు. దర్శకుడిగా తన కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టబోతున్న సందర్భంగా సతీశ్ మీడియాతో మాట్లాడారు. 'ఎవరికైనా దర్శకుడిగా తొలి చిత్రం చాలా ముఖ్యం. అందుకే పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రం చేయాలనుకుంటున్నాను. ప్రేక్షకులను మెప్పించే సినిమా చేసి, దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలనేదే నా కోరిక. 'బలగం, లిటిల్ హార్ట్స్' లాంటి చిత్రాల తరహాలో పరిమిత వ్యయంతో మంచి కంటెంట్ ఉన్న సినిమా చేస్తాను. ప్రస్తుతం స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నా. నిర్మాతగా నా సినిమాల్లో అందరూ కొత్త నటులనే తీసుకున్నాను. అలాగే దర్శకుడిగా కూడా కొత్తవాళ్లతోనే సినిమా చేస్తాను. నా స్నేహితులు ఈ సినిమాకు నిర్మాతలుగా వ్యవహరిస్తారు. నిర్మాతగానూ నా ప్రయాణం కొనసాగుతుంది. ఎడిటర్ ప్రవీణ్ పూడి, రాజశేఖర్ గడ్డం దర్శకులుగా మా బేనర్‌పై రెండు సినిమాలు నిర్మిస్తున్నాను' అని ఆయన తెలిపారు.

తెరపై గుమ్మడి నర్సయ్య జీవిత కథ



ప్రముఖ రాజకీయ నాయకుడు, కమ్యూనిస్ట్ పార్టీ నేత గుమ్మడి నర్సయ్య జీవిత కథను అదే పేరుతో తెరకు ఎక్కించనున్నారు. పేద ప్రజల గురించి ఆలోచించే రాజకీయ నాయకుడిగా నర్సయ్యకు మంచి పేరు ఉంది. కరుణాడ చక్రవర్తి శివరాజకుమార్ టైటిల్ పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని పరమేశ్వర్ హివ్రాలే దర్శకత్వంలో సురేశ్‌రెడ్డి నిర్మించనున్నారు. ఎర్ర కండువా ధరించి సైకిల్ మీద అసెంబ్లీకి నర్సయ్య వస్తున్న లుక్‌ను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ స్థాయిలో ఈ సినిమాను నిర్మించనున్నట్లు నిర్మాత సురేశ్‌రెడ్డి వెల్లడించారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సతీశ్ ముత్యాల, సంగీత దర్శకత్వం: సురేశ్ బొబ్బిలి, ఎడిటింగ్: గిడుతూరి ఫణి.

విద్యుత్తు అంతరాయాలు లేకుండా చూడండి

» డిస్కంల సీఎండీలు, జిల్లా అధికారులతో మంత్రి గొట్టిపాటి

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. వర్షాలపై గురువారం ఆయన మూడు ప్రాంతాల డిస్కంల సీఎండీలు, జిల్లాల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, ప్రజలకు సమస్యలు తలెత్తకుండా అధికారులు అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కూలిన స్తంభాల పునరుద్ధరణ ఎప్పటికప్పుడు చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు.

అమిత్ షాకు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం చంద్రబాబు ఎక్స్‌లో స్పందించారు. అమిత్‌షా ఆయురారోగ్యాలతో మరింత కాలం ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. మంత్రి లోకేశ్ కూడా అమిత్‌షాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

జగన్ నేరగాళ్లను ప్రోత్సహిస్తారు: మాణిక్యాలరావు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని కాంక్షించే కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ నేరాలు చేస్తాడు.. నేరగాళ్లను ప్రోత్సహిస్తాడని విమర్శించారు. పుట్టుకతోనే నేరస్వభావాన్ని అలవర్చుకున్నాడని, ఆయన నేర నటననే వైసీపీ నాయకులు నేర్చుకున్నారని విమర్శించారు. చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహ దహనం విషయంలో అది రుజువైందన్నారు. కందుకూరులో ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణను కుల చిచ్చుగా మార్చాలని వైసీపీ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.

ఏపీ ఆక్వా రంగానికి అంతర్జాతీయ బ్రాండింగ్: అచ్చెన్న

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా పర్యటనలో మంత్రి లోకేశ్ ఏపీ ఆక్వా రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లేలా, ఆక్వా రైతుల అభివృద్ధికి కృషి చేయడం పట్ల మంత్రి అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియా సహకారంతో ఏపీ ఆక్వా ఉత్పత్తులకు బ్రాండింగ్ వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. 'అమెరికా సుంకాల నేపథ్యంలో ఆక్వా రైతుల్ని ఆదుకునేందుకు కొత్త మార్కెట్ల అన్వేషణపై లోకేశ్ దృష్టి పెట్టడం ప్రశంసనీయం. ఏపీ సీ ఫుడ్‌కు అంతర్జాతీయ గుర్తింపు తేవాలన్న ఆయన సంకల్పం రాష్ట్రానికి మేలు చేస్తుంది. ఆక్వా రంగం అభివృద్ధితో యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయి' అని మంత్రి పేర్కొన్నారు.

లోకేశ్ కృషితో ఆక్వా రైతులకు ఊరట: సత్యనారాయణ రాజు

ఎగుమతులు లేక నష్టపోతున్న ఆక్వా రైతులకు ఊరట కలిగించేలా చేసిన ఘనత మంత్రి లోకేశ్‌కు దక్కుతుందని సీఎం కార్యక్రమాల సమన్వయకర్త సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. లోకేశ్ కృషి వల్ల ఏపీ ఆక్వా రైతులకు అంతర్జాతీయ మార్కెట్లో కొత్త అధ్యాయం ప్రారంభమైందన్నారు.

వికసిత్ భారత్ దిశగా.. వికసిత్ ఏపీ లక్ష్యంగా..

» డబుల్ ఇంజన్ సర్కార్‌తో ప్రగతి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రాల్లోని డబుల్ ఇంజన్ సర్కారుతో భారత్, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. విజయవాడలోని ఒక హోటల్లో బుధవారం బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరితో కలిసి మాధవ్ మీడియాతో మాట్లాడారు. మోదీ సారథ్యంలో దేశం.. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం.. సమగ్రాభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ శ్రేణులు కూటమితో సమన్వయం చేసుకుని పోటీకి సిద్ధపడాలని మాధవ్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో ప్రజల్ని మభ్యపెడితే.. కూటమి ప్రభుత్వం మోదీ సహకారంతో రాష్ట్ర ప్రజల రాజధాని నిర్మాణ కలను సాకారం చేస్తోందని చెప్పారు. వైసీపీ అబద్ధాలతో ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తోందని, బీజేపీ శ్రేణులు వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. సమావేశంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎంపీ పాకా సత్యనారాయణ, బీజేపీ పదాధికారులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ప్రజలు నరకం చూశారు: సత్యకుమార్

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపించి, చీకటి పాలన అందించిన జగన్... కూటమి ప్రభుత్వంలో వెలుగుల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. వైసీపీ చీకటి పాలన గురించి తలుచుకుని ప్రజలు ఇప్పటికీ వణికిపోతున్నారని అన్నారు. వైసీపీ హయాంలో ప్రతి ఇంటినీ కమ్మేసిన చీకటిని కూటమి ప్రభుత్వం తరిమేసి, వెలుగులు నింపుతుంటే.. జగన్ జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు.

రాయితీ బకాయిలు పూర్తిగా చెల్లించాల్సిందే

» దళిత పారిశ్రామికవేత్తల జేఏసీ డిమాండ్

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దళిత పారిశ్రామికవేత్తలకు రాయితీ బకాయిలను పూర్తిగా చెల్లించాల్సిందేనని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న పారిశ్రామిక ప్రోత్సాహకాలను చెల్లించాలని నిర్ణయించిన సీఎం చంద్రబాబు తొలి విడతగా రూ.1,500 కోట్లు విడుదల చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల జేఏసీ ప్రతినిధులు బుధవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్‌లో పరిశ్రమల శాఖ డైరెక్టర్ శుభం బన్సాల్‌తో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. వంద శాతం బకాయిలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం 30శాతం మాత్రమే నిధులు విడుదల చేస్తామంటే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు అనార్‌బాబు, ఈరా రాజశేఖర్, రాష్ట్ర నాయకులతో పాటు దాదాపు పది జిల్లాల నుంచి వచ్చిన 70మందికి పైగా చర్చల్లో పాల్గొన్నారు.

పత్తి అమ్మకాలకు స్లాట్ బుకింగ్: రాజశేఖర్

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ ఆదేశించారు. సీసీఐ, మార్కెటింగ్ అధికారులతో ఆయన బుధవారం సమీక్షించారు. 'పత్తి రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదై ఉండి, సీఎం యాప్ ద్వారా లాగిన్ అయి, ఆధార్ అనుసంధానంతో కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలి. ఇందుకోసం పత్తి ఉత్పత్తిదారులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలి. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ ప్రకారం రైతులు పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాలి. ఏ రైతు కూడా మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదు' అని రాజశేఖర్ సూచించారు.

సీఎస్ అధ్యక్షతన పీఎంకేఎస్‌వై రాష్ట్ర స్థాయి కమిటీ

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నదీ పరీవాహక ప్రాంత అభివృద్ధి, సమగ్ర నీటి యాజమాన్య విధానాలపై ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 60 శాతం నిధులతో చేపట్టే పనులను సమీక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి కమిటీని నియమిస్తూ జలవనరుల శాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కమిటీలో జలవనరుల శాఖ, వ్యవసాయ శాఖ, ఆర్థిక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ఉద్యానవనశాఖ కమిషనర్, భూగర్భజల శాఖ డైరెక్టర్, జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ సభ్యులుగా ఉంటారు.

ఐటీ సంస్థలకు రూ.60 కోట్ల ప్రోత్సాహకాలు

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన 500 ప్రపంచ స్థాయి ఐటీ సంస్థలకు 2025-26లో ప్రోత్సాహకాలుగా రూ.300 కోట్లు చెల్లించేందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. వీటిలో రూ.60 కోట్ల మేర ప్రోత్సాహకాలను ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) ద్వారా చెల్లించేందుకు అనుమతిస్తూ ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వులు జారీచేశారు.



విద్యారంగంపై క్వీన్స్‌ల్యాండ్ ట్రేడ్, ఇన్వెస్ట్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేశ్

భారత్‌లో పెట్టుబడులకు

ఆంధ్రా గేట్‌వే!

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. భారత కాన్సులేట్ జనరల్ (బ్రిస్బేన్) నీతూ భగోతియా, ఆస్ట్రేలియా-ఇండియా బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులు పాల్గొన్నారు. లోకేశ్ మాట్లాడుతూ.. ఇటీవల గూగుల్ సంస్థ విశాఖలో రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో ఏఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుందన్నారు. భారతదేశ చరిత్రలోనే ఇది అతిపెద్ద పెట్టుబడిగా అభివర్ణించారు. ఆర్సెలార్ మిట్టల్ రూ.1.35 లక్షల కోట్లతో అనకాపల్లి సమీపంలో దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నిర్మించబోతోందని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తల కోసం సులభతర విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. వచ్చే నెల 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించే పారిశ్రామిక భాగస్వామ్య సదస్సుకు హాజరై ఆయా విధానాలను స్వయంగా తెలుసుకోవాలని పారిశ్రామికవేత్తలను కోరారు. భారత్-ఆస్ట్రేలియా మధ్య స్నేహపూర్వక ద్వైపాక్షిక వాణిజ్యం కొనసాగుతోందన్నారు. భారత్ నుంచి ఆస్ట్రేలియాకు కీలకమైన ఎగుమతుల్లో శుద్ధి చేసిన పెట్రోలియం, ఔషధాలు, ఇంజనీరింగ్ పరికరాలు, వ్యవసాయోత్పత్తులు ఉన్నాయని.. వాటిలో రాష్ట్రం ప్రముఖ స్థానం వహిస్తోందని వివరించారు. 2022 డిసెంబరులో అమల్లోకి వచ్చిన ఆస్ట్రేలియా-భారత్ ఆర్థిక సహకారం-వాణిజ్య ఒప్పందం.. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలకు గేమ్ చేంజర్‌గా మారిదన్నారు. 2020-21లో ద్వైపాక్షిక వస్తు, వాణిజ్యం 12.2 బిలియన్ డాలర్లు కాగా.. 2024-25 నాటికి దాదాపు రెట్టింపై 24.10 బిలియన్ డాలర్లకు చేరిందని తెలిపారు.

రాష్ట్రంలో గ్రిఫిత్ వర్సిటీ ఇండియా సెంటర్ పెట్టండి

లోకేశ్ బుధవారం కూడా పలు యూనివర్సిటీలు, సంస్థల అధినేతలను కలిశారు. గ్రిఫిత్ యూనివర్సిటీ ఇండియా సెంటర్‌ను ఏపీలో నెలకొల్పాలని కోరారు. బ్రిస్బేన్‌లో గ్రిఫిత్ వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్) మార్నీ వాట్సన్‌తో సమావేశమయ్యారు. 1975లో దీనిని స్థాపించామని.. ప్రపంచ అగ్రశ్రేణి విద్యాలయాల్లో ఒకటిగా ఉందని.. సామాజిక న్యాయం, స్థిరత్వం, ఆవిష్కరణ రంగంలో పేరుగాంచిందని ఆమె తెలిపారు. పబ్లిక్ పాలసీ, సుస్థిరత, నూతన ఆవిష్కరణల రంగాల్లో తమ రాష్ట్ర యూనివర్సిటీలతో కలసి ఉమ్మడి కార్యక్రమాలను లోకేశ్ ఈ సందర్భంగా కోరారు. పరిశోధన, విద్యార్థుల మార్పిడి, అవగాహనా కార్యక్రమాల్లో కలసి పనిచేద్దామని సూచించారు. ఇందుకోసం గ్రిఫిత్ వర్సిటీ ఇండియా సెంటర్ లేదా హబ్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. సిలబస్ రూపకల్పన, నైపుణ్య ధ్రువీకరణల్లో గ్లోబల్ అకడమిక్ ప్రమాణాల కోసం రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, నైపుణ్యాభివృద్ధి సంస్థతో భాగస్వామ్యానికి ప్రతిపాదించారు. 'పునరుత్పాదక ఇంధనం, వాతావరణ స్థితిస్థాపకత, ప్రజారోగ్యం, నీటి యాజమాన్య నిర్వహణ రంగాల్లో ఉమ్మడిగా పరిశోధనలు చేద్దాం. ప్రముఖ విద్యా సంస్థల మధ్య డ్యూయల్ డిగ్రీ లేదా ట్విన్నింగ్ ప్రోగ్రాములు చేద్దాం. ఎస్ఆర్ఎం-ఏపీ, విట్-ఏపీ, ఏయూ అధ్యాపకులు, విద్యార్థుల అభివృద్ధికి ఎక్స్ఛేంజీ కార్యక్రమాలను ప్రోత్సహించాలి. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించే గ్లోబల్ పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు హాజరవ్వండి' అని వాట్సన్‌ను ఆహ్వానించారు.

రాష్ట్రంలో హైస్కూలు స్థాయి నుంచే ఏఐ పాఠ్యాంశాలు

భారత్‌లో విద్యారంగ సంస్కరణల్లో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉందని లోకేశ్ తెలిపారు. విద్యారంగంపై క్వీన్స్‌ల్యాండ్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయగా అధునాతన సాంకేతిక మార్పులకు అనుగుణంగా రాష్ట్రంలో హైస్కూలు స్థాయి నుంచే ఏఐ పాఠ్యాంశాలను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ఏఐ ల్యాబ్‌లు, రోబోటిక్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

జేమ్స్ కుక్ వర్సిటీ ప్రొఫెసర్‌తో భేటీ

ఏపీలో ఆక్వాకల్చర్ అభివృద్ధికి సహకరించాలని జేమ్స్ కుక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ క్యాల్ జెంజర్‌ను లోకేశ్ కోరారు. రొయ్యలు, చేపల పెంపకం సామర్థ్యాన్ని పెంచేందుకు సీఎస్‌టీఎఫ్ఏ ద్వారా ఆక్వాకల్చర్ జెనెటిక్స్ నైపుణ్యాలను అందించాలని కోరారు. బ్లాక్ టైగర్ రొయ్యలతో భారత్‌లో ప్రధానంగా ఉత్పత్తి చేసే ఆక్వా రకాల్లో వ్యాధి నిరోధిక, వృద్ధి రేటు కోసం జన్యుపరమైన మెరుగుదలకు కృషి చేయాలని..వాటర్ రీసైక్లింగ్, ఫీడ్ ఆప్టిమైజేషన్‌ను ప్రోత్సహించాలని.. రాష్ట్ర ఆక్వా రైతుల కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

బ్రిస్బేన్ వేదికగా.. జగన్ విధ్వంసం బహిర్గతం!

మా భూములు లాక్కున్నారు

» న్యాయపరమైన చిక్కుల్లో పడేశారు

» ఈ వేధింపులతో నా తండ్రిని కోల్పోయాను

» ఇప్పుడు ఏపీలో పెట్టుబడి పెట్టడం సాధ్యమా?

» పారిశ్రామికవేత్త శ్రావణ్‌కుమార్ ఆవేదన

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ వేదికగా మాజీ సీఎం జగన్ పాలనా విధ్వంసం బహిర్గతమైంది. మంత్రి లోకేశ్ బుధవారం పాల్గొన్న బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో శ్రావణ్‌కుమార్ అనే పారిశ్రామికవేత్త జగన్ హయాంలో తాము పడిన బాధలు వెల్లడించారు. తమ భూములు లాక్కున్నారని.. న్యాయపరమైన చిక్కులు కల్పించారని తెలిపారు. రాజకీయంగానూ దాడి చేశారని.. గత పాలకుల వేధింపుల కారణంగా చివరకు తన తండ్రిని కూడా కోల్పోయానని వాపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో మళ్లీ పెట్టుబడులు పెట్టడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఎదురైన ఇబ్బందులను ఆయన చెబుతున్నప్పుడు సభావేదిక నిశ్శబ్దంగా మారిపోయింది. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. జగన్ ఇలాంటి విధ్వంస పాలన సాగించినందునే గత ఎన్నికల్లో 94 శాతం స్ట్రయిక్ రేట్‌తో కూటమి అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇప్పుడు పారిశ్రామిక ప్రోత్సాహక విధానం అమల్లో ఉందని, పెట్టుబడులకు స్నేహపూర్వక ఆహ్వానం పలుకుతున్నామని చెప్పారు. విశాఖ భాగస్వామ్య సదస్సుకు రావాలని శ్రావణ్‌కుమార్ సహా పెట్టుబడిదారులను ఆహ్వానించారు.

ఏపీని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేలా డిజైన్లు ఇవ్వండి

ఆంధ్రప్రదేశ్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేలా డిజైన్లు ఇవ్వాలని పాపులస్ సంస్థకు లోకేశ్ విజ్ఞప్తి చేశారు. బ్రిస్బేన్‌లో ఆ సంస్థ సీనియర్ ప్రధాన ఆర్కిటెక్ట్ సీన్ గాలఘెర్, ఆసియా-పసిఫిక్ బిజినెస్ డెవలప్‌మెంట్, బిడ్స్ అండ్ కమ్యూనికేషన్ హెడ్ ఎలిజబెత్ డిసిల్వాలతో ఆయన సమావేశమయ్యారు. ప్రపంచంలో అత్యంత ప్రసిద్ధి చెందిన స్టేడియాలకు ఈ సంస్థ వినూత్నమైన డిజైన్లు అందిస్తోంది. రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేలా స్టేడియాల నిర్మాణానికి సహకారం అందించాలని పాపులస్‌ను లోకేశ్ కోరారు.



జేమ్స్ కుక్ వర్సిటీ ప్రొఫెసర్ క్యాల్ జెంజర్‌తో చర్చిస్తున్న మంత్రి లోకేశ్



మెల్బోర్న్‌లో లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ప్రవాసాంధ్రులు



ఈఎన్‌సీ కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్ల నిరసన

బిల్లుల కోసం రోడ్డెక్కిన కాంట్రాక్టర్లు

» ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ చాంబర్‌లో బైఠాయింపు

» ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం ఎదుట 26 జిల్లాల కాంట్రాక్టర్ల మౌన నిరాహార దీక్ష

విజయవాడ సిటీ/విజయవాడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఆందోళన బాట పట్టారు. బుధవారం విజయవాడలోని ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. కొవిడ్ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామాల్లో 170 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ) నిర్మించిన కాంట్రాక్టర్లు ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ ఎన్.మాధవి సుకన్య చాంబర్ ముందు కొద్దిసేపు ప్లకార్డులు ప్రదర్శించారు. సీఈ చాంబర్‌లోకి ప్రవేశించి ఆమెకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం అక్కడే నేలపై కూర్చుని బిల్లులు చెల్లించాలని, లేదంటే ఆత్మహత్యలు చేసుకుంటామని ప్లకార్డులు ప్రదర్శించారు. స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (ఎస్ఏబీసీఏ) పిలుపు మేరకు 26 జిల్లాల నుంచి 74 మంది కాంట్రాక్టర్లు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. పోలీసుల రంగప్రవేశంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. రవాణా, రోడ్లు, భవనాల ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు దగ్గరకు తమను తీసుకెళ్లాలని వారు సీఈని కోరడంతో ఐదుగురు కాంట్రాక్టర్లను ఆమె సచివాలయానికి తీసుకెళ్లారు. నెల రోజుల్లో బిల్లుల చెల్లింపునకు కృష్ణబాబు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కాంట్రాక్టర్ల పొట్ట కొడతారా?

జల్ జీవన్ మిషన్(జేజేఎం) పనుల బిల్లుల చెల్లింపుల్లో కార్పొరేట్ కంపెనీలపై వల్లమాలిన ప్రేమతో చిన్న కాంట్రాక్టర్ల పొట్ట కొడతారా అంటూ గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నవ్యాంధ్ర ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ నేతృత్వంలో 26 జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన కాంట్రాక్టర్లు గొల్లపూడి ఎన్టీఆర్ సెంటర్‌కు చేరుకున్నారు. తమ సమస్యలపై ఎన్టీఆర్ విగ్రహానికి మెమోరాండం ఇచ్చి, కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. ఆ తర్వాత ర్యాలీగా ఈఎన్‌సీ కార్యాలయానికి చేరుకొని, మౌన నిరాహారదీక్ష చేపట్టారు. బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చే వరకు దీక్షను కొనసాగించాలని నిర్ణయించారు. గత రెండు పర్యాయాలు ప్రభుత్వం విడుదల చేసిన నిధులను బడా కాంట్రాక్టర్లకే చెల్లించారు. రెండో దఫా 15శాతం మాత్రమే చిన్న కాంట్రాక్టర్లకు చెల్లించారు. గత నెలలో ప్రభుత్వం రూ.150 కోట్ల చెల్లింపులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాటిని కూడా రెండు పెద్ద సంస్థలకు చెల్లించేందుకు లోపాయికారీగా అధికారులు ప్రయత్నిస్తున్నారన్న సమాచారంతో చిన్న కాంట్రాక్టర్లలో ఆందోళన నెలకొంది. దీంతో ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమయ్యారు. జేజేఎం బిల్లుల చెల్లింపు విషయంలో పనులు చేపట్టిన తేదీల ప్రకారం కాకుండా ఉన్నతాధికారులు ఇష్టానుసారం చెల్లిస్తున్నారని నవ్యాంధ్ర ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అగ్ర నాయకుడు వీబీ శ్రీనివాస్ ఆరోపించారు.

'వైద్యం బంద్'పై వీడని ప్రతిష్టంభన

ఆందోళన బాటలో ఆస్పత్రుల యాజమాన్యం

» నేడు విజయవాడ ధర్నా చౌక్‌లో 'ఆషా' ఆందోళనలు

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నెట్‌వర్క్ ఆస్పత్రులు 'వైద్యం బంద్'పై ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి రూ.250 కోట్లు విడుదల చేసినప్పటికీ.. నెట్‌వర్క్ ఆస్పత్రులు 'వైద్యం బంద్' నిర్ణయంపై వెనక్కు తగ్గలేదు. రెండు రోజుల నుంచి ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) తీవ్రంగా ఒత్తిడి చేయడంతో ఆస్పత్రులన్నింటిలోనూ వైద్య సేవలు నిలిచిపోయాయి. మరోవైపు నిన్నటివరకూ నిరసనకే పరిమితమైన ఆషా అనూహ్యంగా ఆందోళన బాటపట్టింది. గురువారం ఉదయం నుంచి విజయవాడ ధర్నా చౌక్‌లో ఆందోళన చేయాలని అసోసియేషన్ పిలుపునిచ్చింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు విజయవాడ చేరుకుని గురువారం ఆందోళనలో పాల్గొననున్నాయి. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ 'ఆషా'కు రూ.2700కోట్ల బకాయిలు పెట్టింది. ఇందులో రూ.650 కోట్ల వరకూ సీఎఫ్ఎంఎస్‌కు వెళ్లాయి. కనీసం ఈ బిల్లులైనా విడుదల చేయాలని ఆషా ప్రభుత్వాన్ని విన్నవిస్తూ వస్తోంది. ఆషాతో ఆరోగ్యశాఖ, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ అధికారులు చర్చలు జరుపుతున్నా ఫలితం కనిపించలేదు. కాగా, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎక్కడా ఒక్క కేసు కూడా రిజిస్టర్ కావడం లేదు. యాక్సిడెంట్ కేసులు, గర్భిణీలు సొంత డబ్బులతో వైద్యం చేయించుకుంటున్నారు. మరోవైపు ఆషాకు తోడు ఈ నెల 27 తర్వాత ప్రైవేటు మెడికల్ కాలేజీలు కూడా వైద్యం బంద్ చేయాలని నిర్ణయించాయి.

రూ.250 కోట్లు విడుదల

నెట్‌వర్క్ ఆస్పత్రులు 'వైద్యం బంద్'ను ఉధృతం చేయడంతో కూటమి ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లించాల్సిన బకాయిల్లో రూ.250 కోట్లను బుధవారం రాత్రి విడుదల చేసింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో చర్చించడంతో నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. కాగా, ప్రస్తుతానికి రూ.250 కోట్లు విడుదల చేశామని, త్వరలోనే మరో రూ.250 కోట్లు విడుదల చేస్తామని వైద్యఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు.

జైల్లో ఆ రోజు ఏం జరిగింది?



» దస్తగిరికి బెదిరింపుల ఘటనపై.. బీటెక్ రవిని ఆరాతీసిన విచారణ కమిటీ

» దస్తగిరి, ఆయన భార్య నుంచీ వివరాల సేకరణ

కడప క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వివేకా హత్యకేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని జైల్లో బెదిరించిన వ్యవహారంపై విచారణకు ఏర్పాటైన ప్రత్యేక కమిటీ బుధవారం ఆయనతోపాటు ఆయన భార్యను విచారించింది. అలాగే పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిని పిలిచి ఆ ఘటనపై ఆరా తీసింది. దస్తగిరి మరోకేసులో కడప సెంట్రల్ జైల్లో 2023లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆ సమయంలో మెడికల్ క్యాంపు పేరుతో ఈ కేసులో ఏ-5 దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్యరెడ్డి జైలులోకి వచ్చి తనను బెదిరించారని, రూ.20 కోట్లు డబ్బులు ఆఫర్ చేశారని అప్పట్లో దస్తగిరి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవహారంపై మరోసారి దస్తగిరి పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై నిగ్గు తేల్చడానికి కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, కడప జిల్లా డీఎంహెచ్‌వో నాగరాజు, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, జైలు అధికారి ఇర్ఫాన్‌తో రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఈ కమిటీ జైలు అధికారులతో పాటు అప్పుడు పనిచేసిన డాక్టర్లను విచారించింది. ఈ నేపథ్యంలో బుధవారం కమిటీ బృందం టీడీపీ నేత బీటెక్ రవితోపాటు దస్తగిరిని, ఆయన భార్య షబానాను సెంట్రల్‌జైలులోని తన క్యాంపునకు పిలిపించి విచారించింది. బీటెక్ రవిని 40 నిమిషాల పాటు విచారించి ఆయన స్టేట్‌మెంటును రికార్డు చేసింది. ఈ ఘటన జరిగిన సమయంలో వైసీపీ ప్రభుత్వం పెట్టించిన తప్పుడు కేసులో అరెస్టు అయి తాను కడప సెంట్రల్ జైలులో ఉన్నానని ఆయన తెలిపారు. దస్తగిరిని ఉంచిన బ్యారక్‌కు డాక్టర్ చైతన్యరెడ్డి వెళ్లడం తాను కళ్లారా చూశానని పేర్కొన్నారు. అనంతరం ఆయన జైలు వెలుపల ఆ ఘటనపై మరింత వివరంగా మీడియాతో మాట్లాడారు. "2023 నవంబరు 14 నుంచి 29 వరకు నేను జ్యుడిషియల్ రిమాండులో ఉన్నాను. ఆ నెల 28వ తేదీన వివేకా హత్యకేసులో నిందితుడైన శంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్యరెడ్డి జైలుకు వచ్చారు. ఆ రోజు మధ్యాహ్నం సమయంలో అప్పటి జైలు వైద్యురాలు పుష్పలత, చైతన్యరెడ్డి, జైలు సిబ్బంది దస్తగిరి బ్యారక్ వెళ్లడం గమనించాను. చైతన్యరెడ్డి తెలుసు కాబట్టి బ్యారక్ వైపు వెళుతున్న ఆయనను గుర్తించాను" అని బీటెక్ రవి తెలిపారు. కాగా.. విచారణకు హాజరైన దస్తగిరి, అతడి భార్య మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు.

జగన్ తప్పుడు నంబర్ ఇచ్చారు

(మొదటి పేజీ తరువాయి)

పట్టించారని తెలిపింది. ఇకపై ఆయన విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వొద్దని నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టును అభ్యర్థించింది. అయితే జగన్ అసలు ఫోనే వాడరని.. గతంలో విదేశాలకు వెళ్లినప్పుడు కూడా తన సిబ్బంది ఫోన్ నంబర్లను ఇచ్చారని ఆయన తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. బుధవారం ఇరు పక్షాల వాదనలు ముగియడంతో.. తీర్పును 28వ తేదీన వెల్లడిస్తామని కోర్టు తెలిపింది. ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ మధ్య 15 రోజుల పాటు జగన్ లండన్‌లోని తన కుమార్తె వద్దకు వెళ్లేందుకు షరతులతో కూడిన అనుమతిని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చింది. పర్యటన పూర్తి వివరాలతో పాటు ఆయన ఉపయోగించే ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ, అక్కడి బసకు సంబంధించిన సమాచారం సమర్పించాలని.. పర్యటన నుంచి తిరిగి వచ్చాక ప్రత్యక్షంగా కోర్టులో హాజరు కావాలని స్పష్టంచేసింది. ఈ నెల 11వ తేదీన లండన్ వెళ్లిన జగన్‌కు.. సీబీఐ అధికారులు మూడుసార్లు ఫోన్ చేయగా ఆ నంబర్ పని చేయలేదు. దీంతో లండన్ పర్యటనకు వెళ్లేందుకు కోర్టు విధించిన బెయిల్ షరతులను జగన్ ఉల్లంఘించారని సీబీఐ గత వారం పిటిషన్ దాఖలు చేసింది. దానిపై బుధవారం ప్రత్యేక కోర్టు న్యాయాధికారి టి.రఘురాం విచారణ జరిపారు. సీబీఐ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. తప్పుడు నంబర్ ఇచ్చి కోర్టును జగన్ తప్పుదోవ పట్టించారని.. పర్యటన కోసం ఇచ్చిన అనుమతిని తక్షణమే రద్దు చేయడంతో పాటు మరోసారి విదేశాలకు వెళ్లేందుకు ఆయనకు పర్మిషన్ ఇవ్వొద్దని గట్టిగా కోరారు. జగన్ తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.. అసలు ఆయన ఫోనే ఉపయోగించరని, గతంలో విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు కూడా తన వ్యక్తిగత సహాయకులు, సిబ్బంది ఫోన్ నంబర్లే కోర్టుకు సమర్పించారని తెలిపారు. మరో మూణ్రోజులు అనుమతి ఉన్నా ముందుగానే పర్యటన ముగించుకుని జగన్ స్వదేశానికి తిరిగొచ్చేశారని తెలిపారు.

రాకియా పిటిషన్‌పై నిమ్మగడ్డకు కోర్టు నోటీసులు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వాన్‌పిక్ వ్యవహారంలో నిమ్మగడ్డ ప్రసాద్ రూ.600 కోట్లు చెల్లించేలా ఆదేశించాలంటూ రాకియా దాఖలు చేసిన పిటిషన్‌పై హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఆయనకు నోటీసులు జారీచేసింది. ఈ వ్యవహారంలో తమకు రూ.600 కోట్లు చెల్లించాలని రస్‌అల్‌ఖైమా కోర్టు గతంలో ఇచ్చిన తీర్పు అమలు కోసం రాకియా సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై త్వరగా తేల్చాలని ఇటీవల తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో సివిల్ కోర్టు విచారణ చేపట్టింది. బుధవారం నిమ్మగడ్డకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది.

హై స్పీడ్... ఏపీ!

రాష్ట్రానికి 2 ఎలివేటెడ్ రైల్ కారిడార్లు

వ్యయం 5.42 లక్షల కోట్లు.. వేగం 350 కి.మీ.



పనుల నమూనా చిత్రాలు

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మీదుగా మరో భారీ రైల్వే ప్రాజెక్టు నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే (ఎస్సీఆర్) ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మెజార్టీ భాగం రాష్ట్రం గుండా వెళ్లే విధంగా రెండు హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్లకు రూట్ మ్యాప్ సిద్ధం చేసింది. ఎస్సీఆర్ ప్రతిపాదనల మేరకు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రైల్వే లైన్లను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌ను 605 కిలోమీటర్లు, హైదరాబాద్-చెన్నై కారిడార్‌ను 760 కిలోమీటర్ల దూరం నిర్మించనున్నారు. రెండు కలిపి 1,365 కిలోమీటర్ల పొడవు గల హై స్పీడ్ కారిడార్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ రెండు కారిడార్లు 767 కిలోమీటర్ల మేర ఆంధ్రప్రదేశ్ భూభాగంలో ఏర్పాటు కానున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులకు ఎస్సీఆర్ రూ.5.42 లక్షల కోట్ల వ్యయంతో అంచనాలు సిద్ధం చేసింది. హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌కు రూ.2.38 లక్షల కోట్లు, హైదరాబాద్-చెన్నై కారిడార్‌కు రూ.3.04 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌కు సంబంధించి ఏపీలో 263 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మాణం చేపడతారు. 6 ప్రత్యేక స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే హైదరాబాద్-చెన్నై కారిడార్‌కు సంబంధించి ఏపీలో 9 ప్రత్యేక స్టేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు 504 కి.మీ. రైల్వే లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ రెండు కారిడార్లలో ముఖ్యమైన వర్కులు ఏపీలోనే జరగనున్నాయి.

హైదరాబాద్-బెంగళూరు కారిడార్..

హైదరాబాద్-బెంగళూరు హై స్పీడ్ కారిడార్ రాష్ట్రంలో నాలుగు జిల్లాల మీదుగా ఏర్పాటు కానుంది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల గుండా కారిడార్ నిర్మాణం జరగనుంది. కర్నూలులో 46.56 కి.మీ. మేర ఏర్పాటు కానున్న కారిడార్‌కు 139.68 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. నంద్యాలలో 37.3 కి.మీ. మేర నిర్మించనున్న కారిడార్‌కు 111.9 హెక్టార్ల సాధారణ భూమితో పాటు 1.29 హెక్టార్ల అటవీ భూమిని కేటాయించాల్సి ఉంది. అనంతపురంలో అత్యధికంగా 86.6 కి.మీ పొడవున కారిడార్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు 259.8 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. శ్రీ సత్యసాయి జిల్లాలో 79.08 కి.మీ. పొడవున ఏర్పాటు కానున్న కారిడార్‌కు రూ.237.24 హెక్టార్ల భూమితో పాటు 2.92 హెక్టార్ల అటవీ భూమిని కేటాయించాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఈ మేరకు భూ కేటాయింపుల కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక లేఖను కూడా సమర్పించింది.

హైదరాబాద్-చెన్నై కారిడార్..

హైదరాబాద్-చెన్నై కారిడార్ ఏపీలో ఏడు జిల్లాల మీదుగా వెళ్లనుంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల మీదుగా కారిడార్ నిర్మాణం జరగనుంది. పల్నాడు జిల్లాలో 81 కి.మీ. రైల్వే లైన్ నిర్మాణానికి 243 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. గుంటూరు జిల్లాలో 66.45 కి.మీ. మేర నిర్మాణానికి 199.35 హెక్టార్ల భూమి, బాపట్ల జిల్లాలో 43.21 కి.మీ. నిర్మాణానికి 129.63 హెక్టార్ల భూమి, ప్రకాశం జిల్లాలో 58.37 కి.మీ. నిర్మాణానికి 175.11 హెక్టార్ల భూమి, నెల్లూరు జిల్లాలో 116.79 కి.మీ. నిర్మాణానికి 350.37 హెక్టార్ల భూమి, తిరుపతి జిల్లాలో 130.58 కి.మీ నిర్మాణానికి రూ.391.74 హెక్టార్ల భూమి, చిత్తూరు జిల్లాలో 8.17 కి.మీ. నిర్మాణానికి 24.51 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. వీటితో పాటు పల్నాడులో 21.39 హెక్టార్ల అటవీ భూమి, నెల్లూరులో 40.8 హెక్టార్లు, తిరుపతిలో 20.44 హెక్టార్లు, చిత్తూరులో 7.68 హెక్టార్ల అటవీ భూమి కూడా కారిడార్ల కోసం కేటాయించాల్సిన అవసరం ఉందని ఎస్సీఆర్ ఏపీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. కాగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ఈ కారిడార్‌కు కలిపేలా లైన్ ఏర్పాటు అంశం కూడా పరిశీలనలో ఉంది.

ఏపీలో 15 స్టేషన్లు

రెండు హై స్పీడ్ కారిడార్ల నిర్మాణంలో భాగంగా ఏపీలో 15 స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌కు సంబంధించి కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, దుద్దేబండ, హిందూపురం వద్ద ప్రత్యేక స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్-చెన్నై కారిడార్‌కు సంబంధించి దాచేపల్లి, నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతిలో ప్రత్యేక స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. ఏపీకి ఈ రెండు రైల్వే కారిడార్లు ఎంతో ప్రయోజనం కానున్నాయి. దక్షిణ మధ్య రైల్వే ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణ పనులను అత్యంత వేగంగా ప్రారంభించేందుకు సిద్ధం అవుతోంది. టైమ్ లైన్‌కు అనుగుణంగా లొకేషన్లలో సర్వేలు పూర్తి చేయాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వాల సహకారం పూర్తిస్థాయిలో అందించాలని రైల్వే శాఖ ఉన్నతాధికారులు కోరుతున్నారు.

మెరిట్‌కు సీటొస్తే... వైసీపీకెందుకు కడుపు మంట..!

పీపీపీలో ఆసుపత్రుల్లో 70 శాతం బెడ్లు ఫ్రీ

- ఓపీ, డయాగ్నోస్టిక్స్, మందులు ఉచితమే
- ప్రభుత్వ సంక్షేమంపై 75.1% సంతృప్తి: మంత్రి కొలుసు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): 'కొత్త వైద్య కళాశాలల్లో 35 శాతం సీట్లు మాత్రమే రాష్ట్రంలోని మెరిట్ విద్యార్థులకు దక్కేలా గత వైసీపీ ప్రభుత్వ విధానం ఉంది. దాన్ని సవరించి కూటమి ప్రభుత్వం 50 శాతం సీట్లు మెరిట్ విద్యార్థులకు దక్కేలా నిర్ణయం తీసుకుంటే వైసీపీకి ఎందుకు కడుపు మంట? అభ్యంతరం ఏమిటి?' అని మంత్రి కొలుసు పార్థసారథి మండిపడ్డారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మెడికల్ కళాశాలలకు పీపీపీ విధానం అమలుపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. 'పీపీపీ విధానంలో ఆసుపత్రుల్లో 70శాతం బెడ్స్ ఫ్రీగా ఇస్తారు. కాలేజీలను ప్రైవేటుకు ధారాదత్తం చేయడం లేదు. 30ఏళ్ల తర్వాత కళాశాలలను ప్రభుత్వానికి అప్పగిస్తారు. గత ప్రభుత్వంలో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాథ్ ల్యాబ్‌ను ప్రైవేటుకు ఎందుకు అప్పగించారు? బోగాపురం, బందర్ పోర్టులను పీపీపీ విధానంలో ఇవ్వలేదా? పేద ప్రజలకు, మెరిట్ విద్యార్థులకు మంచి జరుగుతుంటే వైసీపీకి కడుపుమంటగా ఉంది. పీపీపీతో ఈ కళాశాలల్లో ఓపీ, మందులు, డయాగ్నోస్టిక్ తదితర సేవలన్నీ ఉచితంగా జరుగుతాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై 75.1 శాతం ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని సర్వేలో తేలింది. మిగిలిన 25 శాతం అసంతృప్తికి కారణాలు తెలుసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టనున్నాం. డ్రోన్ పాలసీ రూపొందించిన తర్వాత రాష్ట్రంలో 2,10,047 గంటలకుపైగా డ్రోన్లను వినియోగించాం' అని మంత్రి పేర్కొన్నారు. విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ... ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భీమవరం డీఎస్పీ తీరుపై నివేదిక కోరడంలో తప్పు లేదని అన్నారు.

700 ఎకరాల వక్ఫ్ భూమిని స్వాధీనం చేసుకున్నాం

- రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆక్రమణలకు గురైన 700 ఎకరాల వక్ఫ్ భూమిని స్వాధీనం చేసుకున్నామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. విశాఖపట్నంలోని ఎన్టీపీసీలో 319 ఎకరాల వక్ఫ్ భూమి ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. రాష్ట్రంలోని 32 వక్ఫ్ సంస్థల నూతన మేనేజింగ్ కమిటీలు, ముతవల్లీలతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కర్నూలులో వక్ఫ్ ఆస్తి అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో 500 మంది ప్రతిభావంతులైన ముస్లిం విద్యార్థులను టాలెంట్ టెస్ట్ ద్వారా ఎంపిక చేసి ఉచిత ఇంటర్మీడియట్ విద్య అందించబోతున్నామని తెలిపారు.

నవంబరు 26న స్టూడెంట్ అసెంబ్లీ

- మార్గదర్శకాలు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమం నిర్వహణకు సన్నాహాలు ప్రారంభించింది. స్టూడెంట్ అసెంబ్లీ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. విద్యార్థుల్లో రాజకీయ చైతన్యం, ప్రభుత్వ విధానాల పట్ల అవగాహన కోసం విద్యార్థులతో అసెంబ్లీ నిర్వహిస్తామని మంత్రి లోకేశ్ గతంలోనే ప్రకటించారు. అందుకు అనుగుణంగా రాజ్యాంగ దినోత్సవం... నవంబరు 26న అమరావతి అసెంబ్లీ హాలులోనే స్టూడెంట్ అసెంబ్లీ నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. పాఠశాల, మండల, నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించి నియోజకవర్గానికి ఒకరు చొప్పున 175 మందిని ఎంపిక చేస్తారు. వారికి శిక్షణ ఇచ్చి అమరావతిలో ఒక రోజు అసెంబ్లీ నిర్వహిస్తారు. వివిధ అంశాలపై విద్యార్థులు ఎమ్మెల్యేల తరహాలో అసెంబ్లీలో చర్చిస్తారు.

పోటీల తేదీలు ఇవే... ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ మేనేజ్‌మెంట్ల పాఠశాలల్లో చదివే 8, 9, 10తరగతుల విద్యార్థులను ఎంపిక చేస్తారు. పాఠశాల స్థాయిలో వ్యాసాలు, ఉపన్యాసం, క్విజ్‌ల ద్వారా పోటీలు నిర్వహిస్తారు. ఈ నెల 24, 25 తేదీల్లో మండల స్థాయిలో, 29, 30 తేదీల్లో నియోజకవర్గ స్థాయిలో పోటీలు ఉంటాయి. రాష్ట్రస్థాయికి నియోజకవర్గానికి ఒకరిని ఎంపిక చేస్తారు. అసెంబ్లీ నియమావళిపై 25న విద్యార్థులకు శిక్షణనిచ్చి, 26న అసెంబ్లీ నిర్వహిస్తారు.

ఈ అంశాలపైనే పోటీలు...

పాఠశాల స్థాయిలో పోటీలు స్థానిక స్వీయ పరిపాలన, ఇష్టమైన స్వాతంత్ర్య సమరయోధుడు, స్వాతంత్రోద్యమంపై ఉంటాయి. మండల స్థాయిలో పౌర హక్కులు - విధులు, మానవ అభివృద్ధికి చట్టాల రూపకల్పన - అమలు, భారత స్వాతంత్ర్య పోరాటం అంశాలపై పోటీలు నిర్వహిస్తారు. నియోజకవర్గ స్థాయిలో రాజ్యాంగ రూపకల్పన నేపథ్యం, వికసిత్ ఆంధ్రప్రదేశ్ ద్వారా దేశాభివృద్ధి, భారత రాజ్యాంగంపై పోటీలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు. రాజ్యాంగ విలువలపై అవగాహన పెంపొందించడం, ప్రజాస్వామ్య పనితీరును తెలుసుకోవడం, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంచడం, అనుభవపూర్వకంగా నేర్చుకోవడం ద్వారా పౌర విద్యను బలోపేతం చేయడం స్టూడెంట్ అసెంబ్లీ ముఖ్య లక్ష్యాలు.

డీఏతో కలిపి వేతనాల బిల్లులు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డీఏ చెల్లింపులు ప్రకటించకముందే అక్టోబరు నెలకు సంబంధించి ఆమోదించిన వేతనాలు, పెన్షన్ల బిల్లులను రద్దు చేయాలని డీటీఏ, పీఏవో అధికారులకు ఆర్థికశాఖ బుధవారం ఆదేశాలిచ్చింది. ఈ వేతనాలు, పెన్షన్ల బిల్లులకు ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం డీఏ మొత్తం కలిపి తిరిగి ట్రెజరీకి సమర్పించాలని సూచించింది.

అగ్రి కోర్సుల్లో వెబ్ ఆప్షన్లు ప్రారంభం

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల్లో 2025-26లో బైపీసీ విభాగంలో బీఎస్సీ- అగ్రికల్చర్, బీటెక్- ఫుడ్ టెక్నాలజీలో ప్రవేశానికి రెండో దశ, అగ్రిసెట్-2025 ద్వారా డిప్లొమా విద్యార్థులకు బీఎస్సీ- అగ్రికల్చర్‌లో ప్రవేశానికి మొదటి దశ ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్లు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 24 వరకు ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్లు జరుగుతాయని రిజిస్ట్రార్ ఎంవీ రమణ తెలిపారు.


ప్రముఖ రియాల్టీ సంస్థ శోభా గ్రూప్ ఫౌండర్ చైర్మన్ మీనన్‌తో చర్చలు జరుపుతున్న సీఎం చంద్రబాబు


దుబాయ్‌లోని భారత కాన్సుల్ జనరల్ సతీశ్ కుమార్ శివన్, అబూధాబీలోని డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్నాథ్‌లతో సమావేశమైన సీఎం చంద్రబాబు

100 కోట్లతో లైబ్రరీ

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామి కావాలని సీఎం కోరారు. గ్రీన్ ఎనర్జీకి ఏపీని చిరునామాగా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని... మౌలిక సదుపాయాల కల్పనపైనా భారీగా ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. విశాఖ సహా రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగంలోనూ అపారమైన అవకాశాలు ఉన్నాయంటూ మీనన్‌ను ఆహ్వానించారు. శోభా గ్రూప్ తమ ఆదాయంలో 50 శాతాన్ని దానధర్మాలకు ఉపయోగించడాన్ని అభినందించారు. తాము ఏపీలో పేదరిక నిర్మూలన లక్ష్యంతో పీ4 విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. తమ సంస్థ దుబాయ్‌తోపాటు ఒమాన్, బహ్రెయిన్, ఖతార్, బ్రూనై దేశాల్లో ప్రాజెక్టులు నిర్వహిస్తోందని.. భారత్‌లో 14 రాష్ట్రాల్లోని 27 నగరాల్లో ప్రాజెక్టులు చేపట్టిందని రవి మీనన్ చెప్పారు. విశాఖలో నవంబరు 14, 15 తేదీల్లో నిర్వహించే పెట్టుబడుల సదస్సులో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలతో భేటీల్లో సీఎం ఆహ్వానించారు. విశాఖలో గూగుల్ పెట్టుబడులపైనా చర్చించారు.

లాజిస్టిక్స్ రంగంలో పెట్టుబడులు పెడతాం

షరాఫ్ గ్రూప్ వైస్ చైర్మన్, షరాఫ్ డీజీ సంస్థ వ్యవస్థాపకుడు షరాఫుద్దీన్ షరాఫ్‌తో సీఎం భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. లాజిస్టిక్స్ ప్రాజెక్టుల ఏర్పాటుపై ప్రధానంగా చర్చ జరిగింది. ఈ గ్రూప్ ఇప్పటికే భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో లాజిస్టిక్స్ పార్కులను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో.. ఏపీ చేపట్టిన పారిశ్రామిక కారిడార్లలో ఆధునిక లాజిస్టిక్స్ పార్కులు, గిడ్డంగులు స్థాపించడానికి రాష్ట్రప్రభుత్వానికి సహకరించాలని ఆహ్వానించారు. షరాఫ్ గ్రూప్ ప్రతినిధులుస్పందిస్తూ.. తమ అనుబంధ సంస్థ అయిన హింద్ టెర్మినల్స్ ప్రైవేటు లిమిటెడ్ ద్వారా లాజిస్టిక్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు, గిడ్డంగుల ఏర్పాటుకు ఆసక్తి వ్యక్తంచేశారు. రైల్వే, పోర్టు అనుసంధానం ఉన్న ప్రాంతాన్ని గుర్తించాలని సీఎంను కోరారు.

షిప్ బిల్డింగ్ యూనిట్‌పై ట్రాన్స్‌వరల్డ్ పరిశీలన

ట్రాన్స్‌వరల్డ్ గ్రూప్ చైర్మన్ రమేశ్ ఎస్ రామకృష్ణన్, బుర్జిల్ హెల్త్ కేర్ హోల్డింగ్స్ చైర్మన్ షంషీర్ వయాలిల్‌తోనూ చంద్రబాబు సమావేశమయ్యారు. దుగరాజపట్నం పోర్టులో షిప్ బిల్డింగ్ యూనిట్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. సీఎం ఆహ్వానంపై ట్రాన్స్‌వరల్డ్ సానుకూలత వ్యక్తంచేసింది. తిరుపతిలో స్పెషల్ క్యాన్సర్ సెంటర్ నిర్మాణం చేపడతామని బుర్జిల్ హెల్త్‌కేర్ హోల్డింగ్స్ ప్రతినిధులు తెలిపారు. యూఏఈ రాజధాని అబూ ధాబీలో అతిపెద్ద క్యాన్సర్ ఆసుపత్రిని ఈ సంస్థ నిర్వహిస్తోంది.

తెలుగు ప్రజల ఘనస్వాగతం..

అంతకుముందు.. దుబాయ్ చేరుకున్న సీఎంకు స్థానిక తెలుగు ప్రజలు ఘనస్వాగతం పలికారు. విమానాశ్రయంలో భారతీయ కాన్సుల్ జనరల్ సతీష్ కుమార్ శివన్, టీడీపీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ, దుబాయ్ శాఖ అధ్యక్షుడు విశ్వేశరరావు, ముక్కు తులసి కుమార్, తెలుగు సంఘం అధ్యక్షుడు మసీయోద్దీన్, అధికారులు స్వాగతం పలికారు. సీఎంకు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో ప్రవాసాంధ్ర మహిళలు కూడా చేరుకోవడంతో ఒకింత ఇబ్బంది ఎదురయింది. అనంతరం సతీశ్‌కుమార్ శివన్‌తో, అబూ ధాబీ ఇండియన్ ఎంబసీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్‌నాథ్‌తో సీఎం భేటీ అయ్యారు. ఏపీ-యూఏఈ నడుమ పారిశ్రామిక బంధం బలపడేలా సహకరించాలని కోరారు. వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఏపీలో పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. యూఏఈలోని వివిధ దేశాలకు చెందిన సావరిన్ ఫండ్స్ నుంచి ఏపీలో పెట్టుబడులకు సహకరించాలని కోరారు. ప్రధాని మోదీ చొరవ వల్లే భారత్‌లో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. భారతదేశ బ్రాండ్‌ను ఆయన ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. భారత్-యూఏఈ దేశాల మధ్య వాణిజ్యం-పెట్టుబడులు పెరగడానికి ఆయన కృషే కారణమని చెప్పారు. యూఏఈలో ఉన్న తెలుగు వారికి ఇండియన్ ఎంబసీ సహకారం అందించే అంశంపైనా చర్చించారు. ట్రేడ్-టెక్నాలజీలో భారత్‌దేశానికి యూఏఈ భాగస్వామిగా ఉందని శివన్ చెప్పారు. విద్య, వైద్యరంగాల్లో పెట్టుబడులకు ఆసక్తిగా ఉందన్నారు. పరస్పర పెట్టుబడులతో ఇరుదేశాల బంధం మరింత బలపడిందని సీఎంకు వివరించారు. ఈ భేటీలో మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఉన్నారు.


దుబాయ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలకడానికి ఎదురుచూస్తున్న ప్రవాసాంధ్రులు

రేపు ప్రవాసాంధ్రులతో సీఎం సభ

ప్రవాసాంధ్ర బీమా పథకం ప్రారంభం

ఎవరైనా మరణిస్తే 10 లక్షల వరకు పరిహారం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సీఎం చంద్రబాబు శుక్రవారం దుబాయ్‌లో ప్రవాసాంధ్రులతో జరిపే సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీర్ఘకాలం సీఎంగా ఉన్నప్పటికీ ఆయన గల్ఫ్ దేశాల్లోని ప్రవాసాంధ్రులతో సభ నిర్వహించడం ఇదే తొలిసారి. దీంతో దుబాయ్‌లో రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు, అటు టీడీపీ శ్రేణులు ముమ్మర ఏర్పాట్లు చేశాయి. యూఏఈలోని వివిధ ఎమిరేట్ల నుంచి ప్రత్యేకంగా బస్సులు నడుపనున్నారు. అదేవిధంగా సౌదీ అరేబియా, ఖతర్, ఒమాన్, కువైత్, బహ్రెయిన్ దేశాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ప్రవాసీ ప్రముఖులు, టీడీపీ శ్రేణులు దుబాయ్ వీసాలు తీసుకుని చేరుకుంటున్నారు. టీడీపీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ అధ్వర్యంలో దుబాయ్‌లో ఐదుగురు ప్రతినిధులతో కూడిన బృందం ఈ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. భారతీయ కాన్సులేట్ అధికారులు కూడా పూర్తిగా సహకరిస్తున్నారు. కాగా.. ప్రవాసాంధ్రుల సంక్షేమం కోసం 'ప్రవాసాంధ్ర భరోసా' అనే వినూత్న బీమా పథకాన్ని చంద్రబాబు ఈ సభలో ప్రారంభించనున్నారు. ఎవరైనా మరణించిన సందర్భాల్లో ఈ పథకం కింద రూ.10 లక్షల వరకు పరిహారం అందించనున్నట్లు రాధాకృష్ణ చెప్పారు.

ఎన్ఐఏ కస్టడీకి ఉగ్రవాది భార్య సైరాబాను

- వారం రోజుల విచారణకు కోర్టు అనుమతి
- కడప సెంట్రల్ జైలు నుంచి విజయవాడకు తరలింపు

రాయచోటి/కడప క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కడప కేంద్ర కారాగారంలో ఉన్న ఉగ్రవాది అబూబకర్ సిద్దిఖీ భార్య సైరాబానును బుధవారం ఎన్ఐఏ అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు అనుమతితో ఉదయం 11.30 గంటలకు విజయవాడకు ప్రత్యేక వాహనంలో తరలించారు. వారం రోజులు ఆమెను విచారించనున్నారు. కాగా, అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో ఈ ఏడాది జూలై 1న తమిళనాడు ఏటీఎస్ పోలీసులు, అన్నమయ్య జిల్లా పోలీసులు సంయుక్తంగా దాడులు జరిపి సైరాబానును అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

100 శాతం మద్దతు ధర చెల్లించాలి

- ధాన్యం కొనుగోళ్లకు మార్గదర్శకాలు జారీ

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు చర్యలు చేపట్టింది. ధాన్యం సేకరణ కార్యకలాపాలను మెరుగుపరచడానికి మంత్రుల బృందం చేసిన సిఫారసులను పరిగణనలోకి తీసుకుంది. వికేంద్రీకృత సేకరణ ప్రక్రియ ద్వారా ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన మార్గదర్శకాలను సూచిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రైతులకు నూటికి నూరుశాతం మద్దతు ధర చెల్లించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. అన్ని జిల్లాల్లో రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి.. వ్యవసాయ శాఖ వద్దనున్న ఈ-పంట డేటా ఆధారంగా ముందుగానే ధాన్యం కొనుగోళ్లు చేయాలని నిర్దేశించింది. అయితే ఏ మిల్లుకు ధాన్యం పంపాలనేది ఎంచుకునే స్వేచ్ఛను రైతులకు కల్పించింది. ఈసారి కనీస మద్దతు ధరకు తక్కువ గాకుండా రైసు మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయడానికి ఓపెన్ మార్కెట్ కొనుగోలు కార్యకలాపాలకు అవకాశం కల్పించింది. సోర్టెక్స్, బ్లెండింగ్ సౌకర్యాలు ఉన్న రైసు మిల్లులకు మాత్రమే ప్రభుత్వం ధాన్యాన్ని కేటాయిస్తుంది. ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులను ముందుగానే సరఫరా చేసే బాధ్యత మిల్లర్లపైనే ఉంటుంది.

ఏ ఫర్ ఏపీ.. ఏఐ!

అభివృద్ధిలో మొదటి స్థానంలో రాష్ట్రం: చంద్రబాబు

- ఫ్యూచరిస్టిక్ సిటీగా అమరావతి
- ఇక్కడ ఇల్లు కట్టుకునే అవకాశం మిస్ కావొద్దు
- సీఐఐ పార్టనర్‌షిప్ రోడ్‌షోలో సీఎం పిలుపు



సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 'ఆంగ్ల వర్ణమాలలో 'ఏ' మొదటిది. ఆంధ్రప్రదేశ్.. అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉంటుంది. ఇప్పుడు ఏపీకి కృత్రిమ మేధ(ఏఐ)ను తీసుకొచ్చాం. రానున్న రోజుల్లో విశాఖ ఏఐ రంగంలో మొదటి స్థానంలో నిలుస్తుందనడంలో సందేహం లేదు' అని చంద్రబాబు అన్నారు. బుధవారం రాత్రి దుబాయ్‌లో జరిగిన సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. హాజరైన వివిధ యూఏఈ కంపెనీల ప్రతినిధులనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఏపీలో ఉన్న వనరులు, అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గత 16నెలల కాలంలో 10 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. త్వరలో మరో 6లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. 'ఏపీలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయి. ఎంవోయూలు కుదుర్చుకుందాం. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సుకు రండి' అని ఆహ్వానించారు. అమరావతిని ఫ్యూచరిస్టిక్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని.. అన్ని వసతులతో పాటు ప్రకృతిలో మమేకమయ్యేలా రాజధానిని నిర్మిస్తున్నామని చెప్పారు. 'వినూత్న పద్ధతుల్లో రాజధాని కోసం భూసమీకరణ చేపట్టాం. ఒక్క పిలుపుతో అమరావతి నిర్మాణానికి 29వేల మంది రైతులు ముందుకొచ్చి సుమారు 40వేల ఎకరాలు ఇచ్చారు. అదీ వారు నాపై ఉంచిన నమ్మకం. దేవేంద్రుడు ఉండే అమరావతిని స్వర్గం అంటారు. భూమిపై ఉండే అమరావతిని స్వర్గంలా నిర్మాణం చేస్తున్నాం. మీకు దుబాయ్‌లో.. భారతదేశంలో ఇల్లు ఉండి ఉండొచ్చు.. అమరావతిలో కూడా ఇల్లు ఏర్పాటు చేసుకునే సదవకాశాన్ని మిస్ చేసుకోవద్దు. మీరు ఇక్కడ చేసే రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నేను అమరావతిలో నా రాష్ట్ర ప్రజల కోసం చేస్తున్నాను. భూములిచ్చిన రైతులందరినీ ధనవంతులు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. 2047 నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యంగా పనిచేస్తున్నాం. అమరావతిలో రూ.100 కోట్లతో గ్రంథాలయం నిర్మాణానికి ముందుకొచ్చిన శోభా సంస్థకు ధన్యవాదాలు. ఆతిథ్య రంగాన్ని అభివృద్ధి చేసే ప్రక్రియలో భాగంగా స్టార్ హోటళ్లకు అనుమతులు ఇచ్చాం. టూరిజం రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చాం. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాం. స్కిల్ డెవలప్‌మెంట్‌లో యువతకు శిక్షణ ఇస్తున్నాం' అని సీఎం వివరించారు. ఏపీలో ఫ్యూచర్ వర్క్‌ఫోర్సును సిద్ధం చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. పరిశ్రమలకు అనుకూలంగా 24 పాలసీలు తెచ్చామని.. అవసరమైతే మరిన్ని తీసుకొస్తామని తెలిపారు.

ప్రతి 50 కిలోమీటర్లకు పోర్టు లేదా హార్బర్

సరైన ప్రతిపాదనలతో వస్తే పరిశ్రమల ఏర్పాటుకు వెంటనే ఆమోదం తెలుపుతామని సీఎం ప్రకటించారు. రాష్ట్రంలో ప్రతి 50 కిలోమీటర్లకు ఓ పోర్టు లేదా హార్బర్ ఉండేలా చూస్తున్నామన్నారు. ప్రస్తుతం ఏడు ఎయిర్‌పోర్టులు ఉన్నాయని.. మరో 9 రానున్నాయని తెలిపారు. 'ఎయిర్ కనెక్టివిటీ ద్వారా కార్గో రవాణాకు ప్రణాళికలు రూపొందించాం. జల, రైలు, రోడ్డు, వాయు మార్గాల ద్వారా కనెక్టివిటీ ఉండేలా చూస్తున్నాం. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త అనే విధానం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి కృషి చేస్తున్నాం. దీని కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేశాం' అని చెప్పారు.


దుబాయ్ ఫ్యూచర్ మ్యూజియంలో టెక్నాలజీని సీఎంకు వివరిస్తున్న అక్కడి అధికారులు

ఫ్యూచర్ మ్యూజియంకు సీఎం


చంద్రబాబు దుబాయ్ ఫ్యూచర్ మ్యూజియంను సందర్శించారు. దీనిని లివింగ్ మ్యూజియంగా రూపొందించారు. అంతరిక్షం, వాతావరణం, ఆరోగ్యం, విద్య, వైద్యం, ఏఐ వంటి రంగాల్లో భవిష్యత్ ఆవిష్కరణలు ఏ విధంగా ఉండబోతున్నాయో టెక్నాలజీ ఉపయోగించి ఇక్కడ ప్రదర్శిస్తుంటామని అధికారులు ఆయనకు వివరించారు. ఫ్యూచర్ జర్నీ పేరుతో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను కూడా సీఎం సందర్శించారు.

వారెవ్వా... విశాఖ

- 'గూగుల్'కు ముందే 'రక్షణ'లో అంతర్జాతీయ ఖ్యాతి
- టోర్పడోలు, అణు జలాంతర్గాములు, యుద్ధ నౌకల నిర్మాణ కేంద్రం
- తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం ఇదే...
- ప్రత్యామ్నాయ కేంద్రంగా 'వర్ష' నిర్మాణం
- అది... అణు జలాంతర్గాముల స్థావరం
- కొవ్వాడలో న్యూక్లియర్ పవర్ ప్లాంటు
- డీఆర్‌డీఓ అధీనంలో ఎన్ఎస్‌టీఎల్
- ఐఎన్ఎస్ కళింగలో మిస్సైల్ డిపో
- ఎస్‌బీసీలో అణు సబ్‌మెరైన్ల నిర్మాణం
- వచ్చే ఏడాది నుంచే పూర్తిగా 'నేవీ ఎయిర్‌పోర్ట్'
- అంతర్జాతీయ స్థాయిలో 'వ్యూహాత్మక విశాఖ'

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

'విశాఖపట్నం' పేరు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతోంది. గూగుల్ సంస్థ రూ.1.36 లక్షల కోట్లతో హైపర్ స్కేల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో విశాఖపట్నం ఎక్కడుందో ప్రపంచ వ్యాప్తంగా వెదుకుతున్నారు. అయితే... అంతకంటే ముందే అగ్ర దేశాలు విశాఖను 'ప్రపంచ వ్యూహాత్మక రక్షణ కేంద్రం'గా గుర్తించాయి. అమెరికా, చైనా శాటిలైట్లు విశాఖను నిఘా కళ్లతో నిత్యం పరిశీలిస్తుంటాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, దశలవారీగా ఏర్పాటు చేస్తున్న సంస్థలే దీనికి కారణం.



న్యూక్లియర్ సబ్‌మెరైన్ల తయారీ కేంద్రం

విశాఖపట్నంలో రెండు నౌకా నిర్మాణ కేంద్రాలు ఉన్నాయి. అందులో ఒకటి హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్. ఇక్కడ భారీ నౌకలతో పాటు సబ్‌మెరైన్ల నిర్మాణం, రీఫిట్ పనులు చేస్తారు. నష్టాల్లో ఉన్న ఈ సంస్థను ప్రభుత్వం రక్షణ శాఖ పరిధిలోకి తీసుకువచ్చింది. నేవీకి అవసరమైన 'సపోర్టింగ్ వెజల్స్' ఇక్కడ నిర్మిస్తున్నారు. ఇది కాకుండా నేవీకి ప్రత్యేకంగా 'షిప్ బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బీసీ) ఉంది. ఇక్కడ గతంలో యుద్ధ నౌకలు తయారు చేసేవారు. ఇప్పుడు ఇది పూర్తిగా న్యూక్లియర్ సబ్‌మెరైన్ల తయారీలో నిమగ్నమైంది. రష్యా సహకారంతో మొదట ఐఎన్ఎస్ అరిహంత్ సబ్‌మెరైన్ తయారుచేశారు. ఆ తర్వాత ఐఎన్ఎస్ అరిఘాత్, ఆపై ఐఎన్ఎస్ అర్ధిమాన్‌లను నిర్మించారు. ఎస్‌బీసీలో నాలుగో న్యూక్లియర్ సబ్‌మెరైన్ నిర్మాణంలో ఉంది. ఇది కాకుండా ప్రాజెక్టు-77 పేరుతో మరో ఆరు అధునాతన న్యూక్లియర్ సబ్‌మెరైన్ల నిర్మాణానికి గత ఏడాది అక్టోబరులో కేంద్ర రక్షణ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనికి అవసరమైన మౌలిక వసతుల కోసం రూ.40 వేల కోట్ల బడ్జెట్ ప్రకటించింది. ఈ ప్రాజెక్టులో తయారయ్యే మొదటి సబ్‌మెరైన్‌ను జర్మనీకి విక్రయించాలని నిర్ణయించారు. దీనిని రెండేళ్లలో అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఇది సుమారు రూ.50వేల కోట్ల ఒప్పందమని తెలుస్తోంది.



'తూర్పు' సింధూరం...

సాగర తీర నగరమైన విశాఖ వ్యూహాత్మక ప్రత్యేకతను గుర్తించిన కేంద్రం చాలాకాలం క్రితమే ఇక్కడ తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దానిని దశల వారీగా అభివృద్ధి చేస్తూ వచ్చింది. భవిష్యత్తు 'రక్షణ' అవసరాలను దృష్టిలో ఉంచుకొని విశాఖకు 50 కిలోమీటర్ల దూరంలోని రాంబిల్లిలో దాదాపు ఐదు వేల ఎకరాల్లో నేవీ ఆల్టర్నేటివ్ ఆపరేటింగ్ బేస్ (ఎన్ఏఓబీ) పేరుతో ప్రత్యామ్నాయ స్థావరం ఏర్పాటు చేస్తోంది. దీనికి 'వర్ష' అని నామకరణం చేశారు. ఇందులో తొలి దశ వచ్చే ఏడాది అంటే 2026లో ప్రారంభం కానుంది. దీనిని న్యూక్లియర్ సబ్‌మెరైన్ల స్థావరంగా చెప్పుకోవచ్చు. ఇక్కడ డాకింగ్ చేసే సబ్‌మెరైన్లు శాటిలైట్లకు కూడా అందవు. నిర్మాణాలన్నీ 'అండర్ గ్రౌండ్'లోనే. 'వర్ష'లో మొత్తం 12 న్యూక్లియర్ సబ్ మెరైన్లను 'డాక్' చేసే అవకాశముంది. ఎన్ఏఓబీకి అవసరమైన 'అణు' సహకారం అందించేందుకు బాబా అటామిక్ రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ సెంటర్(బార్క్)ను కూడా రాంబిల్లిలో నెలకొల్పారు. సబ్‌మెరైన్లలో ఉపయోగించే అణు రియాక్టర్లను బార్క్ తయారుచేసి అందిస్తుంది.



ఐఎన్ఎస్ కళింగలో మిస్సైల్ పార్క్



తూర్పు నౌకాదళానికి అవసరమైన ఆయుధ సామగ్రి నిల్వల కోసం భీమునిపట్నం సమీపాన 700 ఎకరాల్లో 'ఐఎన్ఎస్ కళింగ' ఏర్పాటుచేశారు. ఇక్కడే మెరైన్ కమెండోలకు శిక్షణ ఇస్తున్నారు. దీనిని ఇటీవల మిస్సైల్ పార్కుగా మార్చి 'అగ్నిప్రస్థ'గా నామకరణం చేశారు. ఇక్కడి నుంచి సముద్రంలోకి రహస్య మార్గం కూడా నిర్మించారని చెబుతారు. ఆకాశ్, పృథ్వీ వంటి మిస్సైళ్లు ఇక్కడే ఉన్నాయి.



డీఆర్‌డీఓ పరిశోధనశాలగా ఎన్ఎస్‌టీఎల్

విశాఖ విమానాశ్రయానికి సమీపంలో నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్) చాలాకాలంగా ఉంది. నేవీకి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇక్కడ అభివృద్ధి చేసేవారు. దీనిని కొద్దికాలం క్రితం డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ)కు అప్పగించి అభివృద్ధి చేస్తున్నారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌తో కలిసి ఇక్కడే 'వరుణాస్త్ర' టోర్పడోనూ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేశారు. భవిష్యత్తులో ఈ కేంద్రం మరింత కీలకంగా మారనుంది. దీనికి అనుబంధంగా పట్టాభిరెడ్డి తోటలో పలు కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఎక్కడెక్కడి నుంచో శాస్త్రవేత్తలు ఇక్కడికి వచ్చి వెళుతుంటారు.

కొవ్వాడలో న్యూక్లియర్ ప్లాంటు

విశాఖపట్నానికి 70 కిలోమీటర్ల దూరంలోని కొవ్వాడలో న్యూక్లియర్ పవర్ ప్లాంటును 2,079 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. ఇక్కడ వెయ్యి మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఆరు అణు రియాక్టర్లను నిర్మించనున్నారు. అక్కడ పనిచేసే అధికారుల కోసం టౌన్‌షిప్ నిర్మాణం కూడా పూర్తి చేశారు.



నేవీ చేతికి 'ఐఎన్ఎస్ డేగా'

విశాఖపట్నంలో నేవీ వైమానిక స్థావరం ఐఎన్ఎస్ డేగా. విశాఖలో పౌర విమానాశ్రయం నేవీ ఆధ్వర్యంలోనే నడుస్తోంది. ఒకవైపు పౌర విమానాలు, మరో వైపు నేవీ విమానాలు వచ్చి వెళుతుంటాయి. దీనివల్ల ఇక్కడ ఆంక్షలు ఎక్కువ. భోగాపురంలో అధునాతన అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం శరవేగంతో జరుగుతోంది. దీనిని వచ్చే ఏడాది సెప్టెంబరులో ప్రారంభించాలని నిర్ణయించారు. అది ప్రారంభం కాగానే విశాఖ విమానాశ్రయాన్ని పూర్తిగా ఐఎన్ఎస్ డేగా అవసరాలకు ఉపయోగించుకుంటారు. మరిన్ని యుద్ధ విమానాలు ఇక్కడికి వస్తాయి. శిక్షణ కార్యక్రమాలూ పెరుగుతాయి.

ఏడాదిలో ఆరుసార్లు వచ్చిన రాజ్‌నాథ్

విశాఖపట్నం భారతదేశ వ్యూహాత్మక రక్షణ కేంద్రంగా మారుతోంది. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించడానికి ఉన్నతస్థాయి అధికారులు తరచూ వస్తున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఏడాదిలో ఆరుసార్లు విశాఖ రావడం గమనార్హం. ఇక... విశాఖలో జరిగిన 'యోగాంధ్ర' కార్యక్రమానికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ సైతం తన పర్యటనలో నేవీ ప్రాజెక్టులను కూడా పరిశీలించారు. ఇందుకు కొన్ని గంటలు ప్రత్యేకంగా కేటాయించారు. కొందరు డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు హెలికాప్టర్లలో వచ్చి నడిసముద్రంలో నౌకలపై సమీక్షా సమావేశాలు నిర్వహించుకొని అటు నుంచి తిరిగి ఢిల్లీ వెళ్లిపోతుంటారు. వీటన్నింటి నేపథ్యంలోనే విశాఖను ప్రపంచ వ్యూహాత్మక రక్షణ కేంద్రంగా అభివర్ణిస్తున్నారు.

పల్లెపండుగ 2.0 పనులకు లైన్ క్లియర్!

- ఉపాధి మెటీరియల్ నిధుల కింద కేంద్రం 665 కోట్లు మంజూరు
- రాష్ట్ర వాటా 222 కోట్లతో కలిపి 887 కోట్లు చెల్లించే అవకాశం

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన మెటీరియల్ నిధులు బుధవారం విడుదల కావడంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పల్లెపండుగ 2.0 పనులు చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తోంది. తొలి విడత మూడో వాయిదా కింద రూ.665.42 కోట్లు మంజూరు చేస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. దానికి అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.222 కోట్లు విడుదల చేస్తుంది. మొత్తం రూ.887 కోట్ల మెటీరియల్ నిధులను పల్లెపండుగ కింద గ్రామాల్లో సిమెంటు రోడ్లు, మ్యాజిక్ డ్రైన్లు, మినీ గోకులాలు తదితర పనుల బిల్లులు చెల్లింపునకు వినియోగిస్తారు. పల్లెపండుగ 1.0లో రాష్ట్రవ్యాప్తంగా 4వేల కి.మీ.మేర సిమెంటు రోడ్లు నిర్మించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు, పంచాయతీరాజ్ అధికారుల చొరవ మేరకు కేంద్రం ఈ నిధులు విడుదల చేసింది.

పలు జిల్లాల్లో ఉపాధి అంబుడ్స్‌పర్సన్‌ల నియామకం

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉపాధి హామీ పథకం అంబుడ్స్‌పర్సన్‌లను నియమిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వేర్వేరుగా ఉత్తర్వులు జారీచేసింది. గుంటూరు జిల్లాకు చల్లా లలిత, కాకినాడకు కె.మల్లేశ్వరరావు, నంద్యాలకు మద్దిలేటి స్వామి, తిరుపతికి బి.మురళి, విజయనగరం జిల్లాకు అబ్దుల్ యాకుబ్ బాషా, పార్వతీపురం మన్యంకు ఎం.తిరుపతిరావు, ప్రకాశంకు వి.మనోహర్‌రావు, ఎన్టీఆర్‌కు బి.వెంకటరమణి, చిత్తూరుకు కడియాల వరదరాజులు, అన్నమయ్యకు కె.శ్రీరాములు, అనకాపల్లికి బి.వేణుగోపాల్, శ్రీకాకుళంకు ఐ.గురుమూర్తి, అనంతపురంకు బి.పద్మనాభరెడ్డిని నియమించారు. కర్నూలు జిల్లాలో అంబుడ్స్‌పర్సన్‌గా ఉన్న డాక్టర్ రాయసం సురేంద్రకుమార్‌ను మరో ఏడాది పాటు కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

మీరు తాగే మద్యం అసలైనదేనా?

- స్కాన్ చేసి నిర్ధారించుకోండి.. అవగాహన ప్రారంభించిన ఎక్సైజ్

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): 'మీరు తాగే మద్యం నిజమైనదేనా.. తెలుసుకోండి' పేరుతో ఎక్సైజ్ శాఖ బుధవారం అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది. నకిలీ మద్యం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఎక్సైజ్ సురక్ష యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆ యాప్‌ను వినియోగదారులు ఎక్కువ మంది వినియోగించేలా చర్యలు చేపట్టింది. ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా వినియోగదారులు వారు కొనుగోలు చేసిన మద్యం సీసాలను స్కాన్ చేసి అవి నిజమైనవేనా అని నిర్ధారణ చేసుకోవచ్చు. మద్యం సీసాలపై ఉండే క్యూఆర్ కోడ్‌ను సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేస్తే ఆ సీసా వివరాలన్నీ ఫోన్‌లో కనిపిస్తాయి. వివరాలు రాకపోతే ఆ సీసాను నకిలీదిగా పరిగణిస్తారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, యాప్ ద్వారా కొనుగోలు చేసిన మద్యం సీసాలను నిర్ధారించుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా అన్ని మద్యం షాపుల వద్ద పోస్టర్లు అంటిస్తున్నారు.

జూనియర్ కాలేజీల పనివేళలు మార్చండి

- ఇంటర్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ విజ్ఞప్తి

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనివేళలను ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటలుగా మార్చాలని ప్రభుత్వాన్ని ఇంటర్మీడియట్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ కోరింది. సంఘం మొదటి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశాన్ని బుధవారం విజయవాడలోని ఏపీఎన్జీవో హోమ్‌లో నిర్వహించారు. పలు సమస్యలను ఏపీఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్‌కు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.శ్రీనివాసులు, సీహెచ్ సుధాకర్ వివరించారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు.

అర్హులందరికీ అక్రిడేషన్లు ఇవ్వండి: ఏపీయూడబ్ల్యూజే

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ సదుపాయం కల్పించాలని సమాచార శాఖ కమిషనర్ విశ్వనాథన్‌కు ఏపీయూడబ్ల్యూజే విన్నవించింది. విజయవాడ ఎన్టీఆర్ పరిపాలనా భవనంలోని ఐ అండ్ పీఆర్ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు నేతృత్వంలో కంచల జయరాజ్, ఏచూరి శివ, చావా రవి తదితరులు కమిషనర్‌తో భేటీ అయ్యారు. జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్ల జారీ కోసం యూనియన్ల భాగస్వామ్యంతో కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. పాత్రికేయులపై దాడుల నివారణ కమిటీ, ప్రొఫెషనల్ ఎథిక్స్ కమిటీ, వెల్ఫేర్ ఫండ్ కమిటీలను పునరుద్ధరించాలని కోరారు.

కుమ్మేసిన వాన

తీవ్ర అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు.. లోతట్టు ప్రాంతాలు జలమయం




భారీ వర్షానికి ఒంగోలులోని కర్నూల్‌రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు, నెల్లూరు జిల్లా టంకంవారిపాలెంలో వర్షాలకు కూలిన రేకుల ఇల్లు



నెల్లూరు జిల్లా కావలి రామమూర్తి పేటలో కూలిన చెట్టు

- గుంటూరు జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు మృతి
- నెల్లూరు జిల్లాలో నేడూ విద్యాసంస్థలకు సెలవు
- కలెక్టర్లు, ఎస్పీలతో హోంమంత్రి వీడియో కాన్ఫరెన్స్
- అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూముల ఏర్పాటుకు ఆదేశం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు పడ్డాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కూడా వర్షాలు కురిశాయి. నెల్లూరు జిల్లాలో వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడంతో పలుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరింది. నెల్లూరు నగరంలో రోడ్లపై నీరు ప్రవహిస్తుండగా, ఎక్కడికక్కడ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది ఆ నీటిని బయటకు పంపుతున్నారు. ఈ జిల్లాలోని 957.4 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. గురువారం కూడా జిల్లాలో పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. తిరుపతి జిల్లాలోని 15 మండలాల్లో పది సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. శ్రీకాళహస్తిలో అత్యధికంగా 18.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో స్వర్ణముఖి, కైవల్య, అరుణా నదులతోపాటు వాగులు, జలపాతాలూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఏర్పేడు మండలం జంగాలపల్లి చెరువుకు గండి పడింది. రోడ్డు కొట్టుకుపోవడం, బ్రిడ్జిలు, కాజ్‌వేలపైకి నీరు చేరడంతో పలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. తిరుపతి జిల్లావ్యాప్తంగా 19 మార్గాల్లో 44 ఆర్టీసీ బస్సు సర్వీసులు రద్దయ్యాయి. భారీ వర్షాలతో పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు బుధవారం సెలవు ప్రకటించారు. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శేషాచలం కొండల నుంచీ వచ్చే కపిలతీర్థం జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. నారాయణవనం మండలం కైలాసనాథ కోన వద్ద జలపాతం, పుత్తూరు మండలం మూలకోన జలపాతం ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మూలకోన జలపాతానికి సందర్శకులు రాకుండా ఎకో టూరిజం చెక్‌పోస్టు మూసివేశారు. తిరుమలలో ముసురుతో చలితీవ్రత పెరిగింది. ముందస్తు జాగ్రత్తగా శ్రీవారిపాదాలు, పాపవినాశనం మార్గాలను టీటీడీ మంగళవారం రాత్రే మూసివేసింది. బుధవారం కూడా భక్తులను అనుమతించలేదు. రెండవఘాట్‌రోడ్డులో ఒక చెట్టు రోడ్డుమీదకు వాలిపోవడంతో సిబ్బంది తొలగించారు. వానలతో శేషాచలం కొండల్లో జలపాతాలు దూకుతున్నాయి. మరోవైపు పొగమంచు శేషాచలాన్ని కప్పేస్తోంది. ప్రకాశం జిల్లాలోనూ వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కొత్తపట్నం, ఒంగోలు అర్బన్, రూరల్, సింగరాయకొండ మండలాల్లో 10 నుంచి 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఒంగోలు నగరంలో ప్రధాన వీధులన్నీ చెరువులను తలపించగా శివారు కాలనీలు జలమయమయ్యాయి. గుంటూరు జిల్లా పొన్నూరులో పొలంలో కలుపుతీత పనులకు వెళ్లిన ఇద్దరు మహిళా కూలీలు పిడుగుపాటుకు మృతి చెందగా మరో మహిళా కూలి తీవ్రంగా గాయపడ్డారు. మృతులను వలపర్ల కమలమ్మ అలియాస్ మరియమ్మ(45), షేక్ ముజాహిదా(50)గా గుర్తించారు. నీలం మాణిక్యమ్మకు గాయాలవడంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఏలూరు జిల్లాలోనూ పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.శ్రీకాళహస్తిలో 18.4, నెల్లూరు జిల్లా ఆత్మకూరులో 14.5, దుత్తలూరులో 11.7 మి.మీ, కందుకూరులో 10.8, అనంతసాగరంలో 10.3, మర్రిపాడులో 8.9, మొగిలిచర్లలో 7.9, కృష్ణా జిల్లా భావదేవరపల్లిలో 7.5, ప్రకాశం జిల్లా ఉమ్మారెడ్డిపల్లెలో 6.2, గుంటూరు జిల్లా దుగ్గిరాలలో 6.1 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

నేడు మరో అల్పపీడనం..

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈనెల 23వ తేదీన అల్పపీడనం ఏర్పడుతుందని కొన్ని మోడళ్లు, ఈనెల 25వ తేదీ తర్వాత ఏర్పడుతుందని మరికొన్ని మోడళ్లు అంచనా వేస్తున్నాయి. హిందూ మహాసముద్రంలో తుఫాన్లకు అనుకూలమైన వాతావరణం నెలకొనడంతో బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో అల్పపీడనాలు/వాయుగుండాలు ఏర్పడుతున్నాయని ఐఎండీ పేర్కొంది.

కలెక్టర్లు, ఎస్పీలు అప్రమత్తంగా ఉండాలి: హోంమంత్రి

తీవ్ర అల్పపీడనం నేపథ్యంలో క్షేత్ర స్థాయి అధికారులను అందుబాటులో ఉంచాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం రాత్రి అనకాపల్లి కలెక్టరేట్ నుంచి అల్పపీడన ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో హోంమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అత్యవసర సమీక్ష నిర్వహించారు. అన్ని జిల్లాల్లో కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటుచేసి 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు.

ఆకస్మిక వరదలపై అప్రమత్తం: డిప్యూటీ సీఎం పవన్

రాష్ట్రంలో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని పలు జిల్లాలకు హెచ్చరికలు వచ్చిన క్రమంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో అధికారులు ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేయాలన్నారు. డ్రైనేజీలు, కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తక్షణమే తొలగించాలన్నారు. కాగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.

నేడూ భారీ, అతిభారీ వర్షాలు..

తీవ్ర అల్పపీడనం గురువారం దక్షిణ కోస్తాలో తీరం దాటి పశ్చిమంగా పయనించి అరేబియా సముద్రంలోని వాయుగుండంలో విలీనమవుతుంది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అతిభారీగా, ప్రకాశం, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. కృష్ణపట్నం, నిజాంపట్నం, మచిలీపట్నంలో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్ల వద్దని సూచించారు.

భీమవరం డీఎస్పీకి మంచి ట్రాక్ రికార్డు

- వాహనాలు, సొత్తు రికవరీలో బాగా పనిచేస్తున్నారు: రఘురామ



విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డీఎస్పీ జయసూర్యకు మంచి ట్రాక్ రికార్డు ఉందని అసెంబ్లీ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు చెప్పారు. బుధవారం విశాఖలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వారు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. డీఎస్పీ మంచి అధికారి అని తనకు రిపోర్టు ఉందని.. భీమవరంలో చోరీకి గురైన వాహనాలు, ఇతర సొత్తు రికవరీలో ఆయన బాగా పనిచేస్తున్నారని తెలిపారు. అయినా విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలుంటాయని.. ఆయన తప్పుచేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటారని.. లేదంటే ఉండవని చెప్పారు. జూదంపై రాష్ట్రప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, ఎక్కడా రాజీపడడం లేదన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పోలీసులు గట్టి నిఘా పెట్టారని, ఉండి ప్రాంతంలో పేకాట శిబిరాలు లేవని చెప్పారు. గోదావరి జిల్లాల్లో చాలామంది పేకాట ఆడుతుంటారని, 13 ముక్కలాట ఆడుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన శాఖతో పాటు ఇతర శాఖలపై దృష్టి పెట్టడం సంతోషమన్నారు.

డీఎస్పీ జయసూర్యపై ఎస్పీ విచారణ

భీమవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డీఎస్పీ జయసూర్యపై వచ్చిన ఫిర్యాదులను పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ, విచారణాధికారి నయీం పరిశీలిస్తున్నారు. బాధితులను బుధవారం విచారించారు. వారి ఫిర్యాదులు వాస్తవమైతే ఎంతటి వారినైనా వదిలేది లేదని మీడియాతో మాట్లాడుతూ స్పష్టం చేశారు. డీఎస్పీపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు పలు ఫిర్యాదులు వెళ్లడం.. ఆయన దీనిపై నేరుగా ఎస్పీ, డీజీపీలతో మాట్లాడి నివేదిక కోరడం.. ప్రభుత్వం విచారణకు ఆదేశించడం తెలిసిందే. ఉండి నియోజకవర్గంలో ఇద్దరు భూయజమానుల మధ్య భూతగాదా విషయంలో జయసూర్య తలదూర్చారని.. భూమి కోల్పోయిన బాధితుడికి న్యాయం జరక్కపోగా.. అతడికి నష్టం వాటిల్లేలా డీఎస్పీ జోక్యం చేసుకున్నారని కూడా పవన్‌కు అందిన ఫిర్యాదుల్లో ఉన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

హరిత రవాణాకు మేం సిద్ధం

- ఆర్టీసీ బస్సుల 100% విద్యుదీకరణకు నిర్ణయం: కృష్ణబాబు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన హరిత రవాణా(క్లీన్ మొబిలిటీ) కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని రవాణా శాఖ ప్రత్యేక సీఎస్ ఎంటీ కృష్ణబాబు స్పష్టం చేశారు. క్లీన్ మొబిలిటీ కార్యక్రమానికి మద్దతు కోరేందుకు ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) జాతీయ సలహాదారు ఎ.చంద్రశేఖర్ రెడ్డి బుధవారం కృష్ణబాబును కలిశారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ... 'ఈ-మొబిలిటీ పాలసీలో భాగంగా రాష్ట్రంలోని ఏపీఎస్ఆర్టీసీ బస్సులన్నింటినీ నూరు శాతం విద్యుత్తు వాహనాలుగా మార్చేందుకు సీఎం కృతనిశ్చయంతో ఉన్నారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతంగా పూర్తి చేస్తాం. దానికి కేంద్రం జాతీయ స్థాయిలో రూ.10,900 కోట్లతో ప్రారంభించిన ప్రధాన మంత్రి ఈ-డ్రైవ్ స్కీంను నూరు శాతం వినియోగించుకుంటాం. ఆర్టీసీ బస్సులు నూరుశాతం విద్యుదీకరణ విషయంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ(బీఈఈ), కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్(సీఈఎస్ఎల్), ఈఈఎస్ఎల్ వంటి సంస్థల సహకారాన్ని కూడా కోరుతున్నాం' అని తెలిపారు.

5న 'జీశాట్-7ఆర్' ప్రయోగం

సూళ్లూరుపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇస్రో నవంబరులో రెండు ప్రయోగాలకు సిద్ధమవుతోంది. తొలుత నవంబరు 5న ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా భారత నౌకాదళం సేవలకు ఉపయోగపడే అధునాతన బహుళబ్యాండ్ కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్-7ఆర్ (సీఎంఎస్-02)ను రోదసీలోకి పంపనుంది. ఈ ప్రయోగం తర్వాత నవంబరు నెలాఖరులో ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్ బ్లాక్-2 ప్రయోగం చేపట్టనుంది. దీనికి సంబంధించిన రాకెట్ పరికరాలు రెండు ప్రత్యేక వాహనాల్లో బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన భారీ భద్రత నడుమ షార్‌కు తీసుకొచ్చారు. ప్రయోగ పర్యవేక్షణ కోసం ఇప్పటికే అమెరికాకు చెందిన 8 మంది శాస్త్రవేత్తల బృందం షార్‌కు చేరుకున్నారు.

మాంసం కొనుగోళ్లపై కార్తీక మాసం ఎఫెక్ట్

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం కావడంతో తొలి రోజు బుధవారమే చికెన్, మటన్ కొనుగోళ్లు కొంత తగ్గాయని వ్యాపారులు చెప్తున్నారు. కార్తీక పూజలు చేసే మాంస ప్రియులైతే నెల రోజుల పాటు మాంసం ముట్టరు. ఇళ్లలోనూ వండరు. ఈ కారణంగా చికెన్, మటన్ కొనుగోళ్లు తగ్గనున్నాయి. ప్రస్తుతం చికెన్ కిలో రూ.220-250 మధ్య ఉంది. నేడో, రేపో ఇది రూ.200కు తగ్గుతుందని భావిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.